MARXISM AJAEYAM

Ankalla Prudhvi Raj

“ఆ నలుగురు తమ దారి చూసుకొన్నారు. నన్ను మాత్రం ఈ అడవి మధ్యలో వదిలేశారు. ఈ అడవిని, మృగాలను, మనుషులను, వారికి ఎదురయిన చిక్కులను కల్పించింది నేనే. నా కల్పనకు ఛాయలు అవి. కానీ, ఇప్పుడు అవన్నీ నన్నే ఛాయా భావనని చేసి, తామంతా భౌతిక రూపాలు ధరించేశాయి. నన్నొక సశేషంగా వదిలేశాయి. కంచెకు చేరని కథలాగే, నేను వేసిన ప్రశ్నకూ ఇంకా జవాబు దొరకలేదు కదూ!

మార్క్సిజం అజేయమా? కాదా?

అనేది తేల్చడం నా పని కాదు. ఈ వ్యాసాలు చదువుకొని మీరే తెలుసుకోండి!”

.... రివేరా

మార్క్సిజం అజేయం

అంకాళ్ళ పృథ్వీరాజ్



విప్లవ రచయితల సంఘం

కృష్ణా జిల్లా యూనిట్

మార్క్సిజం అజేయం

అంకాళ్ళ పృథ్విరాజ్

కృష్ణాజిల్లా యూనిట్

మార్క్సిజం అజేయం (వ్యాసాలు)
అంకాళ్ళ పృథ్వీరాజ్

విరసం ప్రచురణ

website : www.virasam.org,
Facebook : Viplava Rachayitala Sangham
like Page : virasam.org

ప్రచురణ : మార్చి, 2018

ప్రతులు : 500

ప్రతులకు : **అనేక పుస్తక కేంద్రం,** విజయవాడ
ఫోన్ : 9247253884
&
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

లే అవుట్ &
కవర్ పేజి : ఉపేంద్ర

వెల : **రూ. 50/-**

ప్రింటింగ్ : నాగేంద్ర ఎంటర్‌ప్రైజెస్, విజయవాడ.
ఫోన్ : 0866 257511

అంకితం
నా మిత్రుడు
కామ్రేడ్ నగేష్‌కు (కల్మాసుక్కాల్)

- 133వ మార్క్స్ వర్థంతి
  భారతదేశంలో మార్క్సిజం అజేయం!
- మార్క్సిజం అజేయం
- విప్లవ విద్యార్థి ఉద్యమం – నక్సల్బరీ
- ఉదమ్ సింగ్ స్ఫూర్తితో...
- వివేక్ మరణం – మిగిలిన ప్రశ్న?
- కార్మికవర్గ ప్రజాస్వామ్యం
- మార్క్సిజాన్ని అధ్యయనం చేద్దాం!
- మతం మత్తుమందే !
- గోవధ నిషేధంతో కప్పబడ్డ వాస్తవాలు...
- గ్రామీణ ప్రాంతవర్గ పరిశీలన ఎలా చేయాలి?
- ఎఫ్.డి.ఐ.ల విషకౌగిలిలో భారతదేశం
- తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకుంటున్న పాలక పార్టీలపై తిరగబడండి.
- తెలంగాణపై అఖిలపక్ష భేటి – ప్రజావంచన
- అభివృద్ధికి నోచుకోని తెలంగాణ
- విప్లవయోధుడు కాస్ట్రో
- రెడార్మి – లాంగ్‌మార్చ్
- శాంతించని హెచ్‌సీయూ !

మార్క్సిజం అజేయమా?

నలుగురు స్నేహితులు అడవిలో నడుస్తున్నారు. చేరుకోవాల్సిన ఊరుకు దారి తెలియక అడివంతా తిరుగుతూనే ఉన్నారు. బాగా ఆకలేసింది. వారంతా ఒక చెట్టు కిందకు వెళ్లారు. ఆ చెట్టు మీది కాయలు కొట్టి తిందామనుకొని, కొన్ని రాళ్లు యేరారు. గురిచూసి కొట్టారు. కాయ పడలేదు. రెండు... మూడు... నాలుగు... కొడుతూనే ఉన్నారు. రాలని కాయ వగరు అనుకొని, అక్కడనుంచి వెళుతూ, విసురుగా వారిలో ఒకడు రాయిని విసిరాడు. అది కాయల గుత్తికి తగిలి జలజలా కాయలు కిందపడ్డాయి. ఆకలి మీద ఉన్న ఆ నలుగురు, గబగబా ఆ కాయలను యేరుకొని ఆ చెట్టు కిందే కూర్చొని తినేశారు. ఆకలి తీరింది. ఆలోచన మొదలయింది.

“గురిచూసి కొట్టినప్పుడు కాయలు పడలేదు. యథాలాపంగా రాయి విసిరినప్పుడు మాత్రమే మన ఆకలి తీర్చే ఇన్ని కాయలు కిందపడ్డాయి. ఈలెక్కన మనిషి ఇప్పటిదాకా గెలిచిన పోరాటాలన్నీ గురితప్పి, గుర్తింపులోకి వచ్చినవే కదా” అని వారిలో ఒకడు అనుమానం వెలిబుచ్చాడు. “నువ్వు చెట్టు, కాయ, రాయి దాకా పోయావు. అసలు మనమీ అడవిలో దారి తప్పకుండా ఉంటే ఇంత కమ్మనైన తీపి ఫలాలు తినగలిగేవారమా? కాబట్టి, దారి తప్పితేనే కొత్త దారి పడుతుంది” అని రెండోవాడు తేల్చేశాడు. “ఇంత చర్చ ఎందుకురా? ఆకలి అనే భావన మనకు కలిగింది. దానిని తీర్చుకోవడానికి రాయి అనే భౌతిక సాధనం వాడాం. లేదంటే ఈ చెట్టు, ఈ కాయ ఉనికిలోకి వచ్చేవా? కాబట్టి, అటు ఆకలిని తీర్చిందీ, ఇటు ఈ

చెట్టు, కాయలను అస్థిత్వంలోకి తెచ్చిందీ ఈ రాయే. ఈ భౌతిక సాధనాన్ని ఎలా ప్రయోగించామన్నది కాదు ముఖ్యం. ప్రయోగించామా లేదా అనేదే ప్రధానం" అని, ఏమంటారు అన్నట్టు తన స్నేహితుల వైపు మూడోవాడు చూశాడు. "ఈ కాయలు ఆ చెట్టుపైన లేకపోతే రాయి ఏమి చేస్తుంది? పైగా పక్వానికి వచ్చాయవి. రాయితో రాలగొట్టకపోయినా, రాలిపడేవే. ఇక్కడ రాయిది కేవలం పరోక్ష చర్య మాత్రమే. కాయలు పడే సమయానికి మనం ఈ చెట్టు కిందకు వచ్చాం. అంతే" అని చివరివాడు స్పష్టం చేశాడు. రాయి–కాయ, చెట్టు–ఆకలి, అడవి–దారి అంటూ చాలాసేపు వారంతా వాదులాడుకొన్నారు. ఒకరిని ఒకరు భావవాదులని, భౌతిక వాదులని, అస్థిత్వవాదులని జమ కట్టేసుకొన్నారు.

అప్పటిదాకా నడినెత్తిన ఉన్న సూర్యుడు పడమట వైపునకు వాలాడు. వారు కూర్చొన్న చెట్టు కింద మచ్చల పులిలా పరుచుకొన్న ఎండ, పలచబడటం మొదలయింది. ఇక దారి పట్టాల్సిన సమయం అయిందని ఆ నలుగురు స్నేహితులు అనుకొన్నారు. దీంతో తమ మధ్య చర్చను తమ గమనం, గమ్యం వైపునకు వాళ్లు మళ్లించారు. ఇక తాము కలిసి నడవడం సాధ్యం కాదనుకొన్నారు. ఎవరి వాదన సరయిందయితే వారికే దారి దొరుకుతుందనుకొని, ఆ నలుగురూ నాలుగు దిక్కులకు బయలుదేరారు. గంట, గంటన్నర తరువాత, అంతా తిరిగి అదే చెట్టు కిందకు చేరుకొన్నారు. రాయి–కాయ– ఆకలి– చెట్టు– దారి– దిక్కు ఎవరు ఏమన్నా, ఎవరు తమదే ధర్మం, తమదే సత్యం, తామే అఖండం అన్నా , అడవి మృగాలు మాత్రం ఏ ఒక్కరినీ వదిలిపెట్టలేదు. వేర్వేరు మార్గాల్లో కదిలిన ఆ నలుగురినీ తరిమాయి. కలిసి నడవడమా లేక అడవిలోనే మృగాలకు ఆహారం అయిపోవడమా అనేది తప్ప వారికి ఇప్పుడు మరోదారి కనిపించలేదు. మరికొద్దిసేపయితే ఆ దారి కూడా కానరానంత చీకటి అడవిని చుట్టేసుకుంటుంది.

'సరే.. రాయి గురి తప్పితే ఏమి... తప్పకుంటే ఏమి.. ఆకలి తీరడం ముఖ్యం. రాయి దానికి భౌతిక సాధనం. అడవిలో దారి కానరాక తిరిగి

తిరిగి అలసిపోవడం అనే భౌతిక చర్య... ఆకలి అనే భావనను కలిగిస్తే... రాయి అనే భౌతిక సాధనం ద్వారా మనం భావనాత్మకంగా ప్రతిస్పందించాం. కాబట్టి, ఆకలికి సంబంధించిన ఎరుక, రాయి అనే సాధనం ఒకే క్రమంలో కదులుతూ, మన అవసరాన్ని తీర్చాయి" అని మొదటివాడు సర్దుబాటు చేశాడు. "సరే..ఎవరో చెప్పారని మనం బయలుదేరాం. దారితప్పిపోయి తీపి ఫలాలూ తిన్నాం. ఈ అడవిలో చిక్కుకొని కష్టాలూ పడుతున్నాం. మనకు దృగ్గోచరం కాని ఆ దారి ఇప్పటికి ఒక భావన మాత్రమే. దానిని వెతకడం అనే భౌతిక చర్య, ఆకలి అనే భావనకు మనల్ని గురిచేసింది. దానికి మనం కాయలు కొట్టడం అనే భౌతికచర్యతో ప్రతిస్పందించాం. కాబట్టి, దారిని వెతకబోవడం, కాయలు కొట్టడమనే క్రమం ఆకలి తీరడంతో పూర్తయింది" అని రెండోవాడు రాజీకి ప్రతిపాదించాడు. "సరే...రాయి మాత్రమే ఏం చేయగలదు? అదొక నిర్జీవ సాధనం. ఆకలి అనే ఎరుకకు భావనాత్మక ప్రతిస్పందన అది. ఆ రాయి తగిలి కాయలు పడ్డాయి. తిన్నాం. ఆకలి తీరింది. కాబట్టి, ఆకలి ఎరుక – రాయి అనే గొలుసుకట్టు... ఆకలి తీరే దారిని మనకు చూపించింది" అని మూడోవాడు మెట్టు దిగాడు. "సరే..చెట్టు లేకుండా కాయకి, రాయి లేకుండా చెట్టుకి, ఆకలి లేకుండా రాయికి, అడవిలో దారి వెతుకులాట లేకుండా ఆకలికి అస్థిత్వమే లేదు" అని నాలుగోవాడు కూడా గొంతు కలిపాడు.

ఇన్ని భౌతికచర్యలకు ప్రేరణగా నిలిచిన ఆకలి అనేది ఇకనెంత మాత్రం భావన మాత్రమే కాదని, అదీ ఒక భౌతిక వాస్తవికతేనని ఆ నలుగురూ మూకుమ్మడిగా తీర్మానించుకొన్నారు. అలాగే, ఆకలి అనే ఎరుక వెంట సాగిన ఈ భౌతిక చర్యలు కూడా, ఆ భావనాత్మక ప్రక్రియలో భాగాలేనని తేల్చుకొన్నారు. ఇలా వారు తమ మధ్య ఘర్షణను ప్రేరేపించిన భౌతిక కారణాలను, భావనాత్మక మార్గంలో సయోధ్యపరుచుకొన్నారు. అడవిలో దారి వెతుక్కొంటూ అంతా ముందుకు కదిలారు.

****

ఆ నలుగురు స్నేహితులు తమ దారి తాము చూసుకొన్నారు. నన్ను మాత్రం ఈఅడవి మధ్యలో వదిలేశారు. ఈ అడవినీ, మృగాలనూ, మనుషులనూ, వారికి ఎదురయిన చిక్కులనూ కల్పించింది నేనే. నా కల్పనకు ఛాయలవి. కానీ ఇప్పుడు అవన్నీ నన్నే ఛాయాభావనని చేసి, తామంతా భౌతిక రూపాలను ధరించేశాయి. నన్నొక సశేషంలా వదిలేశాయి. కంచెకు చేరని కథలాగే, నేను వేసిన ప్రశ్నకూ ఇంకా జవాబు దొరకలేదు కదూ!

మార్క్సిజం అజేయమా? కాదా?

అనేది తేల్చడం నాపని కాదు. ఈ వ్యాసాలు చదువుకొని మీరే తెలుసుకోండి.

– రివేరా, విజయవాడ

మార్క్సిజంలోకి వాట్సాప్ తరం

మార్క్స్ ద్విశత జయంతి సందర్భంగా చేయవల్సిన కార్యక్రమాల గురించి మాట్లాడుకోవడానికి విరసం కార్యవర్గం 25 ఫిబ్రవరి 2018న హైదరాబాద్‌లో సమావేశమైంది. మార్క్స్ సంవిధానం గూర్చి చాలా సేపు చర్చించుకున్నాం. తత్వశాస్త్రంలో, సామాజిక, రాజకీయార్థిక, చారిత్రక విశ్లేషణలో మార్క్స్ పద్ధతి గురించి శిక్షణా తరగతులు, సెమినార్స్, బహిరంగ సభలు జరపాలని అనుకున్నాం. ఈ నేపథ్యంలో మార్క్సిజం గురించి మాట్లాడే వ్యక్తుల జాబితా కోసం ఆలోచించాం. రెండు తెలుగు రాష్ట్రాలలో మార్క్సిస్ట్ ప్రాపంచిక దృక్పథం కలిగిన వ్యక్తులు ఇద్దరి కంటే మించలేదు. మార్క్స్‌ను బాగా చదువుకొని ఆకలింపు చేసుకొని సమాజానికి అన్వయించిన తరమంతా వెళ్ళిపోయింది. ఈ తరానికి మార్క్స్ బిట్‌క్వశ్చనే తప్ప సమాజాన్ని మార్చే సామాజిక శాస్త్రవేత్తగా తెలియదు. కనుక విరసం బయట మార్క్స్ మీద మాట్లాడే వాళ్లు లేరు.

తెలుగు నేల మీద ఆర్థిక, రాజకీయ సామాజిక, సాహిత్య, సాంస్కృతిక చరిత్రను గొప్పగా ప్రభావితం చేసిన సిద్ధాంతం మార్క్సిజం. మార్క్సిజం పునాదిగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఈ నేల మీద ఉండగా ఇవ్వాళ ఆ మార్క్సిజం ప్రభావం లేకపోవడం విషాదం. ఇలా ఆలోచిస్తూ రాత్రి ఇంటికి చేరుకున్నాను. రీడింగ్ టేబుల్ ముందు కూర్చోగానే పృథ్వి ముందుమాట కోసం పంపించిన వ్యాసాలు కనిపించాయి. వాటిని చదవడం మొదలుపెట్టగానే నేను మునుపటి విషాదంనుంచి ఆశవాహంలోకి వెళ్లాను. ఈ తరంలో కూడా మార్క్సిజాన్ని సీరియస్‌గా అధ్యయనం చేసే

వాళ్ళు ఉన్నందుకు ముఖ్యంగా విరసం లోపల కావటం మరింత సంతోషమేసింది. ఇప్పటికీ విరసం సభ్యులు మాత్రమే మార్క్సిజం పట్ల అధ్యయనం, అన్వయంతో ఉన్నారని మరోసారి రుజువైంది.

పృథ్వి విజయవాడలో పుట్టి పెరిగాడు. బాల్యం నుంచే ప్రజా ఉద్యమాల ప్రభావం ఉండింది. ఇంట్లో అధ్యయనం చేసే వాతావరణం ఉండటం వలన మొదటి నుంచి క్లాసిక్స్ పరిచయమయ్యాయి. ఆ పరిచయాన్ని గాఢతతో కూడిన అధ్యయనంగా మార్చుకున్నాడు. ఉన్నత విద్య కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటికి వచ్చాడు. అది తెలంగాణ ఉద్యమం జరుగుతుండిన కాలం. ఆయనలో ఉన్న ప్రాపంచిక దృక్పథం వలన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యాడు. అంతమాత్రమే కాకుండా తెలంగాణ విద్యార్థివేదిక(టీవీవీ)లో సభ్యుడై చురుకుగా పాల్గొన్నాడు. క్యాంపస్‌లో మెస్ వర్కర్స్ సమస్యల నుంచి మొదలు పెట్టి ఒరిస్సా కార్మికుల సమస్యల వరకు గుర్తించి పరిష్కారం కోసం పోరాటాలు చేసాడు. ఇంత విస్తృత ఆచరణ ఆయనకు మార్క్సిస్ట్ అధ్యయనం వలన సాధ్యమైంది.

ఈ నేపథ్యంలో ఆయన రాసిన 'మార్క్సిజం అజేయం' అనే వ్యాస సంపుటిని అర్థం చేసుకుంటే మనకు ఆశ్చర్యంగొలిపే ఆనందం కలుగుతుంది. ముప్పై ఏళ్ళలోపు ఉండి మార్క్సిజం గురించి మాట్లాడే వాళ్ళు విరసం బయట రెండు తెలుగు రాష్ట్రాలలో ఎవరూ లేరని చెప్పవచ్చు. విరసంలో పృథ్వి లాంటి కొందరు ఉన్నారు. అయితే మార్క్సిజం గురించి చదివే వాళ్లు ఉన్నప్పటికి దాని గురించి రాసే సాహసం చేయరు. కాని పృథ్వి చేసాడు.

ఆయన మన ముందుకు తెస్తున్న ఈ పుస్తకంలో పదిహేడు వ్యాసాలు ఉన్నాయి. వాటిలో ఐదు వ్యాసాలు మార్క్సిజం మీద మరో నాలుగు తెలంగాణ మీద, ఇంకో నాలుగు వ్యక్తులతో ఉండిన జ్ఞాపకాల మీద రాసాడు. ఇంకా మతం, గోవధ, ఎఫ్‌డిఐ, వర్గ పరిశీలన మీద వ్యాసాలు ఉన్నాయి. ఒకే విషయం మీద ఎక్కువ వ్యాసాలున్నవి మార్క్సిజంపైనే. తన ప్రాపంచిక దృక్పథాన్ని వ్యక్తం చేసే వ్యాసాలతో ప్రారంభించాడు. వాటి పునాది మీదే

ఇతర సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను విశ్లేషించాడు. ఆయన పాటించిన ఈ క్రమం వలన పాఠకుడికి చదవడం సులభమవుతుంది. రచయిత పరిణామం కూడా తెలుస్తుంది. ఈ ఔచిత్యాన్ని పృథ్వి పాటించాడు.

133వ మార్క్స్ వర్ధంతి సందర్భంగా రాసిన వ్యాసం చాలా సమాచారాన్ని ప్రోది చేసేలా ఉంది. కొత్తగా మార్క్స్ గురించి తెలుసు కోవాలనుకునే వారికి ఈ వ్యాసం చాలా ఉపయోగకరం. మార్క్స్ జననం, ఆయన సిద్ధాంతం, మార్క్స్–భారతదేశం, భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ– దీని పరిమితులు ఇట్లా వ్యాసాన్ని నాలుగు భాగాలుగా విభజించి రాసాడు. వ్యాసానికి ప్రారంభం దర్వాజలాంటిది. ప్రారంభం ఎంత బాగుంటే వ్యాస పఠనం అంత సులభంగా ఉంటుంది. పాఠకున్ని వ్యాసంలోకి దించే వ్యాస శిల్పం పృథ్వి మొదట వ్యాసంలోనే ఉంది. "కార్ల్ మార్క్స్ ఇక్కడ విస్మరించబడ్డాడు, పటానికి వేలాడదీయబడ్డాడు" అని వాక్యం మొదలవుతుంది. మార్క్స్ బాల్యం, విద్యాభ్యాసం, రాజకీయ కార్యకలాపాలు మొదట భాగంలో వివరించి మార్క్స్ తాత్వికతను రెండో భాగంలో చెప్పాడు. చిన్న చిన్న శీర్షికలతో మార్క్స్ సారాన్నంతా క్రమ పద్ధతిలో వివరించాడు. 'మార్క్సిజం అజేయం' అనే మరో వ్యాసం ఇవాల్టి సందర్భానికి పనికొస్తుంది. భారతదేశ తాత్విక ఆలోచనలో ఎక్కువ భాగం వైదిక ధర్మాన్ని, బ్రాహ్మణీయ ఆలోచనలను చొప్పించారు. ఎక్కువ మేరకు భావవాదమే ఉంటుంది. అయితే భౌతికవాద ఆలోచనలు లేక పోలేదు బౌద్ధం చార్వాకులు ఈ కోవలోకే వస్తారు, కానీ ఈ భౌతికవాద ఆలోచనలన్ని భావవాద పునాది మీద ఆధారపడి నిర్మాణమయ్యాయి. ఈ విషయాన్ని వివరించే మంచి వ్యాసమొకటి పృథ్వి రాసాడు. "భావవాదపు పునాదిపై ఏర్పడే ప్రాథమిక, అస్పష్ట భౌతికవాద రూపమే ధ్యానాత్మక భౌతికవాదం" అని రచయిత నిర్ధారణ. ఈ రకమైన ఆలోచనపరులు ఆరాధన, పదార్థం రెండు విడివిడి అంశాలుగా చూస్తారు. ఈ రకమైన వ్యాసాలు అటెంప్ట్ చేయడం చాలా కష్టం. కనుక పృథ్వి ఈ వ్యాసాన్ని కష్టంగా రాసాడు. శైలి నారికేళపాకంలా ఉంది. ఈ వ్యాసం చాలా ముఖ్యమైనది, కనుక సులభ శైలి ఎంపిక చేసుకుంటే బాగుండేది. కానీ వ్యాసంలోని విషయానికి ఉండే స్వభావం వలన అది సాధ్యం కాలేదు. సారమే రూపాన్ని ఎన్నుకుంటుందని చెప్పింది అందుకే.

పృథ్వి విద్యార్థి కావటం వలన విద్యార్థి ఉద్యమాల మీద వ్యాసం రాసాడు. ఈ వ్యాసంలో చాలా సమాచారాన్ని ఇచ్చాడు. విద్యార్థి ఉద్యమంలో వచ్చిన మార్పులను వివరించాడు. భారతదేశంలో జాతీయోద్యమం నుంచి మొదలు పెట్టి నక్సల్బరీ వరకు విద్యార్థి ఉద్యమ పరిణామాన్ని క్రమానుగతంగా విశ్లేషించాడు. భారత కమ్యూనిస్టు పార్టీ రివిజనిజానికి గురై విద్యార్థి ఉద్యమాన్ని కూడా తిరోగమనంలో నడిపించిన చరిత్రను ప్రస్థావించాడు. రివిజనిజం వలన విద్యార్థుల విప్లవకరమైన నైపుణ్యాన్ని దెబ్బతీసి రైతాంగం, శ్రామిక వర్గం పక్షంతో కలవనీయకుండా చేస్తున్నాయి. దీనితో విప్లవకర సామర్థ్యం నశిస్తుంది' దీని నుంచి బయటపడాలంటే విద్యార్థులు రైతాంగంతో మమేకమవ్వాలి. గ్రామాలకు తరలివెళ్ళి రైతులతోనూ, పట్టణాలలో కార్మికులతోనూ భాగస్వామ్యం కావాలని చారుమజుందార్ చెప్పిన సందర్భాన్ని పృథ్వి ఇక్కడ ప్రస్థావించాడు.

భారత దేశంలో విద్యార్థి ఉద్యమం ఉజ్వలంగా ఉండింది. చరిత్ర గమనాన్ని మార్చింది. సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేసింది. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో, కాపాడటంలో విద్యార్థి ఉద్యమం ప్రముఖ పాత్ర వహించింది ఆ తరం అమూల్యమైన ప్రాణ త్యాగాన్ని చేసింది. ఇది ఒకనాటి చరిత్ర. ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయి. సామ్రాజ్యవాద సంస్కృతి యువతను విచ్ఛిన్నం చేసింది. కెరియరిజాన్ని పెంచింది త్యాగం స్థానంలో వైయక్తివాదం వచ్చి చేరింది. సమాజ మార్పు గురించి ఆలోచించే వారి సంఖ్య తగ్గిపోయింది. ఈ క్రమాన్ని కూడా రచయిత కార్యాకారణ సంబంధంగా వివరించాడు. ఈ వ్యాసంలో రచయిత 'బ్యూరోక్రటిక్ పెట్టుబడి' అనే ప్రస్థావన విరివిగా చేసాడు. సాధారణ సూత్రీకరణలు కాకుండా రాజకీయార్థిక అవగాహనతో ప్రతిపాదనలు చేసాడు. బ్యూరోక్రటిక్ పెట్టుబడి, ఆధునికానంతర వాదం కలసి విద్యార్థులపై ఏ విధంగా ప్రభావితం చూపుతున్నదో తాత్వికంగా వివరించాడు. ఈ వర్గం నేరుగా విశ్వవిద్యాలయాల మీద ప్రభావం చూపుతున్నది. ఫలితంగా విద్యార్థి ఉద్యమం సన్నగిల్లిందని రచయిత భావన. భారతదేశంలో దండకారణ్యమే నిజమైన రాజకీయ ప్రత్యమ్నయమనే స్పష్టత రచయితకు ఉంది.

సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని ఓడించాలంటే విద్యార్థి–యువత జనత సర్కార్ ప్రయోగంలోమమేకం కావాల్సిన అవసరాన్ని చెప్పాడు.

తెలంగాణేతురుడైన పృథ్వి తెలంగాణ ఉద్యమంపై, నాయకత్వ ద్రోహంపైన మంచి ఆలోచనలు చేసాడు. 1969 నుంచి జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోని మిలిటెన్సినీ, ఆక్రమంలో ఉద్యమంలోకి ప్రవేశించిన నమ్మక ద్రోహాన్ని చారిత్రకంగా పరిశీలన చేసాడు. 1996లో మొదలైన మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడపడంలో విప్లవోద్యమం చేసిన కృషి అంతా ఇంతా కాదు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విప్లవోద్యమం రక్తతర్పణ చేసింది. ఉద్యమాన్ని నిలబెట్టింది. భావజాల ప్రచారం చేసింది. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ నినాదాన్ని రూపొందించి ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసింది. ఆ శాస్త్రీయ నినాదాన్ని ఇవ్వాళ లిబరల్ డెమోక్రట్స్ కూడా ఇస్తున్నారు. ఈ చరిత్రనంతా రచయిత తన స్మృతిపథంలో పెట్టుకొని ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని వ్యాఖ్యానించాడు.

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిపడినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమంపై ప్రయోగించిన హింస, నిర్బంధం గురించిన వివరాలను పృథ్వి తన వ్యాసాలలో పొందుపరిచాడు. కోస్తాంధ్ర పెట్టుబడిదారులు, భూస్వాములు తెలంగాణను అడ్డుకోవడంలో ఉండే ప్రయోజనాలను సమాజానికి అర్థం చేయించాడు. ముఖ్యంగా పాలకవర్గాలు విద్యార్థి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి చాలా ప్రయత్నాలు చేసారు. 2010 జనవరిలో తెలంగాణ విద్యార్థి జాక్ ప్రభావశీల శక్తిగా ఎదిగాక కోస్తాంధ్ర పాలకవర్గాలు భయపడ్డాయి. బూర్జువా రాజకీయ నాయకత్వం కంటే విద్యార్థి నాయకత్వానికే చంద్రబాబు, జగన్, కిరణ్కుమార్ రెడ్డీలు భయపడ్డారు. కనుకనాటి కేంద్ర హెూంశాఖా మంత్రి చిదంబరాన్ని ప్రభావితంచేసి ప్రకటించిన తెలంగాణను వెనక్కి తీసుకునేటట్లు చేసారు. విద్యార్థి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసారు. ఈ ప్రాసెస్సు పృథ్వి సాధికారికంగా, క్రమపద్ధతిలో వివరించాడు. బూర్జువా స్వభావం కలిగిన ప్రాంతంలో ఉద్యమంలో కూడా విద్యార్థి, కార్మిక, కర్షక, మేధావి ఐక్యమయ్యే అవకాశాలు ఎప్పుడూ ఉంటాయి. ఆ పరిపక్వ స్థితిరాకుండా ఇక్కడి పాలకవర్గాలు అడ్డుకున్నాయనే సూక్ష్మ పరిశీలన పృథ్వి చేసాడు.

కొందరు చరిత్ర పురుషులుంటారు అయితే వీళ్లంతా చరిత్ర నిర్మాణంలో భాగంగానే రూపొందుతారు ప్రజలు చరిత్రను నిర్మించే క్రమంలో నాయకత్వంగా వారి నుంచి కొందరు తయారవుతారు. వారే చరిత్ర గమనంలో మైలు రాళ్లుగా తమ ప్రాధాన్యతను నిర్మించుకుంటారు. అది అసమాన్యమైన త్యాగంవలననే సాధ్యమవుతుంది. ఆ త్యాగంవల్లే వీళ్లు వీరులవుతారు. ఆట్లాంటి వీరులు సమాజాన్ని ప్రభావితం చేస్తారు. ఆ ప్రభావానికి పృథ్వి గురయ్యాడు. ఉదమ్‌సింగ్, కాస్ట్రో, వివేక్ మొదలైన వాళ్ల ప్రభావాలను, పరిచయాలను వ్యాస రూపంగా అందించాడు.

ఉదమ్‌సింగ్ చర్యలకు చాలా పరిమితులు ఉండవచ్చు, కాని జాతీయోద్యమ కాలంలో ఆ వీరులు ప్రదర్శించిన సాహసం యావత్తు దేశాన్ని చైతన్య పర్చిన సందర్భాన్ని పృథ్వి గుర్తుచేసాడు. అయితే వర్గ శత్రు నిర్మూలన వర్గ పోరాటంలో భాగంగా ఉండకపోతే అది వ్యక్తిగతహింసగా మారుతుందనే రాజకీయ, తాత్విక స్పష్టత రచయితకు ఉంది. పాఠకులకు దీనిని అందించే ప్రయత్నం చేసాడు.

వివేక్ పృథ్వికి సమకాలికుడు. ఇద్దరు ఒకే సమయంలో యూనివర్సిటీ చదువుల్లోకి వచ్చారు. సమాజాన్ని చదివారు. ఒకరికొకరు తెలియకుండానే తెలంగాణ విద్యార్థి వేదికలో పని చేసారు. ఇద్దరికి విప్లవోద్యమ ఆచరణతో సంబంధం ఉంది. వాట్సప్ యుద్ధగీతాన్ని విన్పించిన వివేక్ తెలుగు సమాజాన్ని అమితంగా ప్రభావితం చేసాడు. కవి అయిన వాళ్లంతా అతని మీద కనీసం ఒక వాక్యమైన రాసుకున్నారు. అది రహస్యంగానైనా కావచ్చు. పృథ్వి మాత్రం తన సహచరుడి గురించిన జ్ఞాపకాలను, అతని ఆచరణను వ్యాసం రూపంలో వ్యక్తంచేసాడు. ఫైడల్ కాస్ట్రో ఈ పేరు ప్రపంచమంత సుపరిచితం అమెరికన్ సామ్రాజ్యవాదంతో అలుపెరగక పోరాడిన వ్యక్తి ఆయన ఆచరణతో, రాజకీయాలతో, తాత్విక అవగాహనతో మనమందరం పేచీ పడే విషయాలు ఉన్నాయి. కానీ తన దైన పద్ధతిలో ప్రత్యమ్నాయ అభివృద్ధి నమూనాను ఆచరించాడు. కనుక ఆయనను గుర్తుచేసుకోవడం పృథ్వి బాధ్యతగా భావించాడు.

మొత్తంగా పృథ్వి వ్యాసాలు సారవంతమైనవి. సంక్షిప్తంగా ఉన్నాయి. శైలిలో కొంత గాఢత ఉంది. అయితే అది క్రమంగా మారుతుంది. తన ప్రజల కోసం శిల్పం మార్చు శక్తి కూడా రచయిత వ్యక్తిత్వంలోనే ఉంది. ఎక్కువ వ్యాసాలు చాలా సరళంగా ఉన్నాయి. రెండు వ్యాసాలు మాత్రమే పండిత భాషలో నడిచాయి. పృథ్వి పరిశీలన చాలా భిన్నంగా ఉంటుంది. గ్రామాన్ని అర్ధం చేసుకోవాలంటే అక్కడ ఉండే దేవాలయాన్ని అర్ధంచేసుకోవాలని వర్గపొందిక గురించి అనే సందర్భంలో అంటాడు. ఈ సంపుటిలో మరో మంచి వ్యాసం చైనా రెడార్మి లాంగ్‌మార్చ్ కథల గురించినది. 1934 నుంచి 1936 వరకు చైనా ఎర్రసైన్యం ప్రారంభించి పూర్తిచేసిన లాంగ్మార్చ్ ఆ దేశ విప్లవ గమనాన్నే మార్చి వేసింది. 'లాంగ్‌మార్చ్' అనే పదం ప్రపంచ నిఘంటువులోకి చేరింది. సామాన్యులు అసమన్యులుగా మారి చరిత్రను మట్టి చేతులతో నిర్మిస్తారని లాంగ్‌మార్చ్ రుజువుచేసింది. ఆ క్రమంలో ఎర్ర సైనికుల అనుభవాలను, జ్ఞాపకాలను కథలుగా తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని పృథ్వి చదివి మనందరం చదివే విధంగా ఈ వ్యాసం రాసాడు.

పృథ్వి రాసిన వ్యాసాలు ఇప్పటికే ప్రచురితమై ఉన్నాయి. కొందరు చదివే ఉంటారు. ఇప్పుడు పుస్తకం రూపంలో మన ముందుకు తెస్తున్నాడు. ఆయన ఈతరం కుర్రాడిలా కన్పించడు. లోతైన ఆలోచనలతో, పరిశీలనలతో, ఆచరణతో ప్రత్యక్షమవుతూ ఉంటాడు. ఆయన వ్యాసాలు అంతే. రూపంకన్నా సారానికి విలువనిచ్చే పృథ్వి వ్యాసాలలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తూ..............

డా. సి. కాశీం,
1 మార్చి, 2018
R-9,ఓయూ, హైదరాబాద్

133వ మార్క్స్ వర్ధంతి
భారతదేశంలో మార్క్సిజం అజేయం!

కార్ల్‌మార్క్స్ ఇక్కడ విస్మరించబడ్డాడు, పటానికి వేలాడదీయబడ్డాడు. ఇక ఈ వర్ధంతికి అగరబత్తుల దూపంతో కప్పివేయబడతాడు. వాస్తవానికి ఆయన కోరని కోరికలను ఆయనపై రుద్దుతున్నాము. అందరు ఆమోదించేట్లు చేస్తున్నాము. కాని ఆయన బోధించిన సత్యాన్ని ఎప్పుడో కాలదన్ని అన్నిరకాల అవకాశవాదాలను మోసుకెళ్తున్నాము. ఈ అవకాశవాదాల్ని ఆయన ఆశయాలుగా రూఢీ చేస్తున్నాము. ఆయనను శ్రామికులు కాదనే స్థితికి తెచ్చేశాము. ఇక మిగిలింది మనల్ని మనం సరిదిద్దుకోవడానికి తిరిగి ఆయన వద్దకే వెళ్ళి మనల్ని మనం నిర్దాక్షిణ్యంగా విమర్శించుకోవడం. ఈ పద్దతితో తిరిగి ఆచరణను కొనసాగించడం. అప్పుడు ఆయన ఒక భౌతిక శక్తిగా మారిపోతాడు. ఇక మార్క్స్ పేరుగా మిగలడు మార్క్సిజంగా, లెనినిజంగా, మావోయిజంగా వర్ధిల్లుతాడు.

కార్ల్‌మార్క్స్ ట్రీర్ నగరంలో 1818 మే 5వ తేదీన జన్మించాడు. ఆయన తండ్రి న్యాయవాది. ట్రీర్ నగరంలో ఉన్నత విద్యను అభ్యసించిన తరువాత బోన్ విశ్వవిద్యాలయంలో, ఆ తరువాత బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ఎపిక్యూరస్ తత్వశాస్త్రంపై డాక్టరేట్ డిగ్రీ సంపాదించారు. అప్పటికే జర్మని అంతటా హెగెల్ తాత్వకతకు అడుగులో మడుగులై సాగుతుంది. మార్క్స్ కూడా ఈ తాత్వికతకు అనుచరుడుగా ముందుకు నడిచాడు. కానీ లెనిన్ చెప్పినట్లు హెగెల్ తాత్వికత ప్రకారమే ప్రతీదీ చలనానికి గురికాక తప్పదనే సూత్రమును అనుసరించి హెగెల్ తాత్వికత నుండి శాస్త్రీయ, విప్లవాత్మక

నిర్ధారణలకు వచ్చే బృందం ఏర్పడింది. (వామపక్ష హెగెలియన్లు). ఈ బృందంలో మార్క్స్ సభ్యుడిగా చేరాడు. మార్క్స్ వాస్తవానికి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలని భావించినా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి నిరోధక ఆధిపత్యాన్ని సహించలేక దానికి ప్రాముఖ్యతను ఇవ్వలేదు. (ఫోయెర్ భాఖ్, బ్రూనోబోవర్‌లను బొన్ యూనివర్సిటీ నుండి తొలగించిన సంఘటన)

ఈ వామపక్ష హెగెలియన్ల బృందంతో రైన్‌లాండ్‌లోని తీవ్రవాద బూర్జువాలు సంబంధాలు కలిగి ఉన్నారు. వీరు కోలన్ నగరంలో రైనిషే సేటుంగ్ అనే పత్రికను స్థాపించి కార్ల్‌మార్క్స్, బ్రూనో బోవర్‌లను ప్రధాన వ్యాసకర్తలుగా ఆహ్వానించారు. మార్క్స్ కోలాన్ చేరి 1842 జనవరి 1 నుండి పత్రికలో పనిచేయడం ప్రారంభించారు. 1843 అక్టోబర్‌లో మార్క్స్ పత్రికకు ప్రధాన సంపాదకులైనారు. ఈ పత్రికలోని వ్యాసాలు ఆనాటి వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని నెలకొల్పాయి. ఇది తట్టుకోలేని ప్రభుత్వం పత్రికను మార్చి 1843లో నిషేధించింది. మార్క్స్ జనవరిలో పత్రికకు రాజీనామా అందించినా నిషేదం ఆగలేకపోయింది.

మార్క్స్ రూబేతో కలిసి పారీస్‌లో రహస్య విప్లవ పత్రికను స్థాపించారు. ఈ పత్రికను మొదటి సంచికతో ఆపివేశారు. రూబేతో వచ్చిన మనస్పర్థమే కారణం. మార్క్స్ పారీస్‌లో ఉండగానే ఏంగెల్స్ కలిశాడు. అప్పటి వారి పరిచయం మార్క్సిజంగా రూపాంతరం చెందుతుందని ఊహించడం సాధ్యం కానిదే కానీ ఆచరణశీలమైనదే. 1845లో మార్క్స్‌ను పారీస్‌లో ఉన్న ప్రమాదకారియయిన వ్యక్తిగా ఎంచి వెళ్ళగొట్టారు. అక్కడి నుండి బ్రసెల్స్‌కు వెళ్ళారు. 1847లో మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు లీగ్ అనే రహస్య సంస్థలో చేరి 1848 ఫిబ్రవరిలో కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను ప్రచురించారు.

అటు తరువాత 1848 ఫిబ్రవరి విప్లవంతో బెల్జియం నుండి వెళ్ళగొట్టబడ్డాడు. ఆయన పారీస్‌కు తిరిగి వెళ్ళారు. మార్క్స్ విప్లవానంతరం జర్మనీలోని కోలన్‌కు వెళ్లాడు. అక్కడ నోయెరైనిషెసెటుంగ్ అనే పత్రికను

స్థాపించాడు. ఈ పత్రిక 1848 జూన్ 1 నుండి 1849 మే 19 వరకు వచ్చింది. 1849న మార్క్స్ పై కేసు వేశారు. అది 1849 ఫిబ్రవరిలో మార్క్స్ నిర్దోషి అని కొట్టేశారు. అయితే ఆయనను జర్మనీ నుండి వెళ్ళగొట్టారు. ఆయన పారీస్‌కు వెళ్ళారు. అక్కడ నుండి కూడా 1849 జూన్ 13 ప్రదర్శనతో వెళ్లగొట్టబడ్డారు. లండన్ వెళ్ళి చనిపోయేదాకా అక్కడే జీవించారు.

1843లో తన బాల్య స్నేహితురాలు జెన్నీని వివాహం చేసుకున్నాడు. మార్క్స్ కన్నా జెన్నీ నాలుగేళ్లు వయస్సులో పెద్దది. వారు తమ జీవితాన్ని అత్యంత కష్టభరితంగా సాగించారు. అన్ని కష్టాలలోనూ మార్క్స్‌కు జెన్నీ నీడగా జీవించింది. మార్క్స్ రాసే ప్రతీ దాన్ని మొదట జెన్నీకి చదివి వినిపించి చర్చలు సాగించేవారు. మార్క్స్ రాసిన చిత్తు ప్రతిని సరైన రీతిలో మేలు ప్రతిగా రాయడం జెన్నీ పనిగా ఉండేది. వారి కష్టాలల్లో మార్క్స్, జెన్నీల ప్రేమ మరింత పదునుతేరింది. వీరి పిల్లలు తిండి లేక సరైన వైద్య సదుపాయంలేక (ఆర్థిక కష్టాలవల్ల) చనిపోయారు. ముగ్గురు కూతుళ్లు మిగిలారు.

కార్ల్‌మార్క్స్ చాలా స్పష్టంగా, సూటిగా అత్యంత ప్రగాఢమైన జ్ఞానంతో, సమగ్రమైన సైద్ధాంతిక విశ్లేషణను తన మరణం వరకూ కొనసాగించారు. రాజీలేని గతితార్కిక చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని తన ఆయుధంగా మలుచుకుని ఫ్రాన్స్‌లోని వర్గపోరాటాలు, వేతన శ్రమపెట్టుబడి, లూయీ బోనా పార్ట్ యొక్క బ్రామేర్ పద్దెనిమిదవ తేదీ, ఫోయొర్ బాఖ్‌పై సూత్రీకరణలు, అర్థశాస్త్ర విమర్శకు చేర్పు, గోతా కార్యక్రమము మొదలైన ముఖ్య రచనలు గావించారు.

మార్క్స్ తన జ్ఞానం మొత్తాన్ని రంగరించి పరిశీలన, పరిశోధనతో గ్రండరిస్ రచనకు పూనుకున్నారు. ఇది అసంపూర్ణమైన గ్రంథంగా (డైరీలు) మిగిలిపోయింది. అయినా ఈ గ్రంథం తాత్విక – ఆర్థిక – రాజకీయ పరమైన లోతైన విశ్లేషణ కలిగినది. మార్క్స్‌కు, ఏంగెల్స్ యొక్క పరిచయంతో ఆర్థిక పరిశీలనపై మరింత లోతుగా వెళ్ళడానికి

కారణమైనదని చెప్పడం ముఖ్యమయినది. ఏంగెల్స్ ఇంగ్లాండ్‌లోని కార్మిక వర్గ పరిస్థితి గ్రంథం ద్వారా గతితార్కిక చారిత్రక భౌతికవాదం, రాజకీయ ఆర్థిక విమర్శ, సోషలిజం (కమ్యూనిజం) వైపుకు అడుగుపెట్టారు. అప్పటికే మార్క్స్ స్వతంత్రంగా చారిత్రక శాస్త్రీయత వైపుకు మరింత స్పష్టంగా రుజువు చేస్తూ ముందుకు వచ్చారు. వీరి కలయికతో ఈ శాస్త్రీయ అభివృద్ధి మరింత గెంతు రూపంలో సాగింది. మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థను విశ్లేషిస్తూ పెట్టుబడి గ్రంథాన్ని రచించడానికి పూనుకున్నారు. ఈ గ్రంథం మొదటి సంపుటి 1867లో ఆయన బ్రతికి ఉన్న సమయంలోనే వచ్చింది. ఆయన చనిపోయిన తరువాత ఏంగెల్స్ మిగతా రెండు సంపుటాలు బయటకు తెచ్చారు. ఈ గ్రంథం కూడా అసంపూర్ణమైనదే కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థను విశ్లేషించే సమగ్రమైనది. కార్మికవర్గ విప్లవాన్ని తప్పనిసరి అని చెప్పే సత్యం అని గమనించాలి.

కార్ల్‌మార్క్స్ 1864 సెప్టెంబర్ 28న లండన్‌లో అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థను స్థాపించారు. ఈ సంస్థకు, కర్త, కర్మ, క్రియ అన్నీ మార్క్స్ అని గమనించాలి. ఈ సంస్థను బాకూనిన్ వర్గీయులు రెండుగా చీల్చారు. ఈ చీలిక మూలంగా హేగ్ ఇంటర్‌నేషనల్ కాంగ్రెస్ తరువాత ఈ సంస్థ జనరల్ కౌన్సిలును న్యూయార్క్ నగరానికి మార్పించారు. తను ఇటు ఈ కార్మిక పోరాటంలో పాలు పంచుకుంటూనే తన పెట్టుబడి గ్రంథాన్ని రచించసాగారు. మార్క్స్ తరచూ పెట్టుబడి గ్రంథం పూర్తి అయిన తరువాత గతితార్కికంపై సమగ్రమైన లోతైన గ్రంథాన్ని రచించాలని భావించారు. కానీ ఆయన మధ్యలోనే అంటే 1883 మార్చ్ 14న లండన్‌లో శాశ్వతంగా కార్మిక వర్గాన్ని వదిలేసి చనిపోయారు. లండన్‌లో హైగెట్ శ్మశాన వాటికలో ఆయన భార్య సమాధి వద్దే పూడ్చారు.

మార్క్సిజం అంటే ఏమిటి?

మార్క్సిజం అంటే కార్ల్‌మార్క్స్ – ఫెడరిక్ ఏంగెల్స్‌ల యొక్క ఉపదేశము, సూత్రీకరణలు, చారిత్రక, ప్రాకృతిక, సామాజీకృత, అంత:సంబంధాల గతితార్కిక చారిత్రక భౌతికవాద సమాహార వ్యక్తీకరణ స్వరూపం.

మార్క్సిజం యొక్క సారము ఏమిటి?

మానవుడు ఆచరణతోనే ప్రకృతిని, పదార్థాన్ని అవగాహన చేసుకుంటాడు, సమాజాన్ని నిర్మించుకుంటాడు, తోటి మానవులతో సంబంధాలు ఏర్పరచుకుంటాడు. ఈ ఆచరణ ప్రాకృతిక పరిశీలన మరియు మానవ అవసరాల అవగాహనతో పాటుగా మానవ శ్రమ సంబంధాల ఏర్పాటు, అభివృద్ధి యొక్క అంత:సంబంధాల మెరుగుగా ఉంటుంది. ప్రాకృతిక పరిశీలనలోను, మానవ శ్రమ సంబంధాలలోను జరిగే అభివృద్ధి విప్లవాత్మకంగా సాగుతుంది. అది మానవ చారిత్రక ఆచరణగా నిరంతరం వృద్ధి చెందే సామాజిక పరిశీలన.

మార్క్సిజం యొక్క పరిశీలనా పద్ధతి

మార్క్సిజం యొక్క పరిశీలనా పద్ధతి "గతితార్కిక చారిత్రక భౌతికవాదం".

గతితార్కిక చారిత్రక భౌతికవాదం ముఖ్యాంశాలు ఏమనగా : 1.వైరుధ్యం, 2.పరిమాణాత్మక మార్పు నుండి గుణాత్మక మార్పుకు అభివృద్ధి, 3.అభావం – అభావం చెందుట, 4.ఉత్పత్తి శక్తులు – ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యం అభివృద్ధి, దీనికి అనుసంధానమైన ఉపరితల మార్పు.

(ప్రధాన వైరుధ్యాన్ని, మార్పుకు చోదక శక్తిని గుర్తించడం, చలనశీలన గమ్యం, సార–రూప లక్షణం, వాస్తవికత – అవశ్యకత మొదలైనవి మార్క్సిజం పరిశీలన పద్ధతులలో భాగాలు.)

భారతదేశంలో మార్క్సిజం

కార్ల్‌మార్క్స్, ఫెడరిక్ ఏంగెల్స్‌లు భారతదేశంపై 1853 నుండి 1858 వరకూ న్యూయార్క్‌డైలీ ట్రిబ్యూనల్ పత్రికలో భారతదేశంలో జరుగుతున్న బ్రిటీష్ సామ్రాజ్య దోపిడీ, అసమానతలు, పేదరికం, కుల సమస్యలపై వ్యాసాలతో పాటుగా బ్రిటీష్ సామ్రాజ్యంపై 1857లో జరిగిన సైనికుల తిరుగుబాటు గురించి, భారత విప్లవ విజయవకాశాలపై వ్యాసాలు రచించారు.

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపన

1920లకే భారతదేశంలో రష్యన్ సోషలిస్టు విప్లవానంతరం వివిధ సామ్యవాద అధ్యయన బృందాలు మార్క్సిజంపై పరిశీలన, భారతదేశంలో అన్వయించడంపై దృష్టిసారించాయి. ఈ క్రమములో వివిధ సామ్యవాద బృందాలను ఒకటి చేస్తూ 1920లలో తాష్కంట్‌లో అఖిల భారత విప్లవ బృందాల సమావేశం జరిగింది. ఈ సమావేశములోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులైన కామ్రేడ్ స్ప్రాట్, బ్రాడ్లె, రజనీ పామీదత్ కీలక పాత్ర పోషించారు.

కాన్పూర్, మీరట్ కుట్ర కేసులు

కాన్పూర్ బోల్షివిక్ కుట్రకేసుగా ఎమ్.ఎన్.రాయ్ తదితరులను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. మీరట్ కుట్రకేసు 1929లో డాంగే తదితర కార్మిక కమ్యూనిస్టు నాయకులను (32 మంది) అండర్ సెక్షన్ 121ఏ ఆఫ్ ద ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం శిక్షించారు. రైల్వే సమ్మెకు పూనుకోవడంకై జరిగిన ప్రయత్నంతో వీరిపై కుట్రకేసును బనాయించడానికి కారణం. కానీ కమ్యూనిస్టు పార్టీ స్థాపనను తట్టుకోలేక ఈ విధంగా బ్రిటీష్ ప్రభుత్వం నిర్బంధానికి పూనుకుంది.

జాతీయోద్యమంలో కమ్యూనిస్టులు

భారత కమ్యూనిస్టులు "దత్-బ్రాడ్లె థీసిస్" పరిశీలనతో జాతీయోద్యమంలో కాంగ్రెస్ మరియు కాంగ్రెస్ సోషలిస్టులతో ఐక్య సంఘటన కట్టి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని అంటే సంపూర్ణ స్వాతంత్ర్యం, కార్మికుల జీవన పరిస్థితి మెరుగుదల, గ్రామీణ రైతాంగ భూ పంపకం వగైరా సమస్యల పరిష్కారానికి ఉమ్మడి పోరును సల్పడానికి కమ్యూనిస్టులు పూనుకున్నారు. ఈ ప్రయత్నం సఫలత చెందిందని మనం గమనించాలి. మార్క్స్ రచనల ఆధారంగా కమ్యూనిస్టులు భారత సైనికులను సమీకరించడం, కుల సమస్యపై పోరాటం చేయడం వగైరా ఉద్యమాలు నిర్వహించారు.

రైతాంగ పోరాటాలు

ఈ ఐక్య సంఘటన యొక్క అనుభవాలను సమీక్షించుకుని తెలుగు రాష్ట్రాల్లోని కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభ వంటి ఐక్యసంఘటనా కేంద్రాన్ని ఏర్పర్చి రైతాంగ శ్రామిక వర్గ పునాదిపై ప్రజా విజృంభణ స్థాయిని పెంపొందించి రైతాంగ గెరిల్లా పోరాటాన్ని ముందుకు తెచ్చారు. అంతేకాకుండా పశ్చిమ బెంగాల్‌లో తెభాగ రైతాంగ ఉద్యమం, కేరళలో పున్నాప్రా వయలర్ జమీందారీ వ్యతిరేక పోరాటం, మహారాష్ట్రలోని వర్లీ గిరిజన రైతాంగ పోరాటం కమ్యూనిస్టు పార్టీ యొక్క మెరుగైన ఆచరణగా అనగా విప్లవానికి పునాది వర్గంగా ఉన్న భారతదేశంలోని రైతాంగ వర్గాన్ని అందిపుచ్చుకుని సాయుధ విప్లవ పోరాటాన్ని సాగించింది.

కమ్యూనిస్టు ఉద్యమ పంథాలో గందరగోళం – చీలికలు

కమ్యూనిస్టు ఉద్యమంలో రైతాంగ సాయుధ పోరాటాలకు తిలోదకాలిచ్చి కేవలం తక్షణ కార్మికవర్గ విప్లవమని, లేదు చైనా మార్గం మన మార్గమని, ఇదేమికాదు మనకంటూ ఒక ప్రత్యేక మార్గమని కార్మిక వర్గం అంటే ఎన్నికలకు పరిమితమయ్యే పోరాటాలనీ, మూడు పంథాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. ఈ ఘర్షణ అనివార్యంగా పోరాటం ఉధృతమవుతున్న సమయంలో, ప్రాంతాలల్లో ఉన్న కమ్యూనిస్టు పార్టీని విమర్శిస్తూ బందిపోట్ల పోరాటం వగైరాగా విష ప్రచారం చేసారు. ఈ సైద్ధాంతిక గందరగోళం పరిష్కారం కోసం స్టాలిన్‌ని కలిసిన భారత నాయకత్వం (ఇది పెద్ద చర్చ) తిరిగి భారతదేశం రాగానే మళ్ళీ గందరగోళాన్ని అదుపు చేయలేక రెండుగా విడిపోయారు. (సిపిఐ మరియు సిపిఐ (మార్క్సిస్టు)గా విడిపోయాయి).

నక్సల్బరీ – శ్రీకాకుళం వెలుగు వెనకడుగు

సిపిఐ – సిపిఐ మార్క్సిస్టుగా విడిపోయిన కమ్యూనిస్టు పార్టీ పునాది వర్గమైన రైతాంగ శ్రామికవర్గ ఉత్పత్తి సంబంధాల మార్పులో కీలక పాత్రను పోషించకుండా కాలయాపన చేయపూనుకుంది. ఈ సమయంలో నక్సల్బరీ (పశ్చిమ బెంగాల్)లో గిరిజన రైతాంగం కార్మికవర్గ నాయకత్వంలో విప్లవకర

కమ్యూనిస్టుల మార్గదర్శకత్వంలో భూపోరాటం ప్రారంభించారు. ఈ పోరాటాన్ని సిపిఐ – సిపిఐ మార్క్సిస్టులు వ్యతిరేకించారు. సిపిఐ మార్క్సిస్ట్ అధికారంలో ఉన్నా తన పార్టీలోని కామ్రేడ్స్ నడిపిస్తున్న ఈ పోరాటాన్ని సహించలేక పోలీస్ నిర్బంధం, అరెస్టులు, ఎన్‌కౌంటర్లు చేయించింది. ఈ పోరాట స్ఫూర్తితో అప్పటికే ప్రజా విజృంభణ స్థితిలో ఉన్న శ్రీకాకుళ పోరాటం సాయుధ పోరాటంలో ముందుకు నడిచింది. ఈ పోరాట నాయకత్వం సిపిఐ – యమ్ఎల్ పార్టీగా ఏర్పడి రైతాంగ పోరాటాలకు పిలుపునిచ్చి సాయుధపోరుకు పూనుకున్నారు. భీర్‌భూమ్, ముషహరి మొదలైనవి ముఖ్య పోరాటాలు. ఈ పోరాటాలు సరైన దిశగా ముందుకు వెళ్లలేదనే చెప్పాలి. ఎందుకంటే అతివాద అవకాశవాదమే కారణమని చెప్పాలి. సిపిఐ ఎమ్ఎల్ పంథా సరైనదే కానీ దాని అతివాద దుందుడుకు తనం తన పతనానికి కారణమయింది.

దండకారణ్య జనతన సర్కార్

సిపిఐ – ఎమ్ఎల్ యొక్క అనుభవాలను సమీక్షించి సిపిఐ ఎమ్ఎల్ యొక్క పంథాలోని అతివాద అవకాశవాద దుందుడుకుతత్వాన్ని విమర్శించి మితవాద పంథాలోనికి అడుగుపెట్టకుండా దండకారణ్య పరస్పెక్టివ్‌ను ఏర్పరుచుకుని ఆనాడు అంటే 1980లకి తన పంథాను ఆచరణలో రుజువు చేయ పూనుకుంటూ సిపిఐ ఎమ్ఎల్ (పీపుల్స్ వార్) స్థాపితమైంది. ఈ పంథా ప్రజా పోరాటాలని, సాయుధ పోరాటాన్ని సమన్వయపరుస్తూ విశాల ఐక్య సంఘటన ప్రాతిపదికగా దండకారణ్య జనతన సర్కార్‌ను ఏర్పర్చింది. భారత–ప్రపంచ భూభాగంలో వర్ధిల్లుతున్న ఏకైక కమ్యూనిస్టు సోవియట్‌గా చెప్పుకోవాలి. ఈ సోవియట్‌పై ప్రభుత్వం గ్రీన్‌హంట్ పేరుతో దాడి ప్రారంభించి మూడవ దశకు చేరింది. ఈ దాడిని ఎలా గమనించాలి? కార్ల్‌మార్క్స్ అన్నట్లు మృతప్రాయమైన యుగం ఉన్న సమాజంలో పాత తొత్తులు, సంస్కృతి, పాత చట్టాలు, యంత్రాంగం ఉద్భవించినట్లే పోరాట పద్ధతులు, పరిస్థితులు, మనుషులు ఉద్భవిస్తారు. ఈ పరిశీలనతో చూస్తే భారతదేశ మృతప్రాయమైన యుగంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ

పోరాట కొనసాగింపుగా దండకారణ్య ఉద్యమం ఉంటే ఈ ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఆనాటి తెలంగాణ సాయుధ పోరుపై జరిగిన ఆపరేషన్ 'పోలో'గా అభివర్ణించవచ్చు. ఇక మిగిలింది ఆనాటి పోరాటంలా మధ్యలో ద్రోహం చేయకుండా దేశం మొత్తాన్ని జనతా రాజ్యం చేయడమే. అప్పుడు మార్క్సిజం వర్ధిల్లుతుంది. మార్క్స్ మన ప్రజల మస్తిష్కంపై స్వారీ చేస్తూనే ఉంటాడు, ఆయన ఇక మరణించడు.

ముగింపు

ఈపై చర్చ అంతా మార్క్స్ వర్ధంతి నాడు అవసరమా? లేదా? అనే ప్రశ్న అందరి ముందుకు వస్తుంది. కానీ మార్క్స్ సిద్ధాంతం దండకారణ్య జనత సర్కార్‌ను చూసినప్పుడే మార్క్సిజంగా వెలుగొందుతుంది. భారతదేశంలో మార్క్సిజంకు కాలం చెల్లిందని రివిజనిజం వైపుకు అడుగులు వేసి మార్క్సిజాన్ని పక్కన పెట్టిన వారందరికి మార్క్స్ వర్ధంతినాడే ఓట్లకు తమకంటూ చెప్పుకునే ఒక మనిషిగా మార్చివేశారు. కావున కాలమాన పరిస్థితుల్లో (ఈ పరిస్థితులు ఏర్పర్చుకునేది మనుష్యులే) సర్వత్రా, సర్వదా ఆనాటి స్థితిగతులల్లో మార్క్సిజాన్ని విస్తృతపరిచినప్పుడే ప్రజలకు చేరువవుతుంది. ఈ విస్తృతి దండకారణ్య జనతన సర్కార్ వరకూ సాగింది. ఇక మీదట కూడా సాగుతుంది. ఈ రూపంలోనే ఖచ్చితంగా భారత ప్రజలకు మార్క్స్ ఆయన ఉపదేశం – సిద్ధాంతం చేరువ అవుతుంది. అందుకనే ప్రజలకు చేరువ అవటానికి భారతదేశంలో మార్క్సిజం ఎదుర్కున్న సమస్యల పరిస్థితులను వివరించే ప్రయత్నంగా ఈ చర్చ సాగింది. అందుకే మార్క్సిజం అజేయం.

***

మార్క్సిజం అజేయం

ధ్యానాత్మక భౌతికవాద తాత్వికతే ప్రాథమికంగా భారతీయ సమాజ భౌతికవాద స్రృహగా ఉంది. భావవాదం యొక్క వేరొక రూపమే ఈ దృక్పథం. భావవాదపు పునాది పై ఏర్పడే ప్రాథమిక, అస్పష్ట భౌతికవాద రూపమే ధ్యానాత్మక భౌతికవాదం. ఈ తాత్వికత విడివిడి వ్యక్తుల ఆరాధన, పదార్థాన్ని విడివిడి అంశాలుగా భావించే రూపమని గమనించవచ్చు. మానవ కార్యకలాపమే వస్తుపరమైన సత్యమని గమనించకపోతే మానవుని గ్రహింపు పరమసత్యంగా (Absolute Truth) అవగాహన అవుతుంది. తన కార్యకలాపమే వస్తుపరమైన కార్యకలాపం కాబట్టి తన అవగాహనలో పదార్థాన్ని, వస్తువును, వాస్తవికతను (Reality) అనిర్దిష్టత (Abstract) నుండి వస్తుగత నియమాలను (Objective Laws) గ్రహించే క్రమం ఇమిడి ఉంటుంది. పదార్థాన్ని సరైన తీరులో గ్రహించడం లేదా గ్రహించకపోవడం, గుర్తించడం–నిర్మించడం సహా మానవ కార్యకలాపము. అందుకే మానవ కార్యకలాపము 'గ్రహింపు–నిరూపణ' అనే అంశాల అంతర్విరుద్ధ స్వభావంతో ముడిపడి ఉంటుంది. ఈ సత్యాన్ని ధ్యానాత్మక భౌతికవాదం గుర్తించదు. ఎందుకంటే ఈ తాత్వికత ఉన్నటువంటి సామాజికస్థితి, ఆమోదం, వ్యవహారం కారణమవుతుంది. మానవుని సామాజిక సంబంధ పరిధి ఉత్పాదక శక్తుల స్థాయిలో గమనించవచ్చు, ఈ ఉత్పాదక శక్తుల అభివృద్ధి మానవ సామాజిక సంబంధంలో అభావం–ధృవీకరణల క్రమంతో ముడిపడి ఉంటుంది. ఇది సంఘర్షణ పూరిత, గెంతుగా వృద్ధిచెందే మానవ

కార్యాచరణ. ఈ చారిత్రక క్రమాన్ని, చారిత్రక ఉత్పాదితాన్ని అవగాహన చేసుకోకపోతే ఆత్మాశ్రయ భావవాద తాత్వికత వైపుకు (Subjective Idealistic Philosophy) పయనించడం జరుగుతుంది. దీని ఫలితంగా విప్లవ అవకాశవాదం (Revolution Opportunism) ముందుకు వస్తుంది. ఈ తాత్వికత వ్యక్తుల ఆరాధనగా, వారికి పెద్ద పాత్రను కల్పించే ధ్యానాత్మక భౌతికవాదంగా వ్యక్తమౌతుంది. ఈ తాత్వికత ప్రజలను, కార్యకర్తలను, పార్టీని సైతం మొద్దుబారచేసే (Stultifying) పద్ధతిని అభివృద్ధి చేస్తుంది.

మానవుని ఆచరణ (చారిత్రక కార్యకలాపము) ఇంద్రియవస్తువు–ఆలోచన వస్తువు. ఇంద్రియవస్తువు మానవుని ఆచరణాత్మక జ్ఞానేంద్రీయాలైన అంతర్గత భావోద్రేకాలు–ఇంద్రియాల సంఘర్షణ ఫలితంగా రుచి, స్పర్శ, చూపు, వినికిడి, వాసనతో ప్రకృతిని ప్రతిఫలించడం. ఆలోచనా వస్తువు ఇంద్రియా వస్తువులను మెరుగు పరచడం–మానవుని అవసరాల అభివృద్ధి, నూతన ఆవిష్కరణ–మానవ సారపు అసలు సంబంధ రూపం, వాస్తవిక నిర్మాణం. భౌతిక వస్తురూపం మానవుని కార్యాచరణ, ఇంద్రియ కార్యకలాప ప్రతిఫలం, అనగా అస్థిత్వంలో ఉన్నది కాబట్టే గుర్తించడం. అస్థిత్వాన్ని గుర్తించే అస్థిత్వం. గుర్తించడమనగా ఆలోచన వస్తువుగా చారిత్రకత సంతరించుకున్నది. ఆచరణతో–ఆచరణలో ప్రతిఫలించడం ఈ స్థితి ఆచరణ–ఆలోచన. ఆచరణ ధనాత్మకం–ఆలోచన రుణాత్మకం అలాగే ఆచరణ రుణాత్మకం–ఆలోచన ధనాత్మకంగా పరస్పర అభివృద్ధిగా ముందుకు సాగుతుంటుందని గమనించవచ్చు. ఇవి రెండూ పరస్పరం అంతఃసంబంధ–ఘర్షణ పూరిత స్వీయ సంఘర్షణ భరితం. అందుకే మానవుని ఆచరణ–ఆలోచనకు ఏకత్వం తక్షణం గోచరించడంలో వ్యత్యాసం ఉంటుంది. ఇది ఆచరణలో ఉండే ఆచరణాత్మక–విమర్శనాత్మక స్థితి. వస్తువు–వాస్తవికత మానవుని ఆచరణ. వీటి యొక్క ఆవశ్యకత ఉపయోగం ద్వారా వాటి చారిత్రకతను తెలుపుతుంది అనగా మానవుని చారిత్రక ఆచరణను స్పష్టపరుస్తుంది. మానవుని యొక్క పరస్పర ఆధార సంబంధ బాంధవ్యాన్ని, అనివార్యతను గోచరింపచేస్తుంది.

ఇంద్రియవస్తువులోని ఆలోచన యొక్క ప్రమేయాన్ని, ఆలోచన వస్తువులోని ఇంద్రియవస్తువు యొక్క వాస్తవికతను పరిశీలించడం–వాటి యొక్క ఉపయోగ– అంతఃసంబంధం మానవుని ఆచరణ విప్లవాత్మకతగా అభివృద్ధి చెందడంగా ఉంటుంది. ఇంద్రియ గ్రహకంతో ప్రతిఫలించే వస్తువుల సంశ్లేషణ ఆలోచన వస్తువులుగా ఉంటుంది. కావున ఇంద్రియ కార్యకలాప–ఆలోచనా కార్యకలాపం యొక్క వైరిపక్షం ఏమనగా మానవ శ్రమగా ఉంటుంది. ఆలోచనవస్తువు ఇంద్రియబోధగా ప్రతిఫలిస్తుంది, ఆలోచనా వస్తువు ఇంద్రియ కార్యకలాపాన్ని మెరుగుపరుస్తుంది, ఐతే ఈ ఉన్నతీకరణలో తన యొక్క సాధారణ ప్రాథమిక రూపం (ముడి పదార్థాలుగా ఉన్న స్థితి) గోచరితమవ్వదు. ఉన్నత–మెరుగైన–నూతన స్వభావం–రూపం సంతరించుకుంటుంది. ఇది మానవ కార్యకలాపం యొక్క విశిష్టత. శాస్త్రీయ సైద్ధాంతిక కార్యకలాపం నిజానికి చారిత్రకంగా కేవలం మానవ ఆచరణ ఫలితంగానే కాదు అది మానవుని చారిత్రక ఆచరణాత్మక పరీక్ష (ఆచరణలో రుజువు) ఫలితంగా అభివృద్ధి చెందేదిగా ఉంటుంది. ఈ చారిత్రక అభివృద్ధి విడి వ్యక్తుల తాత్వికత నుండి పుట్టుకొచ్చింది కాదు, అలాగే కేవలం మానవుని–మానవుని మధ్య ఉండే ప్రాకృతిక జీవజాతి సంబంధ వ్యవహారమూ కాదు. అది మానవుని చారిత్రక సామాజిక సంబంధ ఫలితము. ఈ సత్యాన్ని పరిత్యజించి ప్రతీదీ పొంతన లేనిదిగా చిత్రించే, ప్రతీదీ అంతఃసంబంధం కలిగినదిగా భావించని తాత్వికతే ధ్యానాత్మక భౌతికవాదం. ఈ తాత్వికత ప్రతీదీ తెలిసిన (Conversant) విషయంగా–పదార్థాన్ని సరైన తీరులోనే బయటపెడుతున్నదిగా ప్రదర్శించుకుంటుంది. ఈ సమస్య వాస్తవికతను, వస్తువును గ్రహించడంలో మానవుని ఆచరణను తన కార్యకలాపాన్ని పరిగణలోకి తీసుకోకపోవడమే తలయెత్తడానికి కారణము. మానవుని ఇంద్రియ–ఆలోచన ఆచరణల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునే వాస్తవ స్థితి కలిగినదిగా లేదని గమనించాలి. అందుకనే ధ్యానాత్మక భౌతికవాద స్పృహ మానవుని తాత్వికత–రాజకీయార్థిక అంశాలపై తీవ్రమైన ప్రభావము కలిగిస్తూ భారతదేశం

యొక్క సామాజిక అభివృద్ధికి ఆటంకంగా మారింది. ఈ సమస్యను మరింత లోతుగా పరిశీలన చేద్దాం.

ధ్యానాత్మక భౌతికవాదం మానవుని ఇంద్రియ కార్యకలాపాన్ని, ఆచరణను గ్రహించకుండా, కేవలం భావవాద దృక్పథపు సారాన్ని మోసుకెళ్ళే పద్ధతిని అనగా మానవుని ఆలోచననే అన్నింటికీ మూలమని రుజువు చేయడానికి ప్రయత్నిస్తుంది. ఈ పద్ధతి, దృక్పథం నాణేనికి ఒక వైపునే ప్రదర్శించడం ఫలితంగా చరిత్ర నిర్మాతలు ప్రజలు అనే అంతర్గత సారాన్ని (Internal Essence) ప్రక్కకు నెట్టి ఆచరణాత్మక–విమర్శనాత్మక ఇంద్రియ కార్యకలాపాన్ని–విప్లవాత్మక ఆలోచనా వస్తువును దాని ఆచరణాత్మక–అభివృద్ధికరత్వాన్ని కించపరుస్తూ ఒక స్వతంత్ర శాస్త్రీయ అన్వేషణా తాత్వికతగా తనను తను ప్రదర్శింప చేసుకుంటుంది. ఈ దృక్పథం యొక్క పద్ధతి ఎలా ఉంటుందంటే తత్వశాస్త్ర అధ్యయనం ఊహాత్మక–వాస్తవిక విభజన అనగా భావవాద–భౌతికవాద విభజనగా చిత్రీకరణ–వివరణగా ఉండటంగా ఉంటూ చారిత్రక తప్పిదంలో అగ్రగణ్య పాత్ర కలిగినది. ఎందుకంటే ఆనాటి భౌతికస్థితి అనగా సామాజిక భౌతిక వాస్తవికత యొక్క భావ వ్యక్తీకరణగా గుర్తించనటువంటి సమస్యగా ధ్యానాత్మక భౌతికవాదం ఉంటుంది.

నిజానికి–వాస్తవికంగా గతితార్కిక చారిత్రక భౌతికవాదం విశిష్టత ప్రతిఫల మానవ చారిత్రక వివరణతో ఉంటుంది, ఈ ప్రతిఫల మానవ చారిత్రకతను రుజువు చేయడానికి ప్రాథమిక మానవ స్వరూప–స్వభావాలను ఉదాహరణకు వాడటం జరుగుతుంది. ఐతే ఒక గొలుసు, క్రమం, విధానం ప్రతిఫల మానవ చారిత్రక వివరణలో కనబడే సత్యం ప్రాథమిక మానవ స్వరూప వివరణలో గోచరించదు. ఎందుకంటే ప్రతిఫల మానవ చరిత్ర ప్రాథమిక మానవస్వరూపం అంతర్గత విభజితం కానిదిగా గ్రహించకపోవడంతో ప్రారంభమవుతుంది. ఈ తప్పు ఒక సమగ్రతను, అభిన్నతను గ్రహించడంలో అలాగే దీనిని నడిపించడంలో లోపంగా ఉంటుంది. కార్మికుడు తను చేసే శ్రమను నిర్బంధ శ్రమగా భావించే

పద్ధతి అనివార్యంగా తాను తన గురించి ఆలోచించుకునే సమయంలో తన కుటుంబంలోని తను–పిల్లలు ఒక రకమైన స్వేచ్ఛను కలిగించుకునే–కలిగించే విధానం కనబడుతుంది. ఇది నిర్బంధ శ్రమపై అసహ్యము మూలంగా ఏర్పడుతుంది. ఎందుకంటే పరిశ్రమలపై లాభాలు పెట్టుబడిదారునికి ఆదాయాలు పెంచుతుంది కానీ కార్మికుడి జీతంలో ఎటువంటి పెరుగుదల ఉండదు. ఈ స్వేచ్ఛ అనివార్యంగా ఆనాటి సామాజిక తాత్వికత ప్రభావానికి గురైనటువంటిదిగానే ఉంటుంది. ఈ స్థితి ఈ స్వేచ్ఛ వివిధ పెటీ బూర్జువా సిద్ధాంతాలుగా ఉనికిలోకి రావచ్చు (ప్రత్యేక పరిస్థితులు). పాలక తాత్వికతకు–పెటీ బూర్జువా తాత్వికతకు మధ్య ఉండే వైరుధ్యాన్ని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఇలా నిర్దిష్టంగా తాత్వికతకు–వాస్తవిక భౌతిక సామజిక సంబంధంకూ ఉండే అంతఃసంబంధాన్ని ఒక ఉదాహరణగా వివరించుకోవచ్చు.

ఆచరణ భావాత్మక వస్తుగతాంశమా? వస్తుగతాంశపు భావాత్మక స్థితా అని పరిశీలించే సంఖ్య, పద్ధతి ఎక్కువగా ఉండటం గమనించవచ్చు, వాస్తవానికి రెండిటినీ విడిగా చూడటం సరైన పద్ధతి కాదనే చెప్పుకోవాలి. వస్తుగతాంశపు భావాత్మక స్థితి భావాత్మక వస్తుగతాంశముగా, భావాత్మక వస్తుగతాంశము వస్తుగతాంశపు భావాత్మక స్థితిగా అభివృద్ధి చెందుతుంది. ఇది నిరంతర చలనస్థితిగా అవగాహన చేసుకోవాలి. నిజానికి ఒక వాదం లేదా పక్షంకు వైరిపక్షపు మరియూ సంశ్లేషణగా విడిపోయే స్థితి కలిగ ఉంటుంది. అనగా పక్షం నుంచే వైరిపక్షం ఏర్పడటం పక్షం–వైరిపక్షం యొక్క ఘర్షణ సమన్వయం–సంశ్లేషణగా మార్పును గమనించడం జరుగుతుంది. అంతే కాకుండా వైరిపక్షం పక్షం మరియు సంశ్లేషణ అంశాలతో కూడి ఉంటుంది. పక్షం మరియు వైరిపక్షములోనూ పక్షం–సంశ్లేషణ లేదా సమన్వయం అంతఃసంబంధం కలిగియుంటుంది. సాధారణం–ప్రత్యేకం ఈ రెండూ కలసి ఏకత్వాన్ని ఏర్పరుస్తాయి, సాధారణ ప్రత్యేకం–ప్రత్యేక సాధారణం ఈ రెండూ సంశ్లేషణగా ఏకత్వాన్ని ఏర్పరుస్తాయి. సంశ్లేషణ అనేది పక్షంగా రూపాంతరం చెందుతుంది పక్షంగా

మారడానికి వైరిపక్షం ఏర్పాటుతో అభివృద్ధి చెందుతుంది, దీనిని మనం ఇలా చెప్పుకోవచ్చు.

ప్రాథమికం	మధ్యంతరం ఉన్నతం
మధ్యంతరం	ప్రాథమికత ఉన్నతం
ఉన్నతం	ప్రాథమికత ఉన్నతం నూతనం

వైరుధ్యం యొక్క సాధారణ ప్రత్యేకత ప్రాథమిక స్థానాన్ని కలిగి ఉండటంతో ఆ ప్రత్యేకతను పరిష్కరించ పూనుకున్నప్పుడు సాధారణ వైరుధ్యం యొక్క మొత్తం అస్థిత్వాన్ని పరిగణలోకి తీసుకోవడం జరగాలి. అప్పుడు ప్రత్యేక ప్రాథమిక స్థానాన్ని పరిష్కరించడం సులభతరంగా ఉంటుంది. ఎందుకంటే సాధారణంలో ప్రత్యేకం ఇమిడి ఉండటంతో పాటుగా ప్రత్యేకం నుండి సాధారణానికి చలనశీలత కలిగి ఉంటుంది. ఈ చలనశీలత సంశ్లేషణ దిశగా గమ్యం కలిగి ఉండటం ముఖ్య విషయం. సాధారణ వైరుధ్యపు స్థాయికి అభివృద్ధి చెందడం ప్రత్యేక వైరుధ్య పరిష్కారం, రూపం–సారం అంతర్లీనంగా ముందుకు వెల్లడంగా కనబడుతుంది. సాధారణ వైరుధ్యపు ఉన్నతీకరణ ప్రత్యేక వైరుధ్య ఆటంకాన్ని–అడ్డంకిని తొలిగించడంతో స్థాపితమవుతుంది. అయితే సాధారణ వైరుధ్యం ప్రత్యేక వైరుధ్యంగా అంతర్లీనపరుచుకోవడం కచ్చితంగా వాటి మధ్య సాధారణం ప్రత్యేకంగా, ప్రత్యేకం సాధారణంగా వ్యక్తమవ్వడం మూలం. ఈ మూల సూత్రం ఇంద్రియా గ్రహకం, ఆలోచనా వస్తువు యొక్క అంశానికీ వర్తించే, అన్వయించుకునే ప్రాథమికత కలిగినది, విడదీయనటువంటిది. ఆలోచనా వస్తు వాస్తవికత అనివార్యంగా ఆచరణ యొక్క శక్తి, వాస్తవికత, లౌకికత–విశ్వజనీనత పై ఆధారపడి ఉండటం కీలకం, లేనిచో మానవ సామాజిక సంబంధం నుండి వైదొలిగి మాయావాదంలోకి మరీ ముఖ్యంగా తన

హేతుబద్ధతను కోల్పోవడం జరుగుతుంది. ఇక ఇది మానవుని అమాయకపు, విచిత్ర హాస్యాస్పద వ్యవహారంగా పరిగణించడం ముందరి తరాలకు ఆవశ్యకంగా మారుతుంది. మానవ ఆచరణను గీటురాయిగా తీసుకొనని ఏ పరిశోధనైనా మానవున్ని అతీతంగా చిత్రించే పార్శ్వాన్ని అభివృద్ధిపరచడంతో పాటుగా బానిసత్వ - లొంగుబాటు ధోరణి ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

ఈ విధానం ధ్యానాత్మక భౌతికవాద ముఖ్య తాత్వికతగా పరిగణించాలి. ఈ పద్ధతి భారతీయ సామాజిక తాత్వికతగా నిరంతరం అభివృద్ధి చెందుతూ వచ్చింది. భావవాదపు ద్వైతం-అద్వైతం-విశిష్టాద్వైతపు సారం-లక్షణం-రూపం ధ్యానాత్మక భౌతికవాద తాత్వికతగా మానవ సామాజిక మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుంది. మానవ సామాజిక ఆచరణ రెండు భిన్న దృక్పథాలను ఏర్పరుస్తుంది. ఈ దృక్పథాలలో ఇమడని మనిషి ఉండడు ఒకటి ఆయాకాలపు సాంఘిక ఆధిపత్య దృక్పథం, రెండు ఈ ఆధిపత్యానికి వ్యతిరేకమైనది. ఈ వ్యతిరేక దృక్పథం యొక్క అవగాహన మనిషిలో ఇమిడిన వెంటనే అది ఒక భౌతికశక్తిగా అంటే నూతన ఆచరణగా మార్పు చెందుతుంది, దారితీస్తుంది. ఎందుకంటే ఆధిపత్యం భూస్వామికి-పెట్టుబడీదారునికి లాభం-ప్రయోజనం చేకూర్చడం అనివార్యం, కావున ఆధిపత్య స్వభావానికి, దీని వ్యతిరేకానికి విభజన అనివార్యం. లాభం-ప్రయోజనం పొందని ప్రజలు-మనిషి తప్పక తన ప్రయోజన దృక్పథాన్ని ఏర్పర్చుకుంటాడు. ఇది వస్తుపర కార్యకలాపమైన ఆచరణ, ఇంద్రియ కార్యకలాపం యొక్క మానవ కార్యకలాప మూలం. స్వంత ఆస్తిలేని వర్గ శ్రమ కాలపు ఖర్చు తమ శ్రమశక్తి తరుగుదలగా, ఈ తరుగుదల స్వంతఆస్తి వర్గ సంపద పెరుగుదలగా ఉంటుంది. ఈ తరుగుదల-పెరుగుదలల గ్రహింపు నూతన పరిస్థితుల మార్పుకు అవకాశం ఏర్పరుస్తుంది. అది విప్లవాత్మకంగా ఉంటుంది. అందుకే మానవ ఆచరణ (ఉత్పత్తి, ప్రయోగం, విప్లవం మొదలైనవి) సామాజిక సంబంధాల సమాహారంగా ఉంటుంది, వ్యక్తమవుతుంది. దాని అంతర్గత-అంతర

వైరుధ్యంగా భాగం కలిగి ఉంటుంది. కావున ధ్యానాత్మక భౌతికవాదము భారతీయ మానవ సామాజిక చారిత్రక క్రమపు అంతఃసంబంధం యొక్క ఉత్పాధితం. గతితార్కిక చారిత్రక భౌతికవాదం యొక్క అభివృద్ధి, మార్పు అనే సహజత్వాన్ని మరింత సుసంపన్నం చేస్తూ మార్పును మార్చడంగా గమ్యం కలిగినది. అందుకే ధ్యానాత్మక భౌతికవాదాన్ని వ్యతిరేకించడమే కాదు సామాజిక మార్పును మార్చడానికి పూనుకుంటుంది. అందుకొరకు సమీకరణ, అధ్యయనం, పోరాటంకై తక్షణం అభివృద్ధి చెందుతుంది.

***

విప్లవ విద్యార్థి ఉద్యమం - నక్సల్బరీ

రష్యన్ సోషలిస్టు విప్లవ ప్రభావంతో భారత దేశంలోని విద్యార్థులు - యువకులు వివిధ సామ్యవాద బృందాలుగా ఏర్పడి మార్క్సిజాన్ని, రష్యన్ విప్లవాన్ని అధ్యయనం చేయసాగారు. భారతదేశంలో మార్క్సిజాన్ని అన్వయించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. బ్రిటీష్ కమ్యూనిస్టు నాయకులైన రజనీ పామిదత్, బ్రాడ్లీ, స్ప్రాట్‌ల తోడ్పాటుతో పాటుగా భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి రెండవ కమ్యూనిస్టు అంతర్జాతీయ సంస్థ సహాయ - సహకారాలు అందినాయి. దీనితో కార్మిక - రైతాంగ - విద్యార్థి వర్గాలను ఉద్యమాలల్లో సమీకరిస్తూ 1920లలో తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. అప్పటి నుండి విప్లవ విద్యార్థి వర్గం కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంలో భాగంగా అభివృద్ధి చెందింది.

జాతీయోద్యమంలో విద్యార్థి ఉద్యమం :

భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాద దాస్యానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున పోరాటంలో భాగస్వామ్యం అయ్యారు. పోరాటం మధ్యలో ద్రోహానికి గురికావడంతో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను కెరీరిజం వైపుగా మళ్లించే ప్రయత్నం చేసింది. ఈ కుట్రకు వ్యతిరేకంగా ఎన్నో ప్రాంతాలల్లో యాదృచ్ఛికంగా విద్యార్థి వర్గం స్వతంత్ర సామాజిక ఉద్యమ నిర్మాణానికై పూనుకుంది. ప్రజలను సంఘటితపర్చింది. అతివాద అవకాశవాద

ఆచరణతో ఈ ఉద్యమాలు దెబ్బతిన్నాయి. విశాల ఐక్యసంఘటన ప్రాతిపదికగా కాంగ్రెస్ - సోషలిస్టు కాంగ్రెస్ - కమ్యూనిస్టు పార్టీ వాదులతో 12 ఆగస్ట్ 1936న లక్నోలో స్వేచ్ఛ - శాంతి - ప్రగతి కోసం ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ నెహ్రూ ఆధ్వర్యంలో ఏర్పడింది. ఈ సంస్థ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఫాసిస్టు వ్యతిరేక పోరాటానికి విశాల విద్యార్థి సంఘటనను ఏర్పర్చింది. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ స్టూడెంట్స్, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ డెమోక్రటిక్ యూత్‌లతో ప్రపంచ విశాల ఉద్యమాన్ని ఏర్పరిచింది. ప్రజాస్వామికతత్వం, విద్యలో సంస్కరణలు, రాజకీయ హక్కులు, సామ్యవాద భారతదేశం కోసం పోరాటం సల్పారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ విద్యార్థి సంఘం క్రమ క్రమంగా కాంగ్రెస్ పార్టీ రాజీవాద దృక్పథానికి వ్యతిరేకంగా పోరాడటం ప్రారంభించింది. సోషలిస్టు కాంగ్రెస్ - కమ్యూనిస్టు పార్టీలు కాంగ్రెస్ మౌన దృక్పథాన్ని ఎండగడుతూ విశాల సామ్రాజ్యవాద వ్యతిరేక - ఫ్యూడల్ వ్యతిరేక - రెండవ ప్రపంచ యుద్ధ వ్యతిరేక పోరాటాలను నడిపాయి. సోషలిస్టు కాంగ్రెస్ పార్టీ మితవాదాన్ని బహిరంగపరుస్తూ బలమైన కమ్యూనిస్టు భావాలను ప్రచారం చేస్తూ విద్యార్థి వర్గాన్ని నిలబెట్టిన ఘనత కమ్యూనిస్టు పార్టీకి దక్కుతుంది. ఫలితంగా విద్యార్థి వర్గంలోని ప్రధాన భాగం కమ్యూనిస్టు పార్టీలో భాగస్వామ్యమైనారు.

విప్లవ విద్యార్థి ఉద్యమంపై రివిజనిస్టు ప్రభావం :

రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ రష్యా గెలుపు అనంతరం ప్రపంచ వ్యాప్తంగా విప్లవ వెల్లువ ఉధృతమైనది. చైనాలో మావో నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయంతో ఈ వెల్లువ గెంతుగా మూడవ ప్రపంచ దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక - ఫ్యూడల్ వ్యతిరేక సాయుధ ప్రతిఘటనా పోరాటాలుగా అభివృద్ధి కాసాగాయి. ఆ వెల్లువ భారతదేశంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంగా, తెభాగా, పున్నప్రా వయలార్, వర్లి గిరిజన పోరాటాల్లో ప్రతిఫలించింది. కమ్యూనిస్టు పోరాటాన్ని ఉన్నత దిశకు అభివృద్ధిపరిచింది. ఈ వెల్లువను అరికట్టడానికి

బ్రిటిష్ సామ్రాజ్యవాదం తయారుచేసిన దళారి బూర్జువా వర్గమైన కాంగ్రెస్‌కు బూటకపు స్వాతంత్ర్యం బదలాయించింది. ఫలితంగా కమ్యూనిస్టులలో కొందరు స్వాతంత్ర్యం వచ్చేసిందని, మరికొందరు ఇది బూటకమని భావించారు. వీరిరువురి సంఘర్షణ ఫలితంగా కమ్యూనిస్టు ఉద్యమం సంక్షోభంలోకి జారుకుంది. ఈ సమస్య పరిష్కారం కొరకు స్టాలిన్‌ను కలిసి భారతదేశ విప్లవ వ్యూహం – ఎత్తుగడలపై తమ అనుమానాలను తెలిపారు. స్టాలిన్ భారత విప్లవం రెండు దశలగుండా సాగుతుందని జనతా ప్రజాస్వామిక విప్లవం, అటుపిమ్మట సామ్యవాద విప్లవంగా ఉంటుందని వివరించారు. అంతేకాకుండా ఏ వర్గాలను తటస్థపరచాలి, ఏ వర్గాలతో ఐక్యసంఘటన కట్టాలి అనే విషయాలు వివరిస్తూ భారతదేశం సాయుధ పోరాటంతో పాటుగా కార్మిక వర్గ ఉద్యమాన్ని ముఖ్యంగా రైల్వే కార్మిక ఉద్యమం విప్లవంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ చర్చల అనంతరం భారతదేశానికి తనకంటూ ప్రత్యేక విప్లవ మార్గముందని, అది ఎన్నికల మార్గమని, పోరాటాలని ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరును విరమించి ఎన్నికల వైపుగా కమ్యూనిస్టు పార్టీ నడిచింది. దీనితో విప్లవ విద్యార్థులు ఎన్నికల రొంపిలోకి ఈడ్వబడ్డారు. వారి విప్లవతత్వం రివిజనిజంతో తుడిచి పెట్టుకుపోయింది. అవకాశవాదం, కెరీరిజం వైపుగా మలచబడ్డారు. కమ్యూనిస్టులే నూతన భూస్వాములుగా దళారులుగా మారిపోయారు. ఏ చిన్న ప్రాంతంలో ఏ రకమైన ఉద్యమం ముందుకొచ్చినా ఈ నూతన దళారులే అణచివేసారు. ఫలితంగా ప్రజల విప్లవతత్వాన్ని నీరుకార్చడానికి ప్రయత్నించారు. ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా మార్క్సిస్టు పార్టీ ఏర్పడిందని గొప్పగా ప్రచారం గావించారు, కాని నయారూపంలో రివిజనిజాన్ని ముందుకు తెచ్చి ఈ ప్రజా విప్లవతత్వాన్ని ఎన్నికలకు మాత్రమే పరిమితం చేసింది. నూతన భూస్వామ్యులు, దళారులు గల పునాదితో ఈ పార్టీ ఈ రోజుకూ కొనసాగుతోంది. మార్క్సిస్టు పార్టీ విద్యార్థి సంఘం 1970 డిసెంబర్ తిరువనంతపురంలో 27–30ల తేదీల నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాగా ఏర్పడింది. ఈ విద్యార్థి సంఘం ప్రధాన లక్ష్యం స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యం, సామ్యవాదం, నిరుద్యోగ

వ్యతిరేకత, హేతుదృక్పథం, న్యాయం కోసం పోరాటమని ప్రచారం చేస్తూ కేవలం ఎన్నికల రొంపిలోకి, అవకాశవాదంలోకి విద్యార్థులను సమీకరిస్తూ తాము గెలిచిన చోటల్లా సోషల్ ఫాసిస్టులుగా వ్యవహరిస్తూ ప్రజలను అణచడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రివిజనిస్టు–నయా రివిజనిస్టు దుర్మార్గాలకు వ్యతిరేకంగా, ప్రజల వాస్తవికతను దగ్గరకంటా గమనిస్తున్న విప్లవ కమ్యూనిస్టు వర్గం ఒక తిరుగుబాటుకు ఎదురుచూస్తున్నారు. ఒక వెల్లువకై నర్మగర్భంగా సైద్ధాంతిక – రాజకీయ –నిర్మాణ ఉద్యమాన్ని సాగిస్తున్నారు. ఫలితంగా వసంత మేఘ గర్జనతో రివిజనిస్టు బీటలు కదలబారాయి. ప్రజా సాయుధ పోరాటం పీడిత ప్రజల మార్గమైంది.

నక్సల్బరీ పోరాటం – విద్యార్థి ఉద్యమం :

1967 నక్సల్బరీ గ్రామంలో రైతాంగ సాయుధ విప్లవ పోరాటం ప్రారంభమైంది. ఈ పోరాట వారసత్వంగా 1969లో సి.పి.ఐ.(ఎం.ఎల్) ఏర్పడింది. కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో భారత దేశవ్యాప్తంగా రైతాంగ సాయుధ పోరాట ఉద్యమాల అభివృద్ధి, సమన్వయం, ఉధృతిని కొనసాగించారు. ఈ పోరాటం రివిజనిస్టు – నయా రివిజనిస్టు విధానాలకు, పద్ధతులకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించింది. దీనికి బలమైన కారణం సిపిఐ(ఎం.ఎల్) ఏర్పడక ముందట ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో భారత రాజ్యం స్వభావాన్ని మార్క్సిస్టు–లెనినిస్టు దృక్పథంతో సైద్ధాంతికంగా విశ్లేషించలేదు. ఈ సమస్యను పరిష్కరిస్తూ భారతదేశం దళారీ బ్యూరోక్రటిక్ రాజ్యంగా విశ్లేషిస్తూ సిపిఐ(ఎం.ఎల్) ఎన్నికలని బహిష్కరిస్తూ సామ్రాజ్యవాద–దళారీ బ్యూరాక్రటిక్ – భూస్వామ్య విధానాన్ని సాయుధ గెరిల్లా పోరాటంతో కూలదోయాలని పిలుపునిచ్చింది. అందుకై సాయుధ సైన్యాన్ని ఏర్పర్చుకుని విప్లవ ప్రజా కమిటీల నాయకత్వాన్ని ప్రతిష్ఠించాలనే ఆచరణకు పూనుకుంది. ఈ నేపథ్యంలో కామ్రేడ్ చారుమజుందార్ విద్యార్థులకు ఇచ్చిన సందేశం నేటికీ అనుసరణీయం.

చారుమజుందార్ విప్లవ విద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలను విడమరిచి చెప్పారు, పరిష్కారాన్ని చూపారు. "నేడు సామ్రాజ్యవాదం,

ప్రతిఘాతుక విప్లవ శక్తులు విద్యార్థి లోకాన్ని విద్యార్థి సంఘాలలోకి ఎరవేస్తున్నాయి. ఈ విద్యార్థి సంఘాలు సామ్రాజ్యవాదం దాని తొత్తులకు కుడిచేయి వంటివి. ఈ సంఘాలు విద్యార్థులు ఎదుర్కొనే విద్యకు సంబంధించిన సమస్యలను పరిష్కరించలేని పరిస్థితిలో ఉన్నాయి. ఈ సంఘాలు విద్యార్థులను ప్రస్తుత విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థుల నుంచి పోరాటానికి నాయకత్వాన్ని అందించలేని స్థితిలో ఉన్నాయి. ఈ కాలేజీ యూనియన్లు విద్యార్థులకు ఆర్థికవాద దృష్టి కోణాన్ని ఏర్పరుస్తుంటాయి. దీనితో విద్యార్థుల విప్లవకరమైనటువంటి నైపుణ్యాన్ని దెబ్బతీసి రైతాంగ, శ్రామికవర్గ పక్షంతో కలవనీయకుండా చేస్తున్నాయి. దీనితో విప్లవకర సామర్థ్యం నశిస్తుంది. ఈ సంఘాలలో ఉండేవారు ముఖ్యంగా అవకాశవాదం, కెరీరిజం వైపుకు వెళుతున్నారు. ఈ సంఘాలలో నాయకత్వ స్థానంలో ఉండాలనే దృష్టితో అవకాశవాద జట్టులు ఏర్పర్చుకుండటం జరుగుతోంది. దీనితో విప్లవకర విలువలను తుంగలో తొక్కేస్తున్నారు. సామ్రాజ్యవాదం వేసిన ఎరలను అంది పుచ్చుకుంది నేటి మన భారత ప్రభుత్వం, దాని తొత్తులు కాబట్టి అవి చూపే సామ్రాజ్యవాద వ్యతిరేక ఫోజు ఒక అబద్ధం. అలానే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని నడపకుండా ఉండే సంఘాలన్నీ ఎరలో పడ్డ సంఘాలే, లొంగుబాటుతత్వం కలిగినవే. కాబట్టి లొంగుబాటుతనం నుండి దూరమై రైతాంగ, శ్రామికవర్గంతో మమేకమై దేశ విముక్తి పోరులో విద్యార్థులు చేతులు కలపాలి..''

అంతేకాకుండా చారుమజుందార్ విప్లవ విద్యార్థులకు డవుటిజం (అనుమానతత్వం), సీక్రటిజం (రహస్యతత్వం), రివిజనిజాలకు వ్యతిరేకంగా పోరాడటం ప్రధాన కర్తవ్యమని దిశానిర్దేశం చేసారు.

డవుటిజం (అనుమానతత్వం)

మనం వహిస్తున్న మార్గం అంటే సాయుధ పోరాటం సరైనదేనా? కాదా? తప్పు చేస్తున్నామా? అనే చాలామంది అనుమానంతో ఉంటారు. దీంతో అపనమ్మకం, అయోమయానికి గురవుతుంటారు. దీనికి కారణం

రాజ్యం, రివిజనిస్టు సంఘాలు, పార్టీలు. ఈ అనుమానతత్వం రివిజనిజం ప్రతిబింబమే అని గమనించాలి. అందుకై మన విప్లవకర పంథాను మునుముందుకు ఎత్తిపడుతూ రివిజనిస్టు నాయకుల నడ్డివిరచాలి.

సీక్రటిజం (రహస్యతత్వం)

విప్లవకర రాజకీయాలను వివరించకుండా, పరిస్థితులకు సరిగ్గా అన్వయించకుండా ఉన్నంత కాలం ఈ రహస్యతత్వపు సమస్య వెంటాడుతూనే ఉంది. ఈ రహస్యతత్వం ఉదారవాదపు బీజమని గమనించాలి. ప్రజలను చైతన్యపర్చకుండా ఉన్నన్ని రోజులు మనం ఉద్యమించలేం. అవసరమైన చోట విప్లవకర రాజకీయాలను చర్చించకుండా అనవసరపు రహస్యతత్వాన్ని పాటించడం, విప్లవకర పరిస్థితులు లేవని అప్పటి వరకూ మన పని మనం చేసుకుంటూ ఉండిపోవాలనడం, రాజకీయాలు అవసరం లేదనే రివిజనిస్టు ధోరణే ఈ రహస్యతత్వం.

రివిజనిజం

కేవలం కొన్ని డిమాండ్ల కొరకు ఉద్యమాన్ని నిర్వహించి ఆ ఉద్యమ విజయంతో రాజకీయ బాధ్యత నెరవేరిపోయిందనే భావనను కలిగి ఉండటం. ప్రజా సంఘం ఆచరణే ప్రధానమైన ఆచరణగా భావించడం రివిజనిజం. దానితో రాజకీయ లక్ష్యం పక్కకు వెళ్ళిపోయి ఆర్థికవాద ఆచరణ కలిగిన సంఘంగా ఉండిపోతుంది. ఫలితంగా మందకొడి ప్రతిఘటనా పోరాటాన్ని నిర్వహిస్తారు. మొత్తం విప్లవ ఆశయాన్ని రివిజనిజంతో హత్యచేస్తారు.

కాబట్టి విద్యార్థులు గ్రామీణ ప్రాంతంలోని రైతాంగంతో మమేకమవ్వాలి. గ్రామాలకు తరలి వెళ్ళాలి. పట్టణాలల్లో కార్మిక – శ్రామికులతో మమేకమై విప్లవోద్యమంలో భాగస్వామ్యమవ్వాలని పిలుపును ఇచ్చారు చారుమజుందార్.

ఈ పిలుపు మేరకు భారీ స్థాయిలో విద్యార్థి లోకం విప్లవ కార్యాచరణలో భాగమైనారు. ఈ పిలుపు విద్యార్థులను ఎలా చైతన్యపరిచిందీ వివరిస్తూ చారుమజుందార్ ఇలా రాశారు. 'డెబ్భై దశాబ్దం నుంచి విద్యార్థి,

యువజనులు పోరాటాల వైపు కదం తొక్కారు. ఈ పోరాటాలు దేశం నలుమూలలు దాకా విద్యార్థిని, విద్యార్థులను మేలుకొలిపింది. ఈ అగ్నికణం విద్యార్థులకే పరిమితం కాలేదు. ఈ చిచ్చు దేశంలో అత్యంత హీనంగా దోపిడికి గురి కాబడుతున్న రైతాంగాన్ని, కార్మికులను మేలుకొలిపింది. విద్యార్థి, యువజనులు కేవలం తమ ప్రయోజనార్థం పోరాటాల వైపుకు మరల లేదు. మొత్తం దేశ ప్రయోజనార్థం పోరాటాలు నిర్వహించారు ప్రారంభంలో విద్యార్థి ఉద్యమం తమ ప్రయోజనార్థం జరిగినా అది తరువాత దేశ ప్రయోజనార్థం ఉద్యమించే దిశగా సాగే కోణాన్ని గమనించవచ్చు. దీనికి గల కారణం ఏమిటి? విద్యార్థుల సమస్యలు కేవలం వారికే పరిమితమైనవి కావని, ఈ సమస్యలు ఇప్పటి వ్యవస్థ మూలంగా ఉత్పన్నమవుతున్నాయని, ఈ వ్యవస్థ సమూల మార్పుతోనే సమస్యలు పరిష్కారమౌతాయనే చైతన్యమే విద్యార్థి పాత్ర దేశంలోనే రైతాంగ, కార్మికవర్గ ఉద్యమాలతో మమేకమవడానికి మూలమని గమనించగలం. కావున విద్యార్థి లోకం రెండు విధాలుగా విడిపోయింది. ఒకటి రైతాంగం, శ్రామికవర్గం పక్షాన చేరి విప్లవకారులుగా ఉద్యమంలో పాల్గొనడం. రెండు రైతాంగం శ్రామికవర్గం పక్షాన నిలబడకుండా ప్రతిఘాతుక విప్లవకారులుగా దోపిడీ చేసే వర్గంవైపు నిలుచుండటాన్ని గమనిస్తాం. ప్రజల పక్షాన నిలుచున్న విద్యార్థుల నుంచి అత్యంత సహకారాన్ని మనం గమనించవచ్చు. సామ్రాజ్యవాదం, భూస్వామ్యపు దోపిడీ మూలంగా మనదేశ రైతాంగం, శ్రామికవర్గం అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నారు. విప్లవ విద్యార్థి పక్షం రైతాంగానికి, శ్రామికవర్గానికి విప్లవ అక్షరాస్యతను నేర్పిస్తూ వారిని విప్లవోద్యమంలోకి పుంజుకునేటట్లు చేసింది. విప్లవ విద్యార్థులు వారి చదువులకు స్వస్తి చెప్పి పూర్తికాలం విప్లవకారులుగా రైతాంగం, శ్రామికవర్గంలో రాజకీయ ప్రచారం చేసారు. గెరిల్లా పునాది ప్రాంతాలను నిర్మించారు. దీనితో పాటుగా అత్యంత త్యాగగుణం కలిగి ఉండటం, ప్రతి పరిస్థితికీ తమను మలుచుకుని నడుచుకోవడమూ విప్లవ విద్యార్థులు నిర్వహించారు. రాజ్యం, పోలీసుల అఘాయిత్యాలను,

అత్యాచారాలను, బూటకపు ఎన్‌కౌంటర్లను సైతం లెక్క చేయకుండా విప్లవ విద్యార్థులు ఉద్యమంలోకి ముందుకొచ్చారు. సామ్రాజ్యవాదం, భూస్వామ్యం పతనం అత్యంత త్వరితమైన దశలో పుంజుకొచ్చిన వెల్లువే ఈ విప్లవ విద్యార్థులు. ఇలా విప్లవ విద్యార్థులు భారత విముక్తి ఉద్యమానికి చేసిన త్యాగం హిమాలయ పర్వతమంటిది...”

సిపిఐ (ఎం-ఎల్) పోరాటం వెనకడుగు - పునర్నిర్మాణం - విప్లవ విద్యార్థి ఉద్యమం

“వీర తెలంగాణ పోరాటం, పున్న ప్రావాయలార్, బెంగాల్లోని తెభాగ ఉద్యమాల్లో జరిగిన వీరోచిత సాయుధ పోరాటాలకు వారసులుగా ఈనాటి సాయుధ రైతాంగ విప్లవాన్ని ఆరంభించి కొనసాగించగలగడం కమ్యూనిస్టు పార్టీ (ఎం.ఎల్)కు ఎంతైనా గర్వకారణం. రివిజనిస్టు నాయకత్వంపై తిరుగుబాటు చేసి పార్టీలో పదునైన సిద్ధాంత పోరాటం జరిపిన ఫలితంగా వచ్చింది కనుక నక్సల్బరి పోరాటం గతంలోని తెలంగాణ తదితర విప్లవకర పోరాటాల కంటే మెరుగైన పోరాటం. శత్రువు బలహీనంగా ఉండే విశాల గ్రామీణ ప్రాంతాలలో స్థావర ప్రాంతాలు నిర్మించి, ఒంటరి స్థలాల నుండి విస్తార ప్రాంతాలకు విస్తరిస్తూ క్రమక్రమంగా చుట్టుముట్టి చివరకు నగరాలలో అధికారాన్ని హస్తగతం చేసుకుని సాయుధశక్తి ద్వారా దేశవ్యాప్తంగా విజయం సాధించడమే విప్లవం యొక్క కీలక కర్తవ్యమనే విషయాన్ని ఇదివరకెన్నడు పార్టీలో సిద్ధాంతపరంగా ఆమోదించి ఉండలేదు.”

కాని సి.పి.ఐ.(ఎం.ఎల్.) 1970 నుండి వెనుకంజ వేసింది, నష్టాలను చవి చూసింది. దానికి గల కారణాలేమంటే. “ఆనాటి పార్టీలో రెండు తరగతుల వారు ఉన్నారు. సిపిఎం నుండి వేరై బయటకు వచ్చి సాయుధ పోరాటంలో పాల్గొన్న కొద్దిమంది ఆర్గనైజర్లు, ముఖ్యంగా జిల్లా, తాలూకా స్థాయిలో ఉన్న ఆర్గనైజర్లు ఒక తరగతి, అంతకు పూర్వం రాజకీయ పార్టీతోనూ సంబంధం లేకుండా కేవలం నక్సల్బరీ పోరాటంతో ఉత్తేజం పొంది సాయుధ పోరాటంలో పాల్గొనడానికి సిద్ధమై వచ్చిన

చాలామంది విద్యార్థి యువకులు రెండవ తరగతి. మొదటి తరగతి వారికంటే రెండవ తరగతి వారు సంఖ్యలో చాలా హెచ్చు. మరో మాటలో చెప్పాలంటే ఆనాటి నుండి ఈనాటి వరకు వారే పార్టీకి జీవనాడిగా ఉన్నారు. పై రెండు తరగతులకు చెందిన క్యాడరు మన పార్టీ నిర్మాణానికి పునాది. ఈ క్యాడరు కేవలం విప్లవ రాజకీయాల పట్ల అభిమానంతోనే గాక విప్లవ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనాలనే దీక్షతో సర్వస్వం త్యాగం చేయడానికి సిద్ధమై వచ్చినవారు. ఇది మన పార్టీ నిర్మాణానికి గల ఉజ్వల భవిష్యత్తును సూచించే పాజిటివ్ ఎఫెక్టు. మరో ఎఫెక్టు కూడా ఉన్నది దానిని కూడా మనం గమనంలోకి తీసుకోవాలి. క్యాడరులో నూటికి తొంభైమంది విప్లవానికి సంబంధించిన అనుభవం ఏమాత్రమూ లేని వాళ్లు. విప్లవోత్సాహం త్యాగ దీక్ష ఉన్నంతగా మార్క్సిస్టు విజ్ఞానం లేనివారు. 'ప్రజలే నిజమైన విప్లవకారులు. ప్రజలని సంఘటితం చేయకుండా విప్లవ విజయాన్ని పొందడం సాధ్యం కాదు' అనే విషయాన్ని సాధారణంగా ఆమోదించినా ఆచరణలో దానికంటే సాహసకృత్యాలపై ఇన్స్‌పైర్ అయ్యే తత్వం కలవాళ్ళు. వారిలో ఉన్న ఈ లక్షణాలన్ని మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనా విధానంపై ఆధారపడి, విప్లవానికి సారథ్యం వహించగల పటుతరమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న బలహీనతలు..."

అంతేకాకుండా వర్గ శత్రు నిర్మూలనే ప్రధాన పంథాగా, ప్రజా పోరాటాన్ని, ప్రజా సంఘ నిర్మాణాన్ని అతివాద పంథాతో విశ్లేషించడం జరిగింది దీనితో ప్రజల సాధారణ నిరసనలు సైతం రివిజనిజంగా పరిగణించడం జరిగింది. "ఫలితంగా వీరులే చరిత్ర నిర్మాతలుగా" భావించే భావజాలం విస్తృతంగా వ్యాపించింది. ఫలితంగా నక్సల్బరీ, శ్రీకాకుళం, గోపివల్లభపూర్, ముషహరి, లిఖింపుంకేరి, తల్లసరీ, పుల్పల్లి పోరాటాలు క్రమంగా వెనకడుగుకు దారి తీసాయి. ఈ తిరోగమనాన్ని ఆసరా చేసుకుని తమ గత విజయాలను పూర్తిగా విస్మరించి పార్లమెంటరీ వాదాన్ని, ఆర్థికవాదాన్ని సమర్థించే వర్గం, అంతేకాకుండా విమర్శకు ఆస్కారాన్ని ఇవ్వకుండా గత ఆచరణను పూర్తిగా సమర్థించే వర్గం అభివృద్ధి చెందాయి. ఈ రెండు దృక్పథాలను విమర్శిస్తూ ఆత్మ విమర్శతో ప్రజా సాయుధ గెరిల్లా పంథాను అభివృద్ధి చేసిన మూడవ వర్గం గెంతుగా ప్రజా పోరాటాలను, ప్రజా సంఘాలను నిర్మిస్తూ ప్రజా సైన్యం – పునాది ప్రాంతాలను ఏర్పర్చుకుంటూ పార్టీ నిర్మాణాన్ని పునాది వర్గాల నేపథ్యంలో భాగస్వామ్యం చేస్తూ పార్టీ విద్యతో విప్లవ ప్రజలను తయారు చేస్తూ అలలు అలలుగా ముందుకు సాగుతుంది. అందుకొరకు సాంస్కృతిక రచయితల సైన్యాన్ని ఏర్పర్చడమే కాకుండా ఈ ఆత్మవిమర్శ నేపథ్యంలో బలమైన సైద్ధాంతిక విద్యార్థి వర్గ ఉద్యమాన్ని నిర్మించడం జరిగింది.

1974వ సంవత్సరం రాడికల్ విద్యార్థి ఉద్యమం ప్రారంభం అయ్యింది. ఈ విద్యార్థి సంఘం నిర్మాణమే రివిజనిస్టు రాజకీయాలను ఎండకడుతూ ప్రారంభమైంది. ప్రజాసంఘాలకు రాజకీయాలతో అవసరం లేదు కేవలం దాని పరిధిలో మాత్రమే ఉండాలనే వాదాన్ని వ్యతిరేకిస్తూ రాడికల్ విద్యార్థి సంఘం ఉద్దేశ్యాలు, లక్ష్యాలను ఇలా ప్రకటించింది. 1) మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని మార్గదర్శకంగా అంగీకరించటం. 2) జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తి చేసే ఉద్దేశంతో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడం. 3) విద్యార్థుల న్యాయమైన కోర్కెల సాధన కోసం ఇతర విద్యార్థి సంఘాలు నిర్వహించే పోరాటాలన్నింటికీ సమన్వయ కార్యక్రమం ద్వారా సహకరించడం. 4) ఫ్యూడలిజం – బ్యూరోక్రటిక్ పెట్టుబడి – సామ్రాజ్యవాదం దోపిడీకి వ్యతిరేకంగా జరిగే అన్ని ప్రజా పోరాటాలకు మద్దతివ్వడం. 5) కులం–మతం–ప్రాంతం–జాతి–లింగ ప్రాతిపదికపై ఉన్న వివక్షతలను వ్యతిరేకించడం మొదలైనవి. ఈ నేపథ్యంగా విద్యార్థి వర్గం గ్రామాలకు తరలి తమను విప్లవ విద్యార్థులుగా మలచుకున్నారు. ప్రజలలో భాగమైనారు, విప్లవకారులుగా తీర్చిదిద్దబడ్డారు. దండకారణ్య జనతన సర్కార్‌కు పునాదులైనారు.

గ్రామాలకు తరలండి కార్యక్రమం, ఫలితాలు

1. సామ్రాజ్యవాదం దాని తొత్తులను నిర్మూలించి, భూస్వామ్య దోపిడీని

రైతాంగంపై నుంచి నిర్మూలించి, ప్రజాస్వామ్య వ్యవస్థను స్థాపించడం ప్రధాన లక్ష్యంగా ఉన్న దేశాలలో ఈ కార్యక్రమం అమలైంది.

2. అర్ధవలస, అర్ధభూస్వామ్యం లాంటి దేశాలలో విప్లవాభివృద్ధి అసమానతలతో ఉండటం మూలంగా, ప్రత్యక్ష విప్లవకర పరిస్థితి కాకుండా సాధారణ విప్లవ వెల్లువలు మాత్రమే ఏర్పడే స్థితి మూలంగా ఈ కార్యక్రమం సాధ్యమవుతుంది. భారతదేశ గ్రామీణ ప్రత్యేక పరిస్థితి అనగా కులాల విభజన ప్రాథమికంగా ఉండటం చేత ఈ కార్యక్రమం అవసరమైంది.

3. సామ్రాజ్యవాదపు దోపిడీకి దేశంలోని ప్రత్యేక ప్రాంతాలను ఏర్పరచుకుని విభజించి పాలించే విధానం, స్థానికతత్వం కలిగిన వ్యవసాయ విధానం ఉన్న దేశంలో ఈ కార్యక్రమం అవసరం.

4. సామ్రాజ్యవాదపు దోపిడీకి దేశంలోని ప్రత్యేక ప్రాంతాలను ఏర్పరచుకుని విభజించి పాలించే విధానం ఉండటం మూలంగా పట్టణ ప్రాంతాలు, సామ్రాజ్యవాదం దాని తొత్తులు నిర్మించిన ప్రత్యేక వ్యవస్థను కలిగి ఉంటాయి. కాబట్టి దాని మూలంగా ఉద్యమం విచ్ఛిన్నం అవ్వడం జరుగుతుంది. కాబట్టి, అలాగే కార్మిక వర్గం బలం ప్రధానంగా లేకపోవడం మూలంగా, రైతాంగం ప్రధానంగా ఉండిన దేశంలో, రైతాంగం గ్రామాలలో ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఉంది కాబట్టి ఈ కార్యక్రమం అమలైంది.

5. సామ్రాజ్యవాద దేశాలు భారతదేశంపై పోటీ పడటం, దీని మూలంగా పాలకవర్గాల మధ్య, పాలక వర్గ పార్టీల మధ్య ఘర్షణలు ఏర్పడటం జరుగుతున్నన్నీ రోజులు మనకు ఈ కార్యక్రమం అమలు చేయాల్సి ఉంటుంది.

6. సామ్రాజ్యవాద దేశాల మధ్య ఘర్షణ, సామ్రాజ్యవాద దేశాలకు వలస, అర్ధవలస దేశాలకు మధ్య ఘర్షణ, సామ్రాజ్యవాద దేశాలలోని దోపిడీ శక్తులకు కార్మికులకూ మధ్య ఘర్షణ మూలంగా ఈ కార్యక్రమం సాధ్యమవుతుంది.

ఫలితాలు

1. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత వర్గ పరిశీలనలో మన శత్రువులెవరు? మన మిత్రులెవరు? తెలుసుకొని విప్లవోద్యమాన్ని ముందుకు తీసికెళ్లారు.
2. విప్లవ పరిపక్వతకు ప్రధాన గీటురాయి నిర్మాణ బలం. కాబట్టి రైతాంగంతో గ్రామాల్లోనే నిర్మాణ బలం పెంచారు.
3. దున్నేవానికి భూమి ప్రాతిపదికన వ్యవసాయ సంస్కరణల అమలు, వ్యవసాయ సంబంధిత సమస్యలు, పరిశ్రమలపై అవగాహన. వ్యవసాయ సమిష్టీకరణ ఆచరణకు మార్గం తెలియజేశారు. గ్రామాల్లోనే ఉండి గ్రామీణ ప్రాంత విముక్తి స్థావరాలు ఏర్పరచి, వ్యవసాయ విప్లవాన్ని తీవ్రం చేశారు. రాజకీయాధికారాన్ని విస్తృతపరిచారు.
4. ఈ కార్యక్రమం ద్వారా విముక్తి ప్రాంతాల దిశగా ఉద్యమం విస్తరించింది. దీనికి ఉదాహరణే దండకారణ్యం.

నేటి విప్లవ విద్యార్థి ఉద్యమం :

రాజకీయ, బౌద్ధిక చరిత్రకు ఉత్పత్తి విధానం కీలకం. బౌద్ధిక చరిత్ర ఆనాటి ఉత్పత్తి సంబంధాల (పునాది) ప్రతిఫలనమైన ఉపరితలంలో భాగం. ఇది తిరిగి ఉత్పత్తి సంబంధాలపై ప్రభావం చూపుతుంది. వివిధ సామాజిక వర్గాలు వాటి ఆచరణ ఫలితాలు, పోరాట రూపాలు తాత్వికంగా విశ్వవిద్యాలయాలలో సంశ్లేషిస్తాయి. ఈ సంశ్లేషణ ఆధిపత్య భావజాల పునాది ప్రాతిపదిక ప్రధాన వైరుధ్యంగా పక్షం లేదా వాదనగా ఏర్పడుతుంది. ఈ పక్షానికి వ్యతిరేకంగా వైరిపక్షం ఏర్పడటమే కాకుండా పక్షానికి వైరిపక్షానికి మధ్య వైరుధ్యంలో విరోధాబాస దశ ఏర్పడుతుంది. ఈ దశ తనకు తానే వైరుధ్యంగా ఉంటుంది. ఫలితంగా ఈ దశను దాటి విప్లవ పునర్నిర్మాణం కాసాగాలి. లేదా వైరుధ్యంలోని వైషమ్యస్థానాలు నాశనమన్నా కావాలి. భారతదేశంలోని దళారి బ్యూరాక్రటిక్ పెట్టుబడి ప్రతిఫలనం విద్యార్థులపై ఆధునికానంతరవాద తాత్వికతగా ప్రభావం చూపుతుంది

(బౌద్ధికంగా). అంతేకాకుండా ఆధునికానంతరవాద తాత్వికత దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిపై ప్రభావం చూపుతుంది, వ్యవస్థను పర్యవేక్షిస్తుంది. ఆధునికానంతర వాదం – నూతన ప్రజాస్వామిక తాత్వికతలకు మధ్య వైషమ్యం విశ్వవిద్యాలయాలల్లో దాని అనుబంధాల్లో ప్రధానంగా ఉన్నది. ఈ వైరుధ్యంలో ప్రత్యేక–ప్రధాన వైరుధ్యంగా ఆధునికానంతరవాదంగా అప్రధాన వైరుధ్యంగా నూతన ప్రజాస్వామిక తాత్వికతగా–ఘర్షణగా గమనించవచ్చు. వీటి మధ్య వైరుధ్యం సంశ్లేషణగా ప్రత్యక్షానుభవ తాత్వికతగా చలామణీ అవుతుంది (విరోధాభాస దశ). ఈ తాత్వికత నాయకత్వంలో ఉధృతంగా ఉద్యమాలు అభివృద్ధి అవుతున్నాయి. వీరు సామాజిక అభివృద్ధికి నిర్వచనం లేదంటారు. సామాజిక క్రమాన్ని, సంఘర్షణ వాస్తవ అర్థాన్ని గ్రహించలేరు. మతం తాత్విక భూమికలో అందరూ సమానులేననే భావనతో ప్రేరేపితమై వర్గ సమాజాన్ని, వర్గ పరిశీలననూ వదిలేస్తారు. దీనితో సామాజిక వైరుధ్యాన్ని – వాస్తవికతనూ నిరాకరిస్తారు. తద్వారా అనుభవ ప్రాధాన్యతగల భావజాలంగా ఇది అభివృద్ధి అవుతుంది. దీనితో దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడికి అనుకూల, ఉపయోగ ఫలిత ప్రాధాన్య కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలు తయారవుతాయి. విద్యార్థి వర్గం మార్క్సిస్టు తాత్విక నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవానికి దూరమవుతారు. ప్రజలు మిలిటెంట్ స్వభావాన్ని సంతరించుకొని పోరాటంలోకి వస్తే బూర్జువావర్గం దాన్ని ఉపయోగించుకుంటుంది. లేదా ప్రజల డిమాండ్లు నెరవేర్చుకోవడానికి అనివార్యంగా పార్లమెంట్ మార్గం చూపుతుంది. మరికొంత లోతుగా పరిశీలిస్తే ఈనాటి బూర్జువా వర్గం (జాతీయ బూర్జువా వర్గం కాదు) దళారీ రాజకీయ కార్యనిర్వాహక వర్గం స్థాయికి ఎదగడానికి పోరాట రంగంలో పాలు పంచుకుంటుంది. తన పార్లమెంటరీ అధికారంతో పోరాటానికి కీలక పాత్ర పోషించిన వర్గాలని అత్యంత కిరాతకంగా అణచివేస్తుంది. తద్వారా దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిని దూకుడుగా అభివృద్ధిపరుస్తుంది. దీనికోసం రకరకాల చట్టాలను ఉపయోగిస్తుంది, వ్యవస్థీకృత దోపిడీని

అమలుపరచడం ప్రధానంగా ఉంటుంది. దీనితో తన తోటి బూర్జువా వర్గాన్ని సైతం అధికారంలోని రానీయకుండా అణచివేత ప్రయత్నాలకు పూనుకోవడం సర్వసాధారణంగా ఉంటుంది. ఈ దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడి ప్రజాస్వామ్య అభివృద్ధిని ఆటంకపరుస్తూ, పెట్టుబడికి – వేతన శ్రమకు మధ్య వైరుధ్యాన్ని తీవ్రపరుస్తూ, దేశీయ వనరుల విదేశీ తరలింపు, ప్రభుత్వ – ప్రైవేట్ (స్వదేశీ, విదేశీ) రియల్ ఎస్టేట్ ఎదుగుదల, అంతకంతకూ రూపాయి మారకం విదేశీ డాలర్ మారకం స్థితిపై ఆధారపడే పరిస్థితి, స్టాక్ ఎక్స్ఛేంజ్, భూ కేంద్రీకరణ, గ్రామాలలో భూస్వామ్యం – దళారీ వర్గం బూర్జువా యంత్రాంగంతో, రాజకీయశక్తితో – ప్రజలను అణచడం, అదుపు చేయడం, దోపిడీ చేయడం జరుగుతుంది. అగ్రకుల ఆధిపత్యాన్ని, అంటరానితనాన్ని, మత దురహంకారాన్ని, అస్తిత్వ ముకుళిత సంస్థలను ఉద్యమాలను పెంపొందిస్తుంది. విపరీత వడ్డీలు – బ్యాంకు వడ్డీలు గ్రామాలల్లో రైతాంగంపై భారంగా మారుస్తుంది. పారిశ్రామిక, వ్యవసాయక, సేవా రంగాలలో ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణను గెంతుగా అమలుపరుస్తుంది. కాబట్టి భారత విప్లవం దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడికి – అశేష ప్రజలకూ మధ్య, సామ్రాజ్యవాదానికి – అశేష ప్రజలకూ మధ్య వైరుధ్యం, పెట్టుబడికి – వేతన శ్రమకూ మధ్య, ఫ్యూడల్ సంబంధాలకు – అశేష ప్రజలకూ మధ్య ప్రధాన వైరుధ్య పరిష్కారంగా (సామ్రాజ్యవాద – బ్యాంక్ ఫైనాన్స్ పెట్టుబడి – భూస్వామ్య పెట్టుబడి – దళారీ బూర్జువా పెట్టుబడి) నూతన ప్రజాస్వామిక విప్లవం ప్రజా విప్లవ దశగా సోషలిస్టు విప్లవానికి నాందిగా ఉంటుంది.

దండకారణ్య జనతన సర్కార్

సామ్రాజ్యవాద – బ్యాంక్ ఫైనాన్స్ పెట్టుబడి – భూస్వామ్య పెట్టుబడి – దళారీ బూర్జువా పెట్టుబడికి వ్యతిరేకంగా భారతదేశంలో దండకారణ్య జనతన సర్కార్ రూపంలో బీజప్రాయమైన నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమైనది. జనతన సర్కార్లు కమ్యూనిస్టు విముక్తి స్థావరపు ఆచరణా రూపం. ప్రజల ప్రజాస్వామ్యం, నూతన ప్రజాస్వామ్య సంస్కృతి,

ప్రజాసైన్యం వాస్తవికత దండకారణ్య జనతన సర్కార్. విప్లవ విద్యార్థుల పోరాట వారసత్వం, త్యాగాల సాక్ష్యం దండకారణ్య జనతన రాజ్యం.

ముగింపు

1. నేడు విద్యార్థి వర్గం విప్లవోద్యమ గుణాత్మక ఆచరణైన దండకారణ్య నమూనాను అధ్యయనం చేయాలి. ఆ ఉద్యమంలో భాగస్వామ్యాన్ని ప్రోత్సాహించాలి. దాని వ్యాప్తికి విశాల ఐక్యసంఘటనను ఏర్పరచడం ప్రధాన కర్తవ్యం కావాలి.
2. మార్క్సిజం – లెనినిజం – మావోయిజాన్ని అధ్యయనం చేయాలి.
3. మార్క్సిస్టు తాత్విక నేపథ్యంగా ఆచరణ సాగాలి.
4. సామ్రాజ్యవాద – దళారీ నిరంకుశ బూర్జువా – భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి.
5. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంకై పోరాడాలి.

***

ఉదమ్ సింగ్ స్ఫూర్తితో...

యువజనులు సామాజిక నిర్మాణ కర్తవ్యముతో తర్ఫీదు పొందాలి. ఈ శిక్షణ కార్మికవర్గ దృక్పథంతోనే సాధ్యపడుతుందని గ్రహించాలి. కావున వారు బూర్జువా వర్గ–పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క కూల్చివేతా ప్రయత్నంలో–ఆయా శక్తుల సమీకరణ, వర్గదృక్పథ పెంపుదలలో లీనమవుతూ, అటుపిమ్మట విప్లవ విజయంతో ఎదురుకునే బూర్జువా వర్గ దాడులకు వ్యతిరేకంగా పోరాడుతూ, విప్లవ ఫలితాన్ని నిలబెట్టే ప్రయత్నంలో భాగమవ్వడము–అంతేకాకుండా కమ్యూనిస్టు సమాజం వైపు పయణంలో ప్రధాన పాత్రను అందిపుచ్చుకోవడమూ చెయ్యాలి.

కమ్యూనిస్టు జ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధానం కేవల శుద్ధ పఠనంతో–శుద్ధ ఆచరణాత్మకతతో సిద్ధించదని తెలుసుకోవాలి. కావున కమ్యూనిస్టుగా ఉండటమంటే ఆధునిక విజ్ఞాన శాస్త్రాలను ఆకళింపు చేసుకుంటూ ఆచరణాత్మక కార్యకలాప అంతఃసంభందంతో సామాజిక విప్లవోద్యమ పెంపుదలకు కృషి సల్పుతూ స్వంతాస్తి రాహిత్య అత్యున్నత కమ్యూనిజంకై పురోగమించడం.

"అనేక దశాబ్దాలుగా పరిశ్రమ, వాణిజ్యాల చరిత్ర అంతా ఆధునిక ఉత్పత్తి నియమాల మీద–అనగా బూర్జువా వర్గమూ, దాని పెత్తనమూ బతకడానికి తప్పనిసరి అయిన బూర్జువా ఆస్తి సంబంధాల మీద– ఆధునిక ఉత్పాదక శక్తులు చేస్తున్న తిరుగుబాట్ల చరిత్రే...." **– కార్ల్ మార్క్స్–ఏంగెల్స్.**

కామ్రేడ్ ఉదమ్ సింగ్ జీవితచరిత్ర యువతకు ఉత్తేజం–స్ఫూర్తి– ఒక పాఠం. అతడు భగత్ సింగ్ రాజకీయాలతో స్ఫూర్తి పొందడమే కాక గదర్ పార్టీ నాయకత్వంలో పని చేస్తూ భారత దేశానికి కార్యకర్తలతో పాటుగా ఆయుధాలతో వస్తూ పోలీసులకు చిక్కి కారాగారవాసం అనుభవించాడు. తన లక్ష్యం జలియన్ వాలాబాగ్ ఉదంతానికి కారకుడయిన డయ్యర్ అంతం, తన విడుదలతో ఇక భారత దేశంలో పని చేయలేని సందర్భంగా లండన్ చేరి అక్కడే డయ్యర్ ను హతమార్చాడు. తనకు హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ అందించిన భాధ్యతను అనేక ఒడిదుడుకులను ఎదుర్కుంటూ, చాకచక్యంతో నెరవేర్చాడు.

వ్యక్తిగత హింసావాదాన్ని మార్క్సిజం అనుమతించదు.

"కానీ చరిత్ర అనుమతించని చర్య ఒకటుంది, అదే వ్యక్తిగత హింసావాదం. వ్యక్తిగత హింసావాదం ఒక వర్గంలోని వ్యక్తులపైగాని, ఒక విధానానికి చెందిన వ్యక్తులపైగాని ఉద్దేశించబడుతుంది. దానిని వ్యక్తులో, ముఠాలో లేక దళాలో నిర్వహించడం జరుగుతుంది. ఈ చర్యలు జరిపిన వ్యక్తులు విరోచితంగాను, స్వార్ధరహితంగాను వుండవచ్చు. వారి పనికి మెచ్చుకుని కొసకు చర్యలు జరపవలసినదిగా వారిని ప్రజలు ఆహ్వానించవచ్చు. వీరి చర్యలకు గురైన వ్యక్తులు అతిగా ద్వేషింపబడేవారు కూడా కావచ్చు. అయినా మార్క్సిజం అటువంటి చర్యలకు అనుమతించదు. ఎందుచేత దానికి కారణం ఒకటే, ఆ చర్యలలో ప్రజానికం పాలుగొనటంలేదు గనుక. ప్రజలు నిర్వహించవలసిన కర్తవ్యాలను ప్రజలుకాక, వారికోసం ఎవరో కొందరు వీరులు చేసిపెడతారనే నమ్మకాన్ని అది (వ్యక్తిగత హింసావాదం) ప్రోత్సహిస్తుంది కనుక......" **– హిస్టారికల్ డాక్యుమెంట్స్.**

అయితే "ఒకరి యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే అంతర్యుద్ధరూపంలో దీర్ఘకాలం కొనసాగే భారత రైతాంగ విప్లవంలో ఏదో ఒక స్థాయిలో వర్గ శత్రు నిర్మూలన తప్పకుండా ఒక పోరాటరూపం ధరిస్తుంది. వర్గ పోరాటం ప్రత్యక్షంగా పరిణతి చెందడానికి ముందు అది

ఒక ముఖ్యమైన పోరాటరూపంగాకూడా ఏర్పడవచ్చు. అంతేగాని అది పోరాటరూపంగా భావించడమే తప్పుగా నిందించడం, ఒక తప్పును సరిదిద్దుకోబోయి అంతకంటే ఘోరమైన మరో తప్పుకు ఒడిగట్టడమే అవుతుంది........" **– ఆత్మవిమర్శనా రిపోర్టు.**

ఉదమ్ సింగ్ సాహసచర్య యావత్తు భారతీయ ప్రజానికానికి ఉత్తేజాన్ని రేకెత్తించింది. ఆయనకు బ్రిటీషు ప్రభుత్వం 31 జులై 1940 లో ఉరిశిక్షను విధించింది. ఆయన మరణం నేటి యువకులలో సైతం దేశం కోసం పోరాడటానికి ఉత్తేజితపరుస్తుంది.

కానీ కేవలం వర్గ శత్రువు నిర్మూలనే ఏకైక విధానంగా భావిస్తూ, శత్రు సంహారమే రాజకీయ సమీకరణను కూడా సాగిస్తుందనే వాదంతో పోరాటపు పతనం తప్పదు. "అంతేకాదు, అలాంటి చర్యలనే (వ్యక్తిగత హింసావాదం) మరికొంత ఎక్కువగా చేస్తే, వ్యతిరేకవర్గాన్నో లేక వ్యవస్థనో నాశనం చేయగలదనే నమ్మకాన్ని సహితం ప్రజలలో అది ప్రోత్సహిస్తుంది. చిట్టచివరకు అది జనసామాన్యానికి, దాని స్వశక్తిపై ఉపేక్షాభావాన్ని నిస్తబ్ధతను కలగజేసి వారు కార్యాచరణలో పాల్గొనడాన్ని అరికట్టి, విప్లవానికి పురోగమించకుండా అడ్డుపడి, చివరకు ఓటమికి కారణమవుతుంది. అందుకని వ్యక్తిగత హింసావాదాన్ని గురించి మార్క్సిజం హెచ్చరిస్తూ, దాన్ని నిషేదిస్తోంది......" **– హిస్టారికల్ డాక్యుమెంట్స్.**

విప్లవం లేదా ఉద్యమాలు వెనకపట్టు పట్టిన వెంటనే వ్యక్తివాద చర్యల దుందుడుకుతత్వంగా అరాచకవాద తాత్విక ప్రభావం పైచేయి సాధించడం జరుగుతుంది. ఫలితంగా ఉద్యమం పక్కదోవపడుతూ క్రమంగా నశిస్తుంది. భగత్ సింగ్ వారి అనుయాయులు తమ ఈ పొరపాటును గ్రహించి అటుపిమ్మట భారతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వామ్యమై కార్మిక–కర్షక ఐక్యతలో శ్రామిక పోరాటాలలో పాలుపంచుకున్నారు. వారి త్యాగాలు వృధా కాని పయనంలో సాగిపోతూ.....

***

వివేక్ మరణం - మిగిలిన ప్రశ్న?

ఈ రోజు వివేక్ ఆచరణ నుండి మరణం వరకూ సమీక్షకు గురికావాలి. ఇది సామాజిక భాద్యత ఎందుకంటే ఏ కమ్యూనిస్ట్ పార్టీ అయినా ఆయా దేశంలో విప్లవ సామాజిక ఆర్థిక వ్యవస్థను నిర్మించనంత వరకూ ఆనాటి సామాజిక వ్యవస్థలో అంతర్లీన భాగస్వామ్యం కలిగినదిగా గమనించాలి. ఈ పరిశీలన లేనన్ని రోజులూ మనకు ఎదురయ్యే ఎన్నో ప్రశ్నలకు జవాబులు దొరకవు. వాస్తవానికి తెలుగు ప్రాంతాలల్లో మార్క్సిస్టు పరిశీలనా విధానం తగ్గుముఖం పట్టింది. చాలా మంది తాము చేస్తున్న మార్క్సిస్టు పరిశీలనలో ఎన్నో రకాల పెటీ బూర్జువా పద్ధతులను మోసుకెళు తూ మార్క్స్ యొక్క సిద్ధాంతానికి పరిధిని గీస్తున్నారు. దీనిని ఎదుర్కోవడం మన ముందున్న ప్రధాన సమస్య. ఎందుకంటే ఈ రోజుల్లో వివేక్ మరణాన్ని own చేసుకునే ప్రజానీకం తగ్గారు, ఇది స్వీయ విమర్శ.

వివేక్ ఆచరణ నిజానికి హేళనకు గురికాబడుతుంది. అందుకే తన మరణం మరుగున పడిపోతుంది. తన ఆచరణ నేడు ఒక విమర్శ. తన విమర్శ (ఆచరణ) ప్రతివాదనతో దాడికి గురిచేయబడుతుంది. వివేక్ విమర్శ (ఆచరణ) స్వీయ విమర్శకు గురికావడం జరగాలి. అప్పుడే ప్రతివాదనను అదుపుచేయగలదు. ఇది నిరంతర చలనశీలత. ఇప్పుడు ఈ ఆవశ్యకత అభివృద్ధికి దోహదం చేయడానికి ఒక మెట్టు. ఇది ప్రతీ వ్యక్తీ, బృందంపై ఉన్న బాధ్యత. మన మాటలను, చేతలను ఏకం చేసే సందర్భం.

ఇటువంటి చర్చకు వివేక్ తన మరణంతో మన ముందుకు వచ్చాడా? తన ఆచరణతో మన ముందుకు వచ్చాడా? అని పరిశీలిస్తే ఈ నాడు తన ఆచరణ - మరణాలు రెండూ ఈ చర్చకు (స్వీయ విమర్శ) కారణాలు. అప్పుడే ఎన్నో అంశాలు సరిదిద్దబడతాయి. లేదంటే తన మరణం కారణంగా యాదృచ్ఛికంగా ముందుకు వచ్చిన చర్చగా కనుమరుగు అయిపోతుంది. గతకాలపు చరిత్ర మొత్తం ఈ తప్పిదంతోనే కప్పబడింది. ఈ సమస్యను సరిదిద్దాలి, తప్పకుండా మనల్ని మనం ప్రక్షాళనం చేసుకోవాలి.

వివేక్ తన మరణం వరకూ విప్లవం కోసం ఆరాటపడటమేకాదు, విప్లవోద్యమం ఎదుర్కుంటున్న ఎన్నో స్వీయ సమస్యలను ప్రశ్నించాడు. వాటి పరిష్కారం తాను ఆచరించి చూపాలని ప్రయత్నించాడు. తన ఆచరణ యొక్క గెలుపోటములు బేరీజు వేస్తూ అనవసరపు అర్థవంతం కాని చర్చలకు, conclusionsకు వెళుతున్నారు. నిజానికి వివేక్ సిద్ధాంతం తన ఆచరణ-మరణాలతో ఆకళింపుచేసుకునే ప్రక్రియ నుండి స్వీయవిమర్శ చేసుకుంటూ అభివృద్ధి చెందేదిగా ఉంటుందని గమనించాలి. లేదంటే తననే కాదు తన సిద్ధాంతాన్నే ప్రక్కకు పెట్టేరోజులు రావచ్చు.

వివేక్ ఆచరణను చాలా మంది రెండు పంథాల మధ్య పోరాటంలో ఒకమార్గంగా భావిస్తున్నారు. నిజానికి రెండు పంథాల మధ్య పోరటంగా అర్థం చేసుకునే పద్ధతి అనివార్యంగా వైరుధ్యంలోని వైషమ్య స్థాయి కలిగిన స్థితిగా అర్థం చేసుకోవాలి. వైషమ్య ఘర్షణ మాత్రమే సంశ్లేషణ రూపం తీసుకోదు. తాత్కాలిక, విశ్రమ వైరుధ్యం తన స్థితిలో వైరిపక్షంగా వ్యవహరిస్తుంది. ఈ వైరిపక్షం వైరుధ్యం యొక్క సాధారణతతో సంఘర్షణ ఫలితంగా తాత్కాలిక, తక్షణ సంశ్లేషణ ఏర్పడటానికి దోహదం చేయవచ్చు. ఈ మార్పు, చలనం స్వీయ విధ్వంసభరితముగా కూడా అభివృద్ధి చెందడము - లోనుకావడము జరుగుతుంది. ఇటువంటి స్థితిలో భాగంగా ఈ సమస్య ముందుకు వస్తుంది. వాస్తవానికి ఈ సమస్యను పరిష్కరించకుండా ఉన్నన్ని రోజులూ ఉద్యమము దానికదిగా సంక్షోభానికి గురై పతనము

దిశగా పయనిస్తుంది, లేదా రెండు పంథాల మధ్య పోరుగా అభివృద్ధి చెందడం, లేకపోతే వ్యక్తిగత ఆవేశపు నిర్ణయాలు తీసుకునే సంఖ్య పెరిగిమనతో కలిసి వచ్చేవారి సంఖ్య తగ్గుముఖం పట్టడం జరుగుతుంది.

విప్లవ ఫలితాలు క్యాడర్లలో ప్రతిఫలించనంత వరకూ లంపనైజేషన్, లొంగుబాట్లు, అరాచకత్వం, వ్యక్తిగత ప్రతిష్టకై పాకులాడటం సాధారణీకరణగా సంతరించుకుంటాయి. విప్లవ ఫలితాలను అనుభవించడం అనగా శిక్షణ పొందడం, సాధనకు గురికావడం, అవగాహనకు రావడం జరగనన్ని రోజులూ అస్పష్ట భావ వైరుధ్యానికి గురౌతారు. తమ సామాజిక నేపథ్యం వారిని అదుపుచేస్తుంది. కమ్యూనిస్టు విలువలను పాటించకుండా ఆయా సంఘాలను, పార్టీనే టెరరిస్ట్, బ్లాంకిస్టు వాదులుగా చిత్రింపచేస్తారు, చిత్రింపబడుతుంది.

మార్పు మార్పు ద్వారా సంభవిస్తుంది, మార్పు లేకుండా మనం ఎలామారతాము,మార్పు యొక్క అర్థం ఆచరణ, మరి ఆచరణ లేకుండా ఎలామార్పు జరుగుతుంది. మన ఆచరణ మార్చుకోవాలి, అచరణ మనల్నిమారుస్తుంది. అప్పుడు మనం మార్చిన ప్రతి ఆచరణను ఆలోచించాలి, ఈ ఆలోచనను తిరిగి ఆచరించాలి, ఆ మార్పు మన ఆచరణ ను మారుస్తుంది. ఇది మానవుని యొక్క చారిత్రక భౌతికవాద గతితర్క సత్యం. ఈ నిజాన్నిఆకలింపు చేసుకుని ఆచరించే సంఖ్య విప్లవోద్యమంలో తగ్గిపోతున్నారు. ఈ సత్యాన్ని, నిజాన్ని వివేక్ తన ఆచరణతో రుజువుచేయపూనుకున్నాడు.

నిజానికి భారత దేశ నిర్దిష్ట పరిస్థితులకు పోరాట రూపాలు కేవలం సూత్రరహిత విధానంతో, అసంఘటిత నిర్మాణంతో సాగుతూ ఉండటం మూలంగా విప్లవ సామాజిక నిర్మాణానికి ఆటంకంగా ఉన్నదని గుర్తించాలి.

"మొట్టమొదట ఉద్యమాన్ని ఏ ఒక్క రూపానికీ ముడి పెట్టకుండా ఉండడంలోనే మార్క్సిజం యొక్క ఆదిమ రూపాలన్నింటితోనూ విభేదిస్తుంది. పోరాటం యొక్క అత్యంత విభిన్నములైన అనేక రూపాలను అది అంగీకరించుతుంది. కాగా వాటిని అది కల్పించదు. కాని కేవలంగా ఉద్యమగమనంలో వాటంతటవే తలెత్తేటట్టి విప్లవాత్మక వర్గాల పోరాట రూపాలను అది సాధారణీకరించి, ఆర్గనైజు చేసి, వాటికి చైతన్యం కలిగిస్తుంది." **– వి.ఐ లెనిన్.**

మార్క్సిజం యొక్క విశిష్టత ఇంతమాత్రమే కాదు. ఇంకా లెనిన్ ఏమన్నారంటే "............ ఆ ప్రత్యేక కాలావధిలో పాల్గొంటున్న వారికి తెలియనట్టి నూతన పోరాట రూపాలు నిర్దిష్టమైన ఆ ప్రత్యేక సామాజిక పరిస్థితులు మారుతున్నపడు తప్పనిసరిగా ప్రభవించుతాయని అది గుర్తించుతూండడం కారణంగా, ఎట్టి పోరాట రూపాన్ని సహితము ఏట్టి సందర్భాల్లోనైనా సరే అది తిరస్కరించదు."

"............ ఆర్థిక పరిణామపు వివిధ దశలలోని రాజకీయ, జాతీయ–సాంస్కృతిక, జీవిత తదితర పరిస్థితులలో వుండే బేధాలనను సరించి, విభిన్నపోరాట రూపాలు ఉత్తరరంగంలోకి వచ్చి, పోరాటం యొక్క ప్రధాన రూపాలుగా ఏర్పడతాయి. కాగా ఈ సందర్భంలో పోరాటం యొక్క రూపాంతరాలూ, అప్రధాన అనుషంగిక రూపాలు కూడా, వాటివంతుకి అవి మారిపోతాయి..."

లెనిన్ పోరాట రూపాలపై మార్క్సిజం యొక్క శాస్త్రీయ అంచనాను చక్కగా వివరించారు. ఈ దృక్పథం భారత విప్లవోద్యమానికి అక్షరాలా ఉపయోగ సారం కలిగినదిగా గుర్తించాలి, ఆచరించాలి. వివేక్ సిద్ధాంతం, ఆచరణగత కొన్ని దశాబ్దాలుగా ఈ లెనినిస్టు సత్యాన్ని ఆచరించడానికి ప్రజలను సంసిద్ధం చేయడానికి తీవ్ర ప్రయత్నం గావిస్తూనే ఉంది. ఒక ఉద్యమప్రవాహంగా, విప్లవాత్మకంగా సాగించడానికి పూనుకుంటూనే ఉంది (ఎంతవరకు సాధించిందీ వేరొక చర్చ). అందుకే వివేక్ ఈ ఆచరణలో సాధనకు గురికాబడ్డాడు. తన తోటి వారిని చైతన్యవంతం గావించడానికి ప్రయత్నించాడు. వివేక్‌ను తన పార్టీ ఆచరణ నుండి విడిగా చూడలేము. వివేక్ మరణించాడు, తన పార్టీ అమరుడిగా, సజీవంగా వివేక్ లాంటి వారిని తయారుచేసుకుంటుంది.

భారత విప్లవోద్యమం అన్ని రకాల పోరాటాలను, నూతన పోరాట రూపాలను సంశ్లేషణ గావిస్తూ గెంతుగా విప్లవ సామాజిక, రాజకీయార్థిక నిర్మాణాన్ని, చైతన్యాన్ని ఏర్పర్చాలి. ఈ పంథానే నూతన సాంస్కృతిక అభివృద్ధికి దోహదం చేయగలదు, కార్మికవర్గ పోరాటవారసత్వాన్ని, అంతర్జాతీయ శ్రామిక పోరాట ఎత్తుగడలను మనలో విలీనం చేసుకోగలము. భారత విప్లవోద్యమము కేవలము పాలకవర్గానికి వ్యతిరేకంగా మాత్రమే జరిగే పోరాటం కాదని గమనించాలి రెండు భిన్న సంస్కృతులకు, ఆచార వ్యవహారాలకు, ప్రజలకు, ప్రజలకు మధ్య జరిగే సుదీర్ఘకాలిక యుద్ధమని గుర్తించాలి. అందుకే ప్రజలను ఏ మేరకు మర్క్సిస్టుతాత్విక ప్రభావంలోకి తీసుకురావడం జరుగుతుందో అంత నష్టాన్ని అదుపు చేయగలము, విజయాన్ని పొందగలము.

మార్క్సిజాన్ని విస్తృతపరిచే కృషి మరింత స్పష్టంగా, దూరదృష్టితో చేయాల్సిన పని మన అందరిపై ఉన్నది. వివేక్ తన తపన, ఆశయం, ఆలోచన, ఆచరణ, సిద్ధాంతం, మార్గం అంతా విప్లవోద్యమం, మార్పు, నూతన ఆవిష్కరణకోసమని గుర్తించాలి. రసాయన, భౌతిక శాస్త్రాల ప్రయోగాలకై ప్రయోగ శాలలు ఎలా ఉంటాయో, మార్క్సిజానికి ప్రజలు, సమాజం ప్రయోగశాల, ప్రయోగ వస్తువులు అందుకే వివేక్ మనవాడు, మనలోని శాస్త్రవేత్త (మార్క్సిస్టులు శాస్త్రవేత్తలు).

వివేక్‌తో నాకు వ్యక్తిగతంగా పరిచయం లేదు, తన గురించి మిత్రులనుండి వినడమే. వివేక్ నాన్న గారిని చూసినప్పుడల్లా, ఆయన మా అందరివైపు చూస్తున్నప్పుడు మాలో వివేక్‌ను వెతుకుతున్నట్లే ఉంటుంది. నిజానికి వివేక్ ఆచరణను మనందరం అందిపుచ్చుకున్నపుడే వివేక్ తల్లిదండ్రులకు వివేక్‌ను దగ్గర చేర్చినట్లు. వివేక్ ఆశయాలు సుదీర్ఘమైనవి కావచ్చు కానీ మార్పు మాత్రమే శాశ్వతం.

***

కార్మికవర్గ ప్రజాస్వామ్యం

ఇటీవల ప్రజాస్వామ్యం అనే అంశం గురించి ప్రతిఒక్కరూ చర్చిస్తున్నారు. ప్రజాస్వామ్యం అందరూ సమంగా అనుభవించే విధానమని దానిని సాధించడం అందరి త్యాగ ఫలితమని, దానిని కాలరాయడం ఫాసిస్టు విధానమని గగ్గోలు పెడుతున్నారు– నిజమే ప్రజాస్వామ్యం అనేదానికి చోటు లేకుండా సమాజం ముందుకుపోదు. కానీ అందరూ చర్చిస్తున్న ప్రజాస్వామ్య సమస్య శుద్ధ ప్రజాస్వామ్యం గురించని మన పరిశీలనలో తేలుతుంది. చరిత్రలో శుద్ధ ప్రజాస్వామ్యం అనేది ఎక్కడా కనబడదు. ప్రజాస్వామ్యానికి వర్గ స్వభావం ఉంటుంది. శుద్ధ ప్రజాస్వామ్య వాదాన్ని ప్రచారం చేసేవారు వర్గ స్వభావం కాని అంశమేమిటో కనిపెట్టండి చూద్దాం! వీరు కనిపెట్టలేరు– అంతేకాదు వీరు దాని గురించి ఆలోచించరు– పైగా వర్గ దృక్పథం మానవీయం కాదని కూడా ప్రచారం చేస్తారు. ఇది ఆధునికానంతరవాద తాత్విక జాడ్యం కాక మరేమిటి?

ప్రజాస్వామ్యం అనేది ఎక్కడా శుద్ధ అంశంగా చలామణి అవ్వలేదు– ప్రజాస్వామ్యం అనేది– రాజరిక నియంతృత్వంలో రాజరిక ప్రజాస్వామ్యంగా చలామణి అవుతుంది– ఫ్యూడల్ నియంతృత్వంలో ఫ్యూడల్ ప్రజాస్వామ్యంగా చలామణి అవుతుంది– బూర్జువా నియంతృత్వంలో బూర్జువా ప్రజాస్వామ్యంగా చలామణి అవుతుంది. అంతేకాదు కార్మికవర్గ ప్రజాస్వామ్యం అనేది కార్మికవర్గ నియంతృత్వంలో చలామణి అవుతుంది. అంతే కానీ శుద్ధ ప్రజాస్వామ్యాన్ని ప్రచారం చేయడం– అలాంటిది

ఉందనుకోవడం కేవలం బూర్జువావర్గ ప్రయోజనాలకు కొమ్ముకాయడమే. కార్మిక నియంతృత్వం అనగానే ప్రజాస్వామ్యానికి చోటు ఉండదని – అది కేవలం నియంతల పాలననే ప్రచారం ఇటీవల కాలంలో బాగా ప్రచారం అవుతుంది. కమ్యూనిస్టులనగానే కేవలం నియంతలని వాగని వారు ఎవరో చెప్పండి? కానీ ప్రజా స్వామ్యంపై వర్గ దృక్పథం లేని వారి తప్పుడు రాతలు–వాగుడులు ఇంతకన్నా ఏముంటాయి.

మరి భారత దేశంలో సాధించాల్సినది నూతన ప్రజాస్వామ్యం కదా? అనే ప్రశ్న మనముందుకు వస్తుంది. నిజమే ఈ ప్రశ్న రావడం సహజము–శ్రేష్టమూను. నూతన ప్రజాస్వామ్యం కార్మిక వర్గ నియంతృత్వంలో చలామణీ అయ్యే కార్మిక వర్గ ప్రజాస్వామ్యపు ఒకానొక దశగా అర్థం చేసుకోవాలి. కావున మనముందున్న ఏకైక నినాదం నూతన ప్రజాస్వామ్యం అనగా కార్మిక ప్రజాస్వామ్యం అంతేకానీ ప్రజాస్వామ్యం అనే శూద్ధాంశం కాదు–ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యంకొరకు అంతకన్నా కాదు.

అంతేనా ఇటీవల కార్మిక ఉద్యమాలను – ప్రజా ఉద్యమాలను అర్థంచేసుకోవడంలో మనం లోటుపాట్లుకు గురి కావడం జరుగుతున్నది కదా! దీనికి కారణం దీర్ఘకాలిక ప్రజా యుద్ధాన్ని సరిగ్గా అవగాహన చేసుకొనకపోవడమని గమనించాలి. దీర్ఘకాలిక ప్రజా యుద్ధం దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాన్ని అభివృద్ధిపరుస్తుందనే అవగాహన నేడు మనకు అవసరం. దీర్ఘకాలిక ప్రజా యుద్ధంలోని వ్యూహాత్మక తిరోగమనం వ్యూహాత్మక ప్రజా ఉద్యమాలను ఆధారం చేసుకుంటూ అభివృద్ధి చెందుతుంది అంతేకాకుండా వ్యూహాత్మక సమతుల్యానికి అభివృద్ధిచెందే క్రమంలోని ప్రజా యుద్ధానికి ప్రజా ఉద్యమము విస్తృతి–విశాలంతో పాటుగా గుణాత్మక గెంతుగా లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ప్రజా యుద్ధపు సమతుల్యపు స్థితికి చేరవేసే తనవంతు పాత్రను నిర్వహిస్తుంది, ఇది పరస్పరతా సూత్రం కలిగినది. ఇక వ్యూహాత్మక ఎదురుదాడికి సంబంధించిన ప్రజాయుద్ధ పంథా ప్రజా ఉద్యమ స్థితి సమన్వయంగా అంతఃసంబంధంగా పెనవేసుకుపోయి సాగుతాయి ఇక ఈ రెండింటినీ విడదీయలేము, పక్షం–

వైరిపక్షంగా ఈ రెండిటి మధ్య ఐక్యత – ఘర్షణ సంశ్లేషణగా మార్పు చెందుతుందనే సూత్రంగా వ్యూహాత్మక ఎదురుదాడి (ప్రజాయుద్ధం – ప్రజా ఉద్యమం) సంశ్లేషణ. కావున ఈ అవగాహనతో మనం ముందుకు సాగాల్సిన అవసరం ఉన్నది. ఉద్యమించాల్సిన అవసరం ఉన్నది.

ఈ అవగాహనను పక్కకు పెట్టి రివిజనిస్టు క్యాంపు చాలా తీవ్రంగా ఎక్కడికక్కడ బలపడుతూ భారత దేశ విప్లవ కార్యాచరణను తిరోగమింపచేస్తున్నారు. కార్మిక సంఘాల నాయకత్వం కార్మికవర్గ ప్రభు వర్గంగా తయారయ్యారు – వీరే కాంట్రాక్టర్లుగా తయారై కార్మికులను దోచుకుంటున్నారు కూడా! ఇటువంటి స్థితినే సిద్ధాంతీకరించి మార్క్సిజంగా చలామణీ చేయిస్తున్నారు. ఇదంతా బూర్జువా నియంతృత్వం దాని ప్రజాస్వామ్యపు నీడలో అని గమనించాలి.

కావున దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాన్ని అభివృద్ధిపర్చడం నేటి తక్షణ అవసరం – అది కార్మిక వర్గ దృక్పథపు అడుగుజాడ, మార్గదర్శకత్వం.

***

మార్క్సిజాన్ని అధ్యయనం చేద్దాం!

మార్క్సిజం తత్వశాస్త్రం – రాజకీయార్థిక శాస్త్రం – శాస్త్రీయ సోషలిజంల అంతర్గత అంతఃసంబంధ అంతఃసారంతో సమన్వయీకరించబడిన సిద్ధాంతం. దాని పరిపూర్ణత్వాన్ని గందరగోళంగా అర్థం చేసుకోవడం, అన్వయించడం మన తెలుగు రాష్ట్రాలల్లోని మేథావులలో ప్రబలంగా ఉన్నది. దాని అంశీభూతాంశాలను విడివిడి శకలాలుగా విభజించి ప్రతీదీ దానికదిగా సంబంధము లేని అంశాలుగా ప్రచారం చేస్తున్నారు. అంతేకాకుండా మార్క్సిజాన్ని యువ మార్క్స్– పరిపక్వ మార్క్స్‌గా విభజించి దాని యొక్క తాత్విక అభివృద్ధి – కృషిని నీరు కారుస్తూ మార్క్సిజపు సంపూర్ణత్వాన్ని పేలవం చేస్తున్నారు.

భౌతికవాద గతితార్కిక సూత్రాల భావనలను అవగాహన చేసుకోకుండా ఉన్నన్ని రోజులూ మార్క్సిజానికి వక్ర భాష్యాలను తగిలిస్తూ అందుకనుగుణంగా ఆచరిస్తూ దానిని ప్రత్యేకత నుండి విశ్వజనీనతకు తీసుకొనిపోయే ప్రక్రియకు గండికొట్టడం నేటి దౌర్భాగ్యం, ఫలితంగా అధ్యయనం, ఆచరణల మానవ కార్యకలాపాన్ని వస్తుపరమైన కార్యకలాపంగా భావించకుండా, వాటిని విడివిడి అంశాలుగా పరిగణిస్తూ మార్క్సిజపు ప్రాథమిక ప్రాపంచిక దృక్పథాన్ని కాలదన్నేటువంటి వాదాన్ని పెంపొందిస్తున్నారు. దీనిద్వారా శ్రమ–పంపిణీ–మారకపు సంబంధాలలో వచ్చే విప్లవాత్మక మార్పులను గ్రహిస్తూ సామాజిక వైరుధ్యాన్ని పరిష్కరించే దిశగా దీర్ఘకాలిక ప్రణాళికతో కూడుకున్న పోరాట వ్యూహం ఎత్తుగడలు

నిర్మించుకోవడానికై మార్క్సిజపు జ్ఞాన పద్ధతిపర సిద్ధాంత అధ్యయనం నేడు ఆవశ్యకం.

మార్క్సిజాన్ని అధ్యయనం చేయడం నేటి అవసరం. మార్క్సిస్టు వ్యాఖ్యానాలతో సరిపెట్టుకొనే బాపతు మేథావుల అవసరం శుద్ధ దండగమారత్వం, వ్యాఖ్యాన వ్యాఖ్యాతలు, ఆత్మహత్య సదృశ్యమైన ఉగ్రప్రేరేపిత భావోద్రేక ఆచరణకర్తలు కాకుండా మార్క్సిస్టు భావనల ఆచరణవాదులు నేడు అవసరం, అందుకోసం తిరిగి మార్క్స్–ఏంగెల్స్‌ల ప్రామాణిక రచనలను పటించడం దానిని మార్క్సిజంగా జీర్ణించుకోవడం తక్షణ ధర్మం.

***

మతం మత్తుమందే !

మతం (దేవుడు, దయ్యాలు, భూతాలు లేదా ఆత్మలు) అనే భావన తరతరాలుగా మానవుణ్ని అంటిపెట్టుకుని తన ఆలోచనా క్రమాన్ని గందరగోళానికి గురిచేస్తూ వస్తుంది. కేవలం దేవుడు లేడు అనే ప్రచారం దానికి అనుగుణంగా కార్యక్రమాలు మనం విరివిగా చూస్తూవున్నాం. అలాగే దయ్యాలు అనేవి లేనేలేవని, కేవలం కల్పితమని నాస్తికోద్యమాలు ప్రచారం చేస్తూ వచ్చాయి. అయినా మానవుని సామాజిక అభివృద్ధిలో మతం అనే భావన చెరిగిపోకుండా దూసుకువస్తూనే ఉంది. ఈ గందరగోళం కేవలం ప్రకృతిని అర్థం చేసుకోలేని స్థాయి వ్యక్తులకే కాకుండా శాస్త్రీయతను అతిగా ప్రచారం చేసేవారికి సైతం ఉన్నదనడంలో వింతేమిలేదు. వీరితో పాటుగా మార్క్సిస్టు జ్ఞానం కలిగినవారు సైతం ఈ విచిత్ర వ్యవహారంలో ఇరుక్కుని ఉన్నారు కూడా. దేవుడు లేడని ప్రచారం చేసేవారు దాని మూలకారణాన్ని సరిగ్గా విశ్లేషించడంలో వెనకబడే ఉన్నారు, అందుకుగల కారణం మానవచరిత్రను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడంలో విఫలమవ్వడమే.

గతితార్కిక భౌతికవాద దృక్పథంతో విశ్లేషించడంతోనే ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది. ఈరోజు వరకూ మతం అనే సమస్యకు సంశయవాదుల (skepticism) వాదనే పరిష్కార రూపంగా భావిస్తూ వచ్చాము, సంశయవాదులు ప్రకృతి, పదార్థం మానవుణ్ని విడిగా చూస్తూ మనిషిని జీవజాతి సంబంధంగా, మతాన్ని దానికదిగా స్వయం

ఉత్పాదితంగా భావించడం జరుగుతుంది, కావున ఈ వాదంతో మానవుడు ఎదుర్కునే ఈ మతమనే భావదారిద్ర్యం పరిష్కారం అవ్వకపోగా మితి మీరిపోతుంది.

దేవుడూ, దయ్యము అనే భావనలు మానవుడి చరిత్రలో కొత్తగా వచ్చిన సమస్యలు కావు. ఇవి నిరంతరం చారిత్రక అభివృద్ధిలో భాగంగా కొత్త రూపాలు సంతరించుకుని అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. దేవుడు, దయ్యాలనే ఈ రెండు అంశాలు ఆనాటి మానవుణి చారిత్రక ప్రారంభ దినాలల్లో ఉన్నట్లుగా ఈ నాటి అభివృద్ధిలో పోల్చుకోలేమనే చెప్పాలి. దీనికి ఎంతో వ్యత్యాసం కనపడుతుంది. ఈ వ్యత్యాసం ఇంకా అభివృద్ధిని నోచుకోని గిరిజన తెగల మధ్య ఉన్న భావాలు, వివిధ దైవ ఆరాధన సాంప్రదాయాల మధ్య అలాగే అతివేగంగా ప్రయానించే రైలు మార్గాల సాంకేతికతను సాధించిన ప్రజా సమూహాల మధ్యదిగా ఉన్నదని పరిశీలనలో గమనించవచ్చు. ఈ రూపాలు మానవుని సామాజిక దశలకు ప్రతిబింబముగా ఉన్నవి. ఇది మరింత స్పష్టంగా భారతదేశంలో కనబడుతుంది. ఎందుకంటే భారతదేశం ఇంకా ఆదిమసామాజికులతో పాటుగా అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు చిహ్నం, ప్రతిరూపంగా ఉన్నది (బ్యూరాక్రాటిక్ పెట్టుబడి). అందుకే ఆదిమ రూపాల నుండి పెట్టుబడి యొక్క వికృత రూపాల వరకూ చలామణి అవుతున్నాయి. చారిత్రక భౌతికవాద గతితర్కము మానవుణి ఆచరణాత్మక కార్యకలాపంగా ప్రకృతి, పదార్థమూ మానవీకరణ చెందుతుందని, మనిషి మానవీయ ప్రకృతి, సామాజిక మానవజాతిగా, ఆలోచనకు మానవుని ఆచరణాత్మక కార్యకలాపము వస్తుపరమైనదని, మతం, దేవుడు, దయ్యాన్ని మానవ సామాజిక ఉత్పాదితంగా భావిస్తుంది. అందుకే ఆత్మ లేక భూతం మరియు దేవుడు అనే భావనలు మానవుని సామాజిక పరిణామంలో జీవనం–మరణ బీభత్సం అనే వైరుధ్యం నుండి ఉత్పన్నమయింది. జీవనం–మరణం అనే ఏకత్వం మధ్యవర్తిత్వ ఐక్యతగా రెండూ పరాయికరణ చెంది స్వీయ అభివృద్ధి చెందుతూ ఒకదానినొకటి తొలగించుకుంటూ తమకు తాము ప్రత్యేకత

సంతరించుకుంటూ సాగుతాయి. ఇవి ఉత్పత్తి సంబంధాల, ఉత్పత్తి శక్తుల యొక్క ఘర్షణ ఫలితంగా ముందుకొస్తూ ఉపరినిర్మాణ వైరుధ్యంలో భాగస్వామ్యమవుతుంది.

మొదట క్రూరమృగాలు, తాను జయించలేని జంతువులు అలాగే ప్రకృతి ప్రమాదాలలో వీటివల్ల మరణించే తోటి మనుషులను జ్ఞాపకంగా ప్రతిఫలించి భయపడటం ముందుకు వచ్చింది. ఈ పరిస్థితి మానవుని యొక్క చారిత్రక సామాజిక ఆచరణలో అభివృద్ధి చెందిన జ్ఞాపకశక్తి ఫలితమూ కారణమవుతుంది. అటుపిమ్మటా మనిషి బలమైన ఉత్పత్తిశక్తుల అభివృద్ధితో భయంకరమైన జీవాలను అదుపుచేయడం, ప్రకృతిని అవగాహన చేసుకోవడం మూలంగా వీటిని ఆరాధించడం తగ్గుముఖం పట్టింది. తగ్గుముఖం పట్టడమనగా తక్షణవేగవంత మార్పు కాదని గుర్తించాలి. ఈ అభివృద్ధి అత్యంత అల్పమైనదని గ్రహించాలి. ఎందుకంటే మనిషి వేరొక మనిషిని అదుపుచేసే ప్రక్రియలో బలమైన మనిషిని ఆరాధించడం అంతేకాకుండ భయపడటమూ జరిగింది. కావున మనిషి వర్గసమాజంలో అంతర్భాగమైన దేవుడు, దయ్యాన్ని గుర్తించడం నేడు ఆవశ్యకత కలిగిన స్థితిగా అర్థంచేసుకోవాలి ఎందుకంటే మానవ ఆచరణ యొక్క ఫలితమనే సైద్ధాంతిక పునాది ఈనాడు అభివృద్ధి చెందినంతగా గతకాలంలో జరగలేదనే చెప్పుకోవాలి. అందుకనే దేవుడి ఉనికిని ప్రశ్నించేటప్పుడు దయ్యం ఉనికినీ ప్రశ్నించాలి. మతం అనే నాణేనికి దేవుడూ,దయ్యమూ రెండు వైపులని గుర్తించాలి. ఎందుకంటే ఈ రెండు పరస్పరాధారిత అంతఃసంబంధ సమస్య. ఈ సమస్య పరిష్కారం కేవలం మానవుని సామాజిక ఉత్పత్తిశక్తులు, సంబంధాల మెరుగుతో ముడిపడి ఉన్నదని మరిచిపోకూడదు. వర్గరహిత సమాజంలోనే ఈ సమస్య అంతమవుతుంది. వర్గపోరాటాంతో సంబంధంలేని ఏ శాస్త్రీయ ప్రయత్నమైనా చివరకు ఊహాత్మవాదంలోకి నెట్టబడతాయి. వర్గ పోరాటం యొక్క విజయ ఫలితాలతోనే తిరిగి శాస్త్రీయత నెలకొల్పబడుతుంది. సైన్స్ వేరు మార్క్సిజం వేరని ఎంతో కాలంగా భావిస్తున్నారు. మార్క్సిజాన్ని పూర్వ

పక్షం చేయడానికి తీవ్రప్రయత్నం గావిస్తునారు. మానవ సామాజిక పరిణామ క్రమంలో ముందు కొచ్చిన అన్నింటిలోను (ప్రకృతి అవగాహన కుడా సామాజిక ఆచరణే) మార్క్స్ ప్రభావం లేకుండా లేదని గమనించాలి. ఈ రోజు మార్క్సిజమే శాస్త్రమని గుర్తించాలి. ఐన్‌స్టీన్ రుజువులతో సహా భౌతికవాద గతితార్కికంలో అంతర్లీనమై ఉన్నాయని గమనిస్తే మార్క్స్ భావనల వాస్తవికత, విశ్వజనీనత అవగాహన అవుతుంది. మార్క్సిజం పరిష్కరించనిదిలేదు.

కావున మతం(దేవుడు దయ్యమనే) భావాలకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం, పనివిధానం చేసుకుంటూ పోతే సరిపోతుందని భావించకుండా సామాజిక మార్పుతోనే అనగా విప్లవాత్మక సామాజిక మానవ సమాజంలోనే నిర్మూలించడం సాధ్యపడుతుందనే అవగాహనతో కూడిన కార్యాచరణకు ఉపక్రమించాలి.

***

గోవధ నిషేధంతో కప్పబడ్డ వాస్తవాలు...

ఇటీవల కేంద్ర ప్రభుత్వం గోవధను నిషేధిస్తూ తానొక శాంతి దూతలా కనపడాలని, పర్యావరణ, జీవ వైవిధ్యాన్ని, మూగజీవాలని రక్షించే బాధ్యత తనపైననే ఉన్నదని ప్రదర్శించుకుంటుంది. దీనిని ఆడం-ఈవ్-ఆపిల్ పండు కథ చందంగా అభివర్ణించవచ్చు. ఈ నిషేదాన్ని వ్యతిరేకించేవారు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రూపానికి జీవ రక్షణగా గోచరించినా సారంలో భారతదేశంలోని బహుసంఖ్యాకుల ఆహారాన్ని అడ్డుకోవడమని, గోమాంసం భుజించే దిగువకులాల-ముస్లింలపై ఎక్కుపెట్టిన దాడిని, ఇది మత దురహంకార నిర్ణయమని నిరసన తెలుపుతున్నారు. ఇక ఈ నిషేధాన్ని హర్షించేవారు హిందూ ధర్మాన్ని రక్షించే బాధ్యత తమపై మరింతగా ఉన్నదని తమ గోరక్షక ప్రణాళికను ఉధృతపర్చే కార్యక్రమాలు సాగిస్తున్నారు. దీనితో ప్రజలు ఇప్పటివరకూ గోరక్షకులు గోవధశాలలు-వాటి నిర్వాహకులపై దాడిని కాస్తా గోమాంసము భుజించేవారిపైనా ఎక్కుపెడతారని భయభ్రాంతులకు గురౌతున్నారు.

భారతదేశంలాంటి వ్యవసాయ ఆధారిత సమాజంలో (పూర్వ పెట్టుబడిదారీ సంబంధాలు) ఉత్పత్తి పరికరాలు జీవ (ఎద్లు మొదలైనవి)-నిర్జీవ ఉత్పత్తి పరికరాలుగా (నాగల్లు మొదలైనవి) ఉంటాయి. జీవ ఉత్పత్తి పరికరాలు నిర్జీవ ఉత్పత్తి పరికరాల అనుభందంతో మానవ శ్రమ ద్వారా శ్రమ లక్ష్యాల ఉత్పత్తి కార్యక్రమంలో సజీవంగా చలామణీ అవుతాయి. ఐతే ఇటీవల ప్రభుత్వ పథకాల ఫలితంగా గ్రామాలల్లో కొద్దిమంది చేతులలో భూకేంద్రీకరణ విపరీతంగా ప్రోగుపడటంతోపాటుగా ఈ భూసాగుకు ఆధునిక యంత్రాల వాడకమూ పెరిగింది కావున కనీసం సెంటు భూమిని కలిగినవారి శాతం రోజురోజుకూ దిగజారిపోతుంది. కొద్దోగొప్పొ భూమి ఉన్న వారుకూడా యంత్రాలను అద్దెకు తెచ్చుకుని

భూసాగు చేస్తున్నారు, దీనితో భూమిపై ఆధారపడిన జీవ-నిర్దిష్ట నిర్జీవ ఉత్పత్తి పరికరాలు దెబ్బతింటున్నాయి. పశువుల వాడకం వ్యవసాయ అవసరాలలో తగ్గుముఖం పట్టడంతో వాటిని ఆధారం చేసుకునే నిర్జీవ ఉత్పత్తి పరికరాల తయారీ వెనకపట్టు పడుతుంది దీనితో వీటి తయారీదారులూ ఉపాధిని కోల్పోతున్నారు. ఇక పశువుల పెంపక ఆవశ్యకత తగ్గుతుండటంతో వాటి పరిరక్షణ కరువై రోజుకు దేశవ్యాప్తంగా సుమారూ వెయ్యికి పైగా మరణిస్తూ ఉన్నాయి.

వ్యవసాయాధారిత పరిశ్రమలో లాభసాటి వ్యాపార రంగంగా పాలు దాని ఉత్పత్తుల పరిశ్రమ అగ్రభాగన ఉన్నది ఆరోగ్యంగా ఉన్న పశువులు, మేలు జాతులను ఈ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలో వాడుకుండటం ఇటీవల బాగా వ్యాప్తిలోకి వచ్చింది, కానీ దేశవాలీ ఆవులు-గేదెలను ఉపయోగించడం బాగా తగ్గుముఖం పట్టి విదేశీ ఆవుల దిగుమతులు-వాడకం భారీగా పెరిగాయి. ఐతే వ్యవసాయంలో వాడుబడుతున్న రసాయనాలు-హైబ్రీడు విత్తనాల మూలంగా ఆవులు-గేదెల గడ్డిగ్రాసం కూడా కాలుష్యం నుండి ఏమాత్రమూ మినహాయింపుకు గురికావడంలేదు, ఫలితంగా గ్రామాలల్లో పశువులకు గడ్డి దొరకని స్థితినీ చూడవచ్చు, దీనితో వైద్యానికి అందని రోగాలతో మరణిస్తున్న వాటి సంఖ్య లెక్కకు మించినవి. ఇక ఈ పశువుల పాల ఉత్పత్తుల వల్ల మనుషులు వివిధ అనారోగ్యాలకు గురౌతున్నారు.

ఇకపోతే భారతదేశంలో మాంస భక్షణ 70శాతంగా ఉంది అందులో గోమాంస భక్షణ 25% పైగా ఉంటుంది, పాలకుల విదివిధానాల ఫలితంగా వస్తున్న అసమాన సామాజిక మార్పుల వలన ఆవుల-గేదల-ఎడ్ల మరణాలు 70శాతం పైగా ఉన్నాయి. గోవధను నిషేధిస్తూ 25 శాతపు గోమాంస భక్షణపై నియంత్రణని మోపడం పాలకుల వైఫల్యం కారణంగా 70 శాతం పశువుల మరణాల సామాజిక వాస్తవ కారణాలను కప్పిపుచ్చాలనే వ్యూహం, దీనితో ప్రజల్లో ఆందోళనలు, అనిశ్చిత పరిస్థితులు ఏర్పడతాయి. సమస్యల మూలాలని దారిమళ్ళించే పథకాలతో ప్రజలను గందరగోళ పరుస్తూ పరిపాలించే ఆచరణ ఎప్పటికీ సఫలం కాదని కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

***

గ్రామీణ ప్రాంతవర్గ పరిశీలన ఎలా చేయాలి?

గ్రామీణ ప్రాంత వర్గ పరిశీలనకు ఉపక్రమించేటప్పుడు, మనం ఆయా దేశాల యొక్క ఉత్పత్తి విధానాన్ని ముఖ్య భూమికగా తీసుకోవాలి. ఉత్పత్తి విధానం మొత్తం ప్రపంచ పరిస్థితులల్లో చూసుకున్నప్పుడు పెట్టుబడిదారీ విధానం దాని అనుబంధంగా ఉండే బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానము కలిగియున్నాయని గమనించాలి (ఇంకా ఆదిమ సమాజాలు ఉన్నా వీటిని ఇక్కడ ప్రధానంగా చర్చించడం లేదు). ఉత్పత్తి విధానం అంటే ఉత్పత్తి శక్తులు–ఉత్పత్తి సంబంధాలు. ఉత్పత్తి విధానానికి పునాది ఉత్పత్తి సంబంధము. ఉత్పత్తి సంబంధాలంటే ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యము–శ్రమ సంబంధాలు–పంపిణీ సంబంధాలు. ఉత్పత్తి శక్తులు–ఉత్పత్తి సంబంధాలను బట్టే అది ఏ వ్యవస్థనో పరిశీలించగలము. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క గ్రామీణ ప్రాంత వర్గాలు అర్ధ భూస్వామ్య విధాన వర్గాలకు భిన్నంగా ఉంటాయి.

ఇప్పుడు మనం భారత దేశాన్ని పరిశీలిస్తే ఈ దేశంలో బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ వ్యవసాయ ఉత్పత్తి విధానం ఉన్నది. ఈ ఉత్పత్తి విధానం యొక్క పునాది అయిన ఉత్పత్తి సంబంధాలను మనం పరిశీలించాలి. మన దేశం వ్యవసాయాధారిత దేశం కావున ఇక్కడ భూమి ప్రధాన ఉత్పత్తి లక్ష్యం. గ్రామాలల్లో ఉత్పత్తి సాధనమైన భూమి పై యాజమాన్యం–భూమి ఎంతెంత? ఎవరెవరి వద్ద ప్రోగై ఉన్నదీ గమనించాలి. శ్రమ సంబంధాలనగా ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ పాత్రలు (శ్రమశక్తి), ఉత్పత్తి

ఎవరి ప్రయోజనార్ధం పంపిణీ జరుగుతుందీ గమనించటంతో పాటుగా వినిమయం–మారకాలను సైతం తెలుసుకోవాలి. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో వస్తున్న శ్రమ–పంపిణీ సంబంధాల్లోని మార్పులను గ్రహిస్తాము. అంతేకాకుండా రాజకీయ–భౌద్ధికాంశాలను సైతం పరిశీలించాలి. ఆ ఊరిలో ఉండే దేవాలయాలు, వివిధ సంస్కృతులను తెలుసుకుంటే ప్రజల చైతన్యం గ్రహించవచ్చు.

ఇటీవల గ్రామీణ ప్రాంత వర్గ పరీశలనను భూమి కేంద్రంగా లేదా శ్రమ కేంద్రంగా చేస్తున్నారు. ఈ రెండింటినీ విడివిడి అంశాలుగా విభజించి పరిశీలన చేస్తున్నారు. అలా విడగొట్టి పరిశీలించడం తప్పు. పైన పేర్కొన్న విధానంతో గ్రామీణ పరిశీలన చెయ్యాలి. గ్రామీణ ప్రాంత వర్గ పరిశీలనలో సాపేక్షమైనటువంటి అంశాలను పరిశీలిస్తూ వాటిని అభివృద్ధి పరుచుకోవాలి. ఒక గ్రామాన్ని పరిశీలించి మిగతా గ్రామాలల్లో ఆ పరిశీలనను యథావిధిగా అన్వయించలేము. సార్వత్రికంగా పరిశీలించిన అంశాలను అభివృద్ధి పరుచుకొని వివిధ గ్రామాలకు అన్వయించి ఫలితాలను రాబట్టవచ్చు. పరిశీలన లేని అంశాలు అభిప్రాయాలు మాత్రమే కానీ శాస్త్రం మాత్రం అవ్వదని గ్రహించాలి.

***

ఎఫ్.డి.ఐ.ల విషకౌగిలిలో భారతదేశం

భారతదేశం నిరంతరం సంక్షోభంలోకి దిగజారిపోతుంది. రోజురోజుకు పెరిగిపోతున్న ఆహార సమస్య, అధిక ధరలు దేశంలోని అభివృద్ధి కార్యకలాపాలకు ఆటంకంగా మారుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం ఆంగ్లో అమెరికన్ పెట్టుబడులను దిగుమతి చేసుకుంటుంది. ఈ విదేశీ పెట్టుబడుల దిగుమతితో తానెదురుకుంటున్న సంక్షోభాన్ని పరిష్కరించుకుంటున్నానని భారత ప్రభుత్వం భ్రమలు పెట్టుకుంటుంది. కానీ విదేశీ పెట్టుబడిపై ఆధారపడటం మూలంగా తన అంతర్గత సంక్షోభం తీవ్రతరమౌతుంది. దీనితో ఈ సంక్షోభం కాస్తా భారత ప్రభుత్వానికి పరిష్కరించలేని సమస్యగా తయారవుతుంది.

విదేశీ పెట్టుబడి దేశానికి దిగుమతి చేయడం మూలంగా దేశీయ వ్యాపారం, అధిక లాభార్జనను అదుపుచేయడానికి భారత ప్రభుత్వం పూనుకుంటుంది. భారతదేశం లాంటి వెనుకబడిన దేశంలో రోజువారీ ఆహారపదార్థాల నిత్యావసర వస్తువుల వ్యాపారం అవసరము. అయితే ఈ వ్యాపారంపై అదుపు చేయడంతో రోజువారీ ఆహారపదార్థాల నిత్యావసర వస్తువుల వ్యాపారానికి అవసరమైన దేశీయ పెట్టుబడిని సృష్టించడానికి ఆటంకం ఏర్పడుతుంది. దీనితో ప్రజల నిత్యజీవితం కష్టంగా నడుస్తుంది. భారతదేశంలో యఫ్.డి.ఐ.ల ప్రవేశంతో పరిష్కారమౌతాయనుకున్న సమస్యలు పరిష్కరం కాక ఇంకా ఉధృతమవుతాయి.

యఫ్.డి.ఐ.లతో కొత్తగా వచ్చే ప్రయోజనాలు ఏమీ ఉండవు. తదనుగుణంగా ఉన్న సౌకర్యాలు అట్టడుగు స్థాయికి దిగజారిపోతాయి. అలాగే విలీనాలు, స్వాధీనాలు ద్వారా రిటైల్ రంగంలో ఉన్న దేశీయ సంస్థలను అదుపు చేస్తాయి. ఆధిపత్యం వహిస్తాయి. అద్భుతమైన మేనేజిమెంటు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానము ఉంటాయని, వీటితో దేశం ఎన్నో సౌకర్యాలు పొందుతుందనే భ్రమలో ఉంటుంది. కాని వీటితో కారుచౌకగా, అధికమైనటువంటి దేశీయ శ్రమను దోపిడి చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. యఫ్.డి.ఐ. ఏ రంగంలో ప్రవేశించినా ఆ రంగం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందనేది చారిత్రక సత్యం. దేశీయ రిటైల్ వ్యాపార సంస్థల విస్తృతి తగ్గిపోతుంది. ఇప్పుడున్న రోజువారి వ్యాపార సౌకర్యము ప్రజలకు అందని స్వప్నంలా ఉంటుంది.

అమెరికా, యఫ్.డి.ఐ.లను లాటిన్ అమెరికన్ దేశాలలో, ఆఫ్రికన్ దేశాలలో ప్రయోగించింది, ఆ ప్రయోగాల ద్వారా లాభాల రుచిని చూపించి, ఇప్పుడు ఆసియా దేశాలలోను ప్రయోగం కొనసాగుతుంది. అందులో భాగంగా భారతదేశము ఇప్పుడు ఒక సందర్భం, ఎందుకంటే అమెరికా ప్రపంచాధిపత్య విస్తరణలో ఈ దేశాన్ని రాజకీయ భాగస్వామిని చేసుకోవడం ముఖ్య ఉద్దేశం. యఫ్.డి.ఐ.లను ఈ దేశంలోనికి ఆహ్వానించడం కొత్త ప్రయోగం కాదు, ఎప్పటినుంచో ఈ దేశంలోకి యఫ్.డి.ఐ.లను వివిధ రంగాలలోనికి భారత ప్రభుత్వం ఆహ్వానించడానికి ప్రయత్నించింది. ఈ ప్రయత్నానికి విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, కర్షక, మేధావి వర్గాలు తీవ్ర వ్యతిరేకత ప్రదర్శించడంతో ఆ ప్రయత్నాన్ని ప్రత్యక్షంగా కాక పరోక్షంగా నిర్వహించాయి. (ఎన్‌డిఎ, యుపిఎ) యఫ్.డి.ఐ.లను నిలబెట్టాయి. భారత ప్రభుత్వం అవినీతి కుంభకోణాలతో సహజీవనం చేస్తుంది. బోగ్గు కుంభకోణం, కామన్‌వెల్త్ కుంభకోణం, 2 జి స్పెక్ట్రం ఇలా ఎన్నో ఉన్నాయి. వీటి సరసనే ఇప్పుడు యఫ్.డి.ఐ. కుంభకోణాన్ని జతకట్టాలి. దీనితోనే అర్థం చేసుకోవచ్చు. దేశం ఇప్పటికే విదేశీ పెట్టుబడి యొక్క ప్రత్యక్ష అదుపులో ఉంది. దీనికి భారత ప్రభుత్వం దాసోహమైపోయింది.

భారత ప్రభుత్వం విదేశీ పెట్టుబడి మూలంగా తన అంతర్గత సంక్షోభం మూలంగా దేశంలోని సమస్యలను పరిష్కరించలేదు. దీనితో ప్రజలు అసంతృప్తితో పేట్రేగిపోతారు. ఈ అసంతృప్తిని పరిష్కరించడానికి భారత ప్రభుత్వం తనను ఆదుకుంటానని మాట ఇచ్చిన అమెరికా వైపు తిరుగుతుంది. ఇప్పటికే అమెరికా పారిశ్రామిక సంక్షోభంలో కూరుకుపోయి నిరుద్యోగంతో సతమతమవుతుంది. దీనితో నిస్సహాయ స్థితిలోకి నెట్టబడ్డ భారత ప్రభుత్వం ప్రజల అసంతృప్తిపై దాడి చేస్తుంది. ఈ దాడితో ప్రజల అసంతృప్తి కాస్తా పోరాటం వైపుకు మరులుతుంది. కావున ప్రజల్ని ఈ అవినీతి ప్రభుత్వపు పతనంతోనే సమస్యలకు, సంక్షోభాలకు పరిష్కారం అని మేలుకోల్పాలి. మార్గదర్శకత్వం అందించాలి. కావున ఈ దేశం ఉన్నత సంస్కృతిలోకి ప్రవేశించకుండా నిరంతరం అడ్డగిస్తున్న దోపిడి శక్తులను నిర్మూలించడమే నేటి మన కర్తవ్యం.

***

తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకుంటున్న పాలక పార్టీలపై తిరగబడండి

ఇటు తెలంగాణా కోసమే పనిచేస్తున్న టిఆర్‌యస్ నుంచి తెలంగాణకు వ్యతిరేకం కాదు అంటున్న టిడిపి అలాగే 28-1-2013లోగా తెలంగాణపై స్పష్టమైన ప్రకటన చేస్తానన్న కాంగ్రెస్ వరకూ తెలంగాణ ప్రజలను మోసం చేశారు. నేడు ఒక నెలలో ప్రకటనంటే ముప్పై రోజులే కాకపోవచ్చు రోజులు, నెలలూ పొడిగించవచ్చని తెలంగాణాంశాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం సమైక్యాంధ్రకి మద్దతుగా ఉన్న పార్టీల నుంచి అలాగే తన సొంత పార్టీ అయిన కాంగ్రెస్‌లోని సమైక్యాంధ్ర నాయకుల నుంచి డబ్బు రూపంలో ముడుపులు పొందుతూ ప్రజా ఉద్యమమైన తెలంగాణను పట్టించుకోవడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఏర్పడితే తనకు ఎన్ని సీట్లు రావచ్చు అనే కోణంలో ఆలోచిస్తుంది తప్ప ప్రజల డిమాండ్లను పరిష్కరించేటట్లు లేదు. ఇక పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారమవుతుందనే విషయం తెలిసి కూడా మాట మద్దతు మాత్రమే ఇస్తున్నామని ప్రకటించిన సిపిఐ (CPI) దీనితో తన రివిజనిస్టు మొకాన్ని బయటపెట్టుకుంది. ఇంకోవైపున మేము ప్రత్యేక రాష్ట్రానికి మద్దతు ఇవ్వడంలేదని రాష్ట్రాన్ని సమైక్యముగా ఉండాలని డిమాండ్ చేస్తున్న సిపిఎం (CPM), మార్క్స్ బోధించిన సూత్రాలనే కాలదన్ని తన నయా రివిజనిస్టు ధోరణిని ప్రదర్శిస్తుంది. అలాగే తెలంగాణ ఉద్యమాన్ని కాషాయంతో నింపాలని, హిందుత్వంతో పరిపాలించాలని బిజెపి తాపత్రయ పడుతుంది. ఇన్ని ప్రకటనలు, ఇన్ని చర్చలు ఒక

అంశంపైనే జరుగుతున్నాయంటే తెలంగాణని పాలక పార్టీలు ఎన్నికలలో భాగంగానే చూస్తున్నాయి. కానీ ప్రజా పోరాటంగా ముందుకొస్తున్న ఉద్యమాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే కోదండరాం, టి.యస్.జాక్‌లు పాలక పార్టీల తొత్తులుగా ప్రజాపోరాటాన్ని పాలక పార్టీలకు తాకట్టు పెట్టేవారుగా తమ పాత్రను ప్రజలముందు బహిరంగపరుచుకున్నారు. తెలంగాణ కోసం పోరాటాలు అన్నీ ఒడిదుడుకులే, విజయాలకన్నా అపజయాలే, ఈ రోజు చాలా ప్రజాసంఘాలు తమ వివిధ అభిమాన చిట్కాలతో తెలంగాణను ఏర్పరచాలనుకుంటున్నారు. వారి సంపూర్ణ నివారిణులు పూర్తి ఫలితాలను ఇవ్వలేవనే విషయాన్ని ప్రజల మనసులలోకి ఎక్కేటట్లు చేసి ప్రజాపోరాటాల ద్వారానే తెలంగాణను సాధిస్తారని చైతన్యపరచాలి. ఈరోజు ప్రజాస్వామిక ఉద్యమ డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చలేని స్థితిలో ఉన్నాయి. ఎందుకంటే పెట్టుబడి యొక్క అంతర్గత అంతర్జాతీయ సంక్షోభమే అందుకు గల కారణం. కావున ఏ ప్రజాస్వామిక ఉద్యమాన్నైనా శాంతి భద్రతల దృష్ట్యా చూస్తూ ఉద్యమాలను అణచివేస్తున్నాయి. చరిత్రలోని పోరాటాల అనుభవాలని పరిగణలోనికి తీసుకుని తెలంగాణని సాదిద్దాము.

***

తెలంగాణపై అఖిలపక్ష భేటి - ప్రజావంచన

కేంద్రం ఇప్పటికే తెలంగాణ అంశంపై వివిధ ప్రకటనలు, వివిధ కార్యాచరణలు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కోసం జరుగుతున్న ప్రజాఉద్యమం పక్కదోవ పట్టడానికి ప్రధాన దోహదకారిగా ఉందనేది తెలంగాణపై దాని వైఖరే స్పష్టతను ఏర్పరుస్తుంది. కేంద్ర ప్రభుత్వం బలమైన కేంద్ర అధికారాన్ని మన రాష్ట్రంపై ఏర్పర్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తుంది. ఈ కేంద్రీకరణ పెట్టుబడి యొక్క ప్రవేశానికి అత్యంత సులభమైన మార్గాన్ని ఏర్పరుస్తుంది. కేంద్ర ప్రభుత్వం యొక్క కేంద్రీకరణలో రాష్ట్రాన్ని ఉంచడానికే అఖిల పక్ష భేటీని ఏర్పర్చింది. ఇప్పటివరకూ జరిగిన ప్రజా ఉద్యమాన్ని పక్కన పెట్టి తెలంగాణ అంశాన్ని వివిధ బూర్జువా పార్టీల మధ్య అంశంగా, ఎన్నికలలో పాల్గొనే వివిధ పార్టీలపై నమ్మకాన్ని ఏర్పర్చడానికి కేంద్రంగా ప్రయత్నిస్తుంది. ఈ కేంద్రపు కేంద్రీకరణా సూత్రం విభిన్న పార్టీల మధ్య వైరుధ్యాలని, రాష్ట్ర కేంద్రపు ప్రయోజన వైరుధ్యాన్ని పెట్టుబడి ద్వారా పరిష్కరించడమే ప్రధానాంశముగా అఖిలపక్ష భేటి జరిగింది. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ప్రజాసమస్యలను పరిష్కరించే స్థితిలో లేదనేది నిర్వివాదాంశం. 2జి స్పెక్ట్రం నుంచి ఎఫ్.డి.ఐ.ల వరకూ కేంద్ర ప్రభుత్వం పాత్రను గానీ మనం పరిగణలోకి తీసుకుంటే కేంద్రం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అనడానికి కొంత కూడా అవకాశం లేదు.

ఇకపోతే మన రాష్ట్రం యొక్క స్థితిగతులను గమనిస్తుంటే వివిధ పార్టీలు తెలంగాణ అంశాన్ని ఎన్నికలలో ఓటు బ్యాంకులో భాగంగా చూస్తున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కార్మిక, కర్షక విద్యార్థి వర్గం ఎప్పుడు నాయకత్వపు స్థాయికి ఎదుగుతున్నా మన రాష్ట్రంలోని వివిధ పార్టీలు ఆ

నాయకత్వాన్ని విచ్ఛిన్నం చేసి తమ నాయకత్వాన్ని ప్రతిష్ఠించుకోవడం కోసమే ప్రయత్నించడం జరుగుతుంది. ఆ విధంగా బలమైన తెలంగాణ వాదాన్ని, వివిధ ప్రజా సమస్యలను పక్కకు పెట్టి వివిధ పార్టీలు రాష్ట్రంలో అధికారం కోసం పాకులాడటాన్ని గమనించగలము. కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష భేటి యొక్క వాస్తవ వైరుధ్యాలను ప్రజలకు వివరించకుండా తెలంగాణ తెచ్చేది మేమే అని ఈ భేటిలో పాల్గొనడం ద్వారా వాటి నిజ స్వరూపం ఏమిటో తెలుస్తుంది. ఈ పార్టీలు రాష్ట్రంలో రాష్ట్రాన్ని ఉమ్మడిగా ఉంచాలనే ప్రయత్నంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వపు చర్యలను తీవ్రస్థాయిలో వ్యతిరేకించడంలేదు. పైగా ప్రజా ఉద్యమంగా ఉన్న తెలంగాణాంశాన్ని వివిధ ఎన్నికల పార్టీల అంశంగా మలచడానికి ప్రభుత్వపు కుట్రలో ప్రతీ పార్టీ భాగమైంది. అలాగే ఇప్పుడు మన రాష్ట్రంలో మత కలహాలను సృష్టించడానికి అన్ని పార్టీలు సిద్ధమైనాయి ఇందుకు కేంద్రం వెన్నెముకగా ఉండి నడిపించడాన్ని గమనించగలము. ఈ మత కలహాల ద్వారా దోపిడీ దారీ వర్గం జాతీయ వాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలను, ప్రజా ఉద్యమాలను పక్కదోవ పట్టిస్తున్నారు. ఈ అంశాల ద్వారా రాష్ట్రంలో పెట్టుబడిని వివిధ ప్రాంతాలలో సులభంగా ప్రవేశపెట్టి లాభాలని గడించాలనే కుట్రపూరిత రాజకీయ ఎత్తుగడేనని గమనించాలి.

ఈరోజు పెట్టుబడికి వ్యతిరేకంగా సోషలిజం ఒక్కటి మాత్రమే కొట్లాడగలదనేది కాకుండా ప్రజాతంత్ర ఉద్యమం కూడా పెట్టుబడికి వ్యతిరేకంగా కొట్లాడగలదనే అవగాహనలో భాగంగానే మనం ప్రత్యేక తెలంగాణను అటుపిమ్మట ప్రజాస్వామిక తెలంగాణను సాధించడమే ధ్యేయంగా పనిచేయాలి. ఈరోజు తెలంగాణలో ప్రజా ఉద్యమం పాలక పార్టీలకు అతీతంగా ఎదగడాన్ని గమనించగలము. మిలియన్ మార్చ్ అనో, తెలంగాణ మార్చ్ అనో ఇక నుండైనా అత్యుగ్రవాద చర్యలకు, పిలుపులకు స్వస్తి పలకాలి ఎందుకంటే ఉద్యమాన్ని కొన్ని ప్రాంతాలకు విస్తరించి కేంద్ర అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే రివిజనిస్టు ధోరణినుండి ఉదయించినదే ఈ సమస్య. కావున మన సరైన మార్గం కామ్రేడ్ చారుమజుందార్, కామ్రేడ్ కన్హాయిచటర్జీ చూపిన మార్గం, ప్రాంతాలవారీగా అధికారం హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా ఉద్యమాన్ని గ్రామాల నుండి పట్టణాలను రగిలించాలి. రండి మిత్రులారా ఉద్యమంలో భాగమవుదాం!

***

అభివృద్ధికి నోచుకోని తెలంగాణ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాధించలేని ప్రగతి ప్రత్యేక రాష్ట్రంతోనూ సాధించలేమనే మార్క్సిస్టుల భావన రోజురోజుకూ తెలంగాణలోని పరిపాలనను బట్టి రుజువవుతుంది. ప్రాంతీయ అసమానత అనేది బహిరంగ దోపిడీ కారణాల ఫలితమనే చిత్రీకరణ పటాపంచలై ఈ రోజు ఆ ప్రాంతపు అంతర్గత పరిస్థితులే అసమానతకు మూలమవుతాయనే నిజం బయటపడుతుంది. ఈ పరిస్థితులు బలపడ టానికి బహిరంగ కారణాలు ఉపయోగపడ్డాయనేవి నిర్వివాదాంశము.

భారత దేశంలాంటి వ్యవసాయాధారిత సమాజంలో అభివృద్ధి సమాంతరంగా రెండు పార్శ్వాల్లో సాగాలి– ఒకటి భూ సంస్కరణలు, ఉత్పత్తి పరికరాల పంపిణి, శ్రమ–మారకపు సంబంధాల్లో మార్పు, విత్తనాలు–ఎరువుల పంపకం, నీటి సౌకర్యాలు, మార్కెటింగ్ వసతి, రోడ్ల నిర్మాణం, విద్యుత్తు సరఫరా, వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనతో పాటుగా–రెండవది సరైన గృహ కల్పన, త్రాగునీరు, డ్రైనేజీ వసతులు, ఆరోగ్య వసతులు, విద్యా సౌకర్యాలు, రవాణా సదుపాయాలు మొదలైనవిగా ఉంటాయి. ఈ అభివృద్ధి మొత్తానికి భూ పంపకం కీలక పాత్ర పోషిస్తుంది, మన దేశంలో భూ పంపకం రెండు పార్శ్వాల్లో జరగాలి– ఒకటి సంపూర్ణ వ్యవసాయ ఆధారిత వ్యవస్థలో భూ పంపిణి, రెండు వ్యవసాయం ప్రధానం కాని గిరిజన తెగలను వ్యవసాయాధారిత పునాది పైకి తీసుకురావడంకై భూ పంపిణి. ఐతే అభివృద్ధి పథకాలను అమలు చేసే క్రమములో వైరుధ్యం యొక్క పరిష్కారం ఒక దశకు చేరుకున్నప్పుడు వైరుధ్యం యొక్క మొత్తమే

పరిష్కరించబడిందనే స్థితిలోకి జారుకుంటూ అభివృద్ధిని పరిమితాంశముగా మార్చడం జరుగుతుంది. ఫలితంగా అభివృద్ధి యొక్క నిర్వచణం పూర్తిగా మారిపోతుంది.

ఇకపోతే తెలంగాణలాంటి రాష్ట్రంలో అభివృద్ధి పగటి కలలా మారిపోయింది. రాజకీయ పార్టీలు కుల-మత సమీకరణలు, మాఫియా దందాల నిర్వాహణతో ప్రజలను మభ్యపెడుతూ ఎన్నికల గెలుపోటముల కొరకు కాలాన్ని వెల్లబుచ్చుతున్నారు. దీనితో సాంఘిక అసమానతలు రోజురోజుకూ తీవ్రతరమౌతున్నాయి, కుల దృక్పథాలతో ప్రజలు సమీకరించబడుతూ పోరాటాలనుండి దూరం చేయబడుతున్నారు. కావున "ఏ కులతత్వమైనా కుల దృక్పథమే, మనుధర్మమే" అన్న త్రిపురనేని మధుసూధనరావు మాష్టారు గారి వాస్తవ విశ్లేషణను అందిపుచ్చుకుని తెలంగాణలో పెంపొందుతున్న కుల ఉద్యమాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం నేడు మన బాధ్యత.

నేడు అభివృద్ధి కొరకు తెలంగాణ ప్రజల పడిగాపులు మరో ఉద్యమాన్ని ప్రేరేపిస్తున్నాయి, అభివృద్ధిని అమలుచేసే రాజకీయ ఉద్యమం దిశగా తెలంగాణ రాష్ట్రాన్ని నడిపించడం నేటి తక్షణకర్తవ్యం.

***

విప్లవయోధుడు కాస్ట్రో

'ఫైడల్ కాస్ట్రో రజ్', ఈ పేరు వినగానే అమెరికన్ సామ్రాజ్య వాదం ఉలిక్కిపడక తప్పదు. ప్రపంచ అగ్రనేతగా చలామణీ అవుతున్న అమెరికాకు కేవలం 150 కిలోమీటర్ల దూరంలో ఉండే క్యూబాకు కమ్యూనిస్టు విప్లవ నాయకుడిగా,దేశాదినేతగా 49సంవత్సరాలు పరిపాలించారు. 2008లో తన బాధ్యతలను సహ పోరాట యోదుడైన తన తమ్ముడు రావుల్ కాస్ట్రోకు అప్పగించి, తాను 25,2016 శుక్రవారం మరణించేవరకూ విప్లవ సాంప్రదాయాన్ని కొనసాగించారు.

ఫైడల్ కాస్ట్రో క్యూబా లోని ఓరియంటే రాష్ట్రంలో 1926 ఆగస్టు13న జన్మించారు, హవానాలో స్కూలు విధ్యనభ్యసించి హవానా విశ్వవిధ్యాలయంలో లా విధ్యలో పట్టబద్రుడైనాడు ఇక్కడే 1947 లో ఆర్దడాక్స్ పార్టీలో సభ్యుడై విద్యార్ధి నాయకునిగా నియంత బటిస్టాకు, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసారు. లాటిన్ అమెరికా విద్యార్ధి మహాసభను జరపడానికి కాస్ట్రో బృందం కొలంబియాలో ప్రచారం చేస్తుండగా గైటన్ అనే ప్రజా న్యాయవాదిని హతమార్చింది CIA. దీనికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు నిర్వహించారు. ఈ తిరుగుబాటులో కాస్ట్రో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నాడు, ఈ తిరుగుబాటు విఫలమైన తరువాత క్యూబా చేరుకున్నాడు. డొమినికన్ రిపబ్లిక్ ట్రుజిల్లో నియంత పరిపాలనలో తీవ్ర కష్టాలు ఎదురుకుంటుంది దీనికి వ్యతిరేకంగా క్యూబా సాయుధ పోరాటానికి బృందాలను పంపారు. దీనిలో కాస్ట్రో పాలుపంచుకున్నారు దీనిని మధ్యలో అపేసారు. ఈ పోరాట అనుభవాలతో అతిత్వరలోనే క్యూబా సాయుధ పోరాటంతోనే విముక్తి సాధిస్తుందనే దృడసంకల్పంతో 1953 జులై 26న శాంటియాగో డి క్యూబాలోని మాంకోడా సైనిక స్థావరంపై తిరుగుబాటు

జరిపారు, కానీ కొన్ని సాంకేతిక, నిర్మాణ లోపాలవల్ల తిరుగుబాటు ఓడిపోయింది. బటిస్టా ప్రభుత్వం కాస్ట్రోతో సహా 24 మందిని నిర్బంధించింది, 60 మందికి పైగా తిరుగుబాటుదారులను హతమార్చారు. కాస్ట్రోకు 15 సంవత్సరాలు జైలు శిక్షను విధించారు. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేయగా 22 మాసాలకే కాస్ట్రో బృందాన్ని విడుదల చేశారు. 1955 జులై 7న కాస్ట్రో మెక్సికో చేరుకుని క్యుబా విప్లవ తిరుగుబాటుకు సన్నాహాలు నిర్వహించాడు, 1956 నవంబర్ లో గ్రాన్మా పడవలో 81 మంది తిరుగుబాటుదారులతో క్యూబా ప్రయాణమయ్యారు, ఈ ప్రయాణ విషయం పసిగట్టిన బాటిస్టా తన సైన్యాన్ని కాస్ట్రోను అంతంచేయడానికి పంపాడు. కాస్ట్రో బృందం అనుకోని ఈ దాడిలో తీవ్రంగా నష్టపోయారు, చాలామంది చనిపోయారు. పదుల సంఖ్యలో మిగిలిన వారు చెల్లాచెదురై సియొర్రామస్త్రా కోండల్లోకి పయనమై తిరిగి పుంజుకుని సాయుధ గెరిల్లా పోరాటంతో ప్రజలను సమీకరించి బాటిస్టా ప్రభుత్వాన్ని 1959 జనవరి 1న గద్దెదించారు. కాస్ట్రో 1959 ఫిబ్రవరి 16న ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. జులై 26 పోరాటంగా ఈ తిరుగుబాటుకు పేరు. కాస్ట్రో తన అనుచరులు 1960 లలో క్యూబా కమ్యూనిస్టు పార్టీలో విలీనమైయ్యారు.

కాస్ట్రో ప్రభుత్వాన్ని కూల్చడానికి అమెరికా క్యూబాతో దౌత్య సంబంధాలు నిలిపివేయడం, క్యూబాను దిగ్బంధించి ఆర్థిక నష్టాన్ని ఏర్పర్చడంతో పాటుగా బే ఆఫ్ పిగ్స్ ప్రాంతంలో సైనిక కుట్రతో ప్రభుత్వాన్ని కుల్చే ప్రయత్నం, కాస్ట్రోపై 600కు పైగా హత్యాయత్నాలు గావించడం క్యూబా అభివృద్ధిని ఆటంకపరచలేకపోయింది. కాస్ట్రో నాయకత్వంలో భూసంస్కరణలు, పరిశ్రమల జాతీయం, బ్యాంకుల జాతీయం, బహుళ జాతి కంపెనీల ఆస్తుల జప్తు, అందరికీ నిర్బంధ ఉచిత విద్యా సౌకర్యం, జుదశాలలు, వ్యభిచారాలను కట్టడిచేయడంతో పాటుగా అంతర్జాతీయ కమ్యూనిస్టు, సాయుధ పోరాటాలకు మద్ధతు, సహాయం క్యూబా బాధ్యతగా మలచిన ఘనత కాస్ట్రోకు దక్కుతుంది.ప్రపంచ వ్యాప్తంగా క్యూబా విప్లవ నమూనాను, సాయుధ పోరాట విధానాన్ని అభివృద్ధిపరిచిన శక్తి కాస్ట్రోది. ప్రపంచ కమ్యూనిస్టు నేత కాస్ట్రో మరణం భరించరానిది, కానీ అతడు చూపిన మార్గానికి అంతం లేదు.

***

రెడార్మీ - లాంగ్‌మార్చ్

రెడార్మీ లాంగ్ మార్చ్ పుస్తక రచన లియౌపొ-చెంగ్, ఇతరులు చేశారు. ఈ పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించింది. ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించినది కె.కేశవరెడ్డి గారు. ఈ పుస్తకం ప్రధమ ముద్రణగా 1985 ఆగస్టున అలాగే ద్వితీయ ముద్రణగా 1991, ఫిబ్రవరిన వెలువడింది. ఈ పుస్తకానికి ముందుమాట కామ్రెడ్ మావో రచించారు.

ఈ పుస్తక రచయితలు స్వయంగా లాంగ్-మార్చ్‌లో భాగస్వామ్యమైన, పాలుపంచుకున్నవారూ. వీరు తమ అపూర్వ అనుభవాలను ఈ పుస్తకం ద్వారా తెలియపరిచారు. ఈ పుస్తకం ప్రపంచ ఆధునిక చరిత్రలో విశిష్టమైన, సంపూర్ణమైన, విశ్వజనీన పార్శ్వం కలిగిన యుద్ధతంత్రాన్ని అభివృద్ధిపరిచిన లాంగ్ మార్చ్ ఘట్టాన్ని వివరించింది. (మావో దీర్ఘకాలిక యుద్ధతంత్రంలో అభివృద్ధి చెందిన వెసలబాటు యుద్ధపు సూత్రంలో అంతర్లీన భాగస్వామ్యం లాంగ్ మార్చ్). చైనా కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో గల కార్మిక-కర్షక ఎర్రసైన్యం 1934 అక్టోబర్ నుండి 1936 అక్టోబర్ వరకూ 12,500 కిలోమీటర్లు, రెండు సంవత్సరాలు అతిదుర్భేద్యమైన దారులు గుండా, నదుల గుండా, కొండలు గుండా ప్రయాణం చేస్తూ జపాన్ సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడటానికి వ్యూహాత్మక స్థావరాన్ని స్థాపించే లక్ష్యంగా అడుగులు వేసింది. ఈ కష్టతరమైన ప్రయాణంలో చైనా ప్రజల అంతర్గత శత్రువు చాంగ్-కై-షేక్ సైన్యాన్ని ఎదుర్కుంటూ, యుద్ధ ప్రభువులను, వారి తబేదారులను ఓడిస్తూ ముందుకుసాగింది. ఈ చారిత్రక బాధ్యతాయుత క్రమంలో ఎదురుకున్న అనుభవాలే ఈ పుస్తకం.

దేశవ్యాప్తంగా పునాది ప్రాంతాలను నిర్మించుకుంటూ పురోగమిస్తున్న కమ్యూనిస్టు పార్టీపైనా, దాని ఎర్రసైన్యంపైనా చాంగ్–కై–షేక్ సైన్యం నాలుగు చుట్టివేత–అణచివేత క్యాంపేన్లను జరిపారు. ఈ దాడులను ప్రజా ఎర్రసైన్యం తిప్పికొట్టింది. ఈ సందర్భంలో చాంగ్–కై–షేక్ అయిదవ చుట్టివేత–అణచివేత క్యాంపేన్ దాడిని దూకుడుగా ముందుకు తీసుకొచ్చాడు. చైనా కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత సైద్ధాంతిక సంఘర్షణ ఫలితంగా ఈ దాడిని ఎదురుకునే పరిస్థితిలో లేదు, ఎందుకంటే పార్టీ కేంద్ర కమిటీ నాయకుడైన వాంగ్–మింగ్ దేశవ్యాప్తంగా తక్షణ విప్లవ పరిస్థితి ఏర్పడిందని, ప్రత్యక్షంగా శత్రువుసైన్యాలను ఎదురుకోవచ్చు అనే వాదనను ముందుకు తెచ్చాడు, ఈ వాదనను కమ్యూనిస్ట్ పార్టీ స్వీకరించినది. దీనితో ఎర్రసైన్యం తీవ్రమైన అణచివేతను ఎదురుకుని బారీ నష్టాలను పొందింది. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితిలో కమ్యూనిస్టు పార్టీ తన ఎర్రసైన్యాన్ని వ్యూహాత్మక పునాది ప్రాంతాలను విడిచి పశ్చిమ దిశగా ప్రయాణం సాగింపచేసారు. ఈ ప్రయాణంలో ఎర్రసైన్యం తీవ్రమైన నష్టాలను ఎదురుకునీ, నిస్సహాయ స్థితిలో ఉంది. ఇటువంటి పరిస్థితిలో క్వాంట్–టుంగ్–క్వాంగ్సీ–హునాన్ సరిహద్దు నుండి శత్రువు బలహీనంగా ఉన్న క్వీచే సరిహద్దుకు సాగి సున్–ఇ అనే ప్రాంతంలో ఆగి పార్టీ కేంద్ర కమిటీ సమావేశం జరుపుకుని వాంగ్–మింగ్ పంథా యొక్క తప్పిదాలను ఎత్తి చూపి మావో యొక్క వెసులుబాటు యుద్ధతంత్రాన్ని, గెరిల్లా యుద్ధతరహా దాడులను స్వీకరించి మావో నేతృత్వంలో కొత్త కమిటీని ఏర్పర్చుకుంది. ఈ సమావేశపు చర్చలలో చాంగ్–కువా–టావో ఎర్రసైన్యాన్ని నైరుతి దిశగానున్న మైనారిటీ జాతుల ప్రాంతంలోనికి తీసుకొని పోయి స్థిరపర్చాలనే ప్రతిపాదన చేసాడు, ఈ ప్రతిపాదన మితవాదమని వ్యతిరేకించబడి మావో సూత్రీకరణల యొక్క యుద్ధ పద్ధతిలో, ప్రజా సమీకరణలు జరగాలని జపాన్ వ్యతిరేక జాతీయ వ్యూహాత్మక పునాది ప్రాంతాన్ని ఏర్పర్చాలని ఆ దిశగా శత్రువు బలహీనంగా ఉన్న ప్రాంతాలగుండా ఈ ప్రయత్నం సాగిస్తూ వెళ్ళాలని తీర్మానించింది. ఈ తీర్మానంతో ఎర్రసైన్యం పునర్నిర్మాణమై, విశ్రాంతి పొంది మళ్ళీ పుంజుకుని శత్రువును ఎదుర్కోవడానికి సిద్ధమైంది.

శత్రువు బలహీనంగా ఉన్న క్వీచే ప్రాంతాన్ని విముక్తి చేస్తూ సాగాలని తీర్మానం జరిగింది. అక్కడ నుండి ఉత్తర దిశగా సాగాలని ఆదేశాలు జారీ అయినాయి. ఉత్తర దిశగా సాగడంలో యాంగ్–జీ నదిని దాటడం, ఈ నది యొక్క ఉపనది అయి టాటూ నదిని దాటడం గొప్ప ప్రయత్నం, సాహసం ఎన్నో త్యాగాలు చేయవలసి వచ్చింది. అక్కడ నుండి మైనారిటీ జాతుల నిలయమైన ఈ తెగల ప్రాంతం గుండా సాగడం, గొప్ప గడ్డి భూములు, బురద నేలలను ఎదురుకోవడం, మంచు పర్వతాలను దాటడం జరిగింది. ఈ యాత్రలో చాంగ్–కై–షేక్ తొత్తు సైన్యం, జెమయాన్ రాష్ట్రపు యుద్ధ ప్రభువు సైన్యాలు, షేన్సి యుద్ధ ప్రభువుల దాడులను ఎదుర్కుంటూ సుమారు మూడులక్షల మంది సైన్యంగా బయలుదేరిన ఎర్రసైన్యం ముప్పైవేలమందిగా మిగిలారు. పావోసోయుద్ధాలు, చిలోబిన్ యుద్ధాలు గెలిచి షెన్సి–కాన్సు–నింగ్సియా సరిహద్దులోని ఏనాన్ ప్రాంతం చేరుకున్నారు. ఈ ఏనాన్ ప్రాంతాన్ని జపాన్ దురాక్రమణ వ్యతిరేక జాతీయ వ్యూహాత్మక పునాది ప్రాంతంగా కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పర్చింది.

ఈ విధంగా ఎర్రసైన్యం శత్రువు యొక్క నిర్బంధానికి వ్యతిరేకంగా వ్యూహాత్మకంగా తిరోగమిస్తూ తన లాంగ్ మార్చ్‌ను జైత్రయాత్రగా మలిచింది. ఏనాన్ ప్రాంతం జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్యసంఘటనా స్థావరంగా అభివృద్ధి పరచడమేకాదు చాంగ్–కై–షేక్‌ను అనివార్యంగా దేశభక్త సంఘటన ఏర్పాటుకు నేట్టివేయడము జరిగింది. (చాంగ్–కై–షేక్ ప్రజా ఐక్యసంఘటనకు విద్రోహం చేసి ప్రజా ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నించాడు, జపాన్ ఓటమి తరువాత అమెరికన్ సామ్రాజ్యవాదం జట్టు కట్టాడు, కాని ప్రజా పోరాటం ముందు నిలవలేక చైనా వదిలి తైవాన్ పారిపోయాడు. చైనా 1 అక్టోబర్ 1949 నా మావో నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ఏర్పర్చుకుంది). ఈ పుస్తకంలో ఇరవై కథలు (ఇలా కథలు అనడం సరికాదు) వివరింపబడినాయి. ఈ ఇరవై కథలూ ఎర్రసైన్యం యొక్క సహనం, సర్దుబాటు, లక్ష్యం దిశగా అడుగులను వివరించే ఆణిముత్యాలు. ఎర్రసైన్యం యొక్క పెరుగుదలకు కారణాలు – ఏమని వివరించారంటే :

1) శత్రువు పురోగమించేటప్పుడు మనం వెనక్కి తగ్గుతాం.

2) శత్రువు ఆగినప్పుడు, విడిది చేసినప్పుడు మనం చికాకు పరుస్తాం.
3) యుద్ధం దాటవేయాలని శత్రువు ప్రయత్నించేటప్పుడు మనం దాడిచేస్తాం.
4) శత్రువు వెనుకంజ వేసేటప్పుడు మనం వెంబడిస్తాం.

అంతేకాకుండా ఎర్రసైన్యం యొక్క క్రమశిక్షణా సూత్రాలేమనగా:

1) మీరు ఇంటిని వదిలి వెళ్ళేటప్పుడూ తలుపులన్నింటినీ యథాస్థానాల్లో పెట్టాలి.
2) మీరు నిద్రించిన గడ్డిచాపల్ని చుట్టజుట్టి తిరిగి అప్పగించాలి.
3) ప్రజల పట్ల దయతోనూ వినయంగా ప్రవర్తించాలి. మీరు చేయగలిగినప్పుడు వారికి సహాయపడాలి.
4) మీరు బదులుగా పుచ్చుకున్న వస్తువులన్నింటిని తిరిగి యిచ్చివేయాలి.
5) పాడు చేసిన వస్తువులన్నింటికీ బదులుగా వస్తువులనప్పగించాలి.
6) రైతులతో వ్యవహరించే అన్ని సందర్భాల్లోనూ నిజాయితీగా ఉండాలి.
7) కొన్న వస్తువులన్నింటికీ ధర చెల్లించాలి.
8) ఆరోగ్య సూత్రాలను పాటించాలి; ప్రత్యేకించి మరుగుదొడ్లను ప్రజల యిండ్లకు తగినంత దూరంలో నిర్మించాలి.

ఈ విధమైనటువంటి కృషి, సాధన, పట్టుదల, క్రమశిక్షణ యుద్ధనైపుణ్యంతో ఎర్రసైన్యం చైనా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించింది. ఈ కర్తవ్యంలో సున్నీ ప్రాంత సమావేశపు ప్రాధాన్యతను, జపాన్ వ్యతిరేక ఐక్య సంఘటనకై ప్రజలను సమీకరించడం, సంఘాలు స్థాపించడం, ప్రతీ ఎర్రసైనికుడు ఒకరికోసం మరొకరు ఏవిధంగా త్యాగాలు చేసిందీ, తోడుగా నిలబడిందీ, రేషన్ సరఫరాల దళసభ్యుల నుండి వంట వండే దళ సభ్యుల వరకూ వారికున్న ప్రాధాన్యత, త్యాగాలను విస్మరించకపోవడం ఈ పుస్తకంలో ముఖ్యవిషయంగా ఉన్నది. ఆగకుండా వందల కిలోమీటర్లు ఆహారం లేకుండా సైతం నడవగలగడం, లక్ష్యం దిశగా సాగడం ఏ సైన్యానికి సాధ్యపడుతుంది. ఒక్క ఎర్రసైన్యానికి తప్ప! యుద్ధంలో ఏ కొంత విశ్రాంతి దొరికినా ప్రజలను చైతన్యవంతం

చేయడానికి చేసిన కృషి, ప్రజలపై అపారమైన నమ్మకాన్ని అలాగే వివిధ జాతుల పట్ల ఎర్రసైన్యం, కమ్యూనిస్టు పార్టీ విధానాన్ని ప్రజలకు తెలియచేయటం వంటివి, కళ్ళకు కట్టినట్లుగా ఈ పుస్తకం ద్వారా మనకు పరిచయమవుతాయి.

నేడు వెనకబడిన, పేదరికపు గ్రామీణ భారతదేశం దోపిడి పరిపాలకుల నుండీ, కుల వివక్ష, అంటరానితనం, బానిసత్వం, స్త్రీలు ఎదుర్కొనే వివక్షలకు కారణమైన వర్గ దోపిడీ నుండి విముక్తి కొరకు ఎర్రసైన్యం కమ్యూనిస్టు పార్టీల నుండి అనుభవాలు పరిశీలించాలి, సమీక్షించాలి, ఆచరించాలి.

ఎందుకంటే చైనా ఎర్రసైన్యం, కమ్యూనిస్టు పార్టీ మాత్రమే వారి ప్రజలను దోపిడి, పీడనల నుండి విముక్తి గావించింది (ఇప్పటి చైనాను పోల్చడంలేదు) ఎర్రసైన్యం నిలదొక్కుకుని యుద్ధం చేయడం, ప్రజలకు సహాయకారిగా ఉండటం, ప్రజా ఉత్పత్తిలో పాలుగొనడం, అత్యంత త్యాగ గుణం కలిగి ఉండటంతో పాటు పరిస్థితులపై, శత్రువు స్థితిగతులపై అవగాహనతో వెసులుబాటుతో కూడిన యుద్ధతంత్రం ద్వారా పునాది ప్రాంతాలను ఏర్పర్చుకుంటూ గ్రామాల నుండి పట్టణాలను స్వాధీనం చేసుకుని ఎర్ర ప్రభుత్వాన్ని స్థాపించింది. కావున ఈ అనుభవం మన భారతదేశానికి అత్యంత ఉపయోగకరం, అవసరం (ఇప్పటికే భారతదేశంలో మావోవాదాన్ని దండకారణ్యంలో రుజువు చేస్తున్నారని గమనించాలి, కావున ఈ పుస్తకం ద్వారా నేటి భారత ప్రజాసైన్యం (పి.యల్.జి.ఏ) త్యాగాలు, పోరాట పటిమ తెలుసుకోవచ్చు). ఈ రోజుకీ గ్రామాలకు వెళ్లాలా అనే వింత ప్రశ్నలేసే మిత్రులకు ఈ పుస్తకం కనువిప్పే అని చెప్పక తప్పదు. ఈ పుస్తకం ద్వారా మానవీయత యొక్క అత్యున్నత స్వభావాన్ని దర్శించగలము. ఇది మార్కెట్లో లభించడం లేదు, ఎక్కడైనా, ఎప్పుడైనా దొరికితే, తారాసపడితే తప్పక చదవగలరని ఆశిస్తున్నాను.

***

శాంతించని హెచ్‌సీయూ!

కాశ్మీర్‌లో జరుగుతున్న సైనిక పాలనకు, నిర్బంధానికి వ్యతిరేకంగా హెచ్‌సీయూలో కొందరు విద్యార్థులు కాశ్మీర్ ప్రజలకు మద్దతు పలుకుతూ జూలై 16న సభ నిర్వహించ పూనుకున్నారు. ఈ సభకు అనుమతి లేదని క్యాంపస్ సెక్యూరిటీ అడ్డుపడింది. అదే రోజు రాత్రి 11.30కు 30మంది విద్యార్థులు సభ నిర్వాహణకు వ్యతిరేకంగా ఎన్ఆర్ఎస్ హాస్టల్ నుంచి న్యూఎన్ఆర్‌యస్ హాస్టల్ వరకు ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశం ఎన్.ఆర్.ఎస్., న్యూ ఎన్.ఆర్.ఎస్. హాస్టల్స్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయటం. ఈ సంఘటన జరుగుతున్నప్పుడు ఈ హాస్టల్స్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ తతంగమంతా పకడ్బందీ వ్యవహారంగా ముందస్తు ప్రణాళికగా భావించవచ్చు. ఇటువంటి సంఘటనలు ఇకపై తీవ్రతరమయ్యే పరిస్థితులు ఉన్నాయని విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతుంది. ఇటువంటి భయోత్పాత సంఘటనలు పెంపొందించి వర్సిటీలో రాజకీయ చర్చలకు ఉద్యమాలకు గండికొట్టాలని భావించడం ప్రభుత్వానికి, వర్శిటీ యాజమాన్యానికి తగదు.

హెచ్‌సీయూలో ప్రైవేట్ సంస్థలకు భూముల కేటాయింపు, భవన నిర్మాణాల్లో కోట్ల కుంభకోణం (కాగ్ నివేదికలో వెల్లడి), కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, విద్యార్థుల వెల్ఫేర్ ఫండ్ కుంభకోణం, వివిధ స్థాయిల్లో కులవివక్ష, బూర్జువా సాంస్కృతిక విచ్చలవిడితనం, శాస్త్రీయ విద్యావిధానం కొరవడటం ప్రాథమిక సమస్యలుగా ఉన్నాయి. ఈ సమస్యలను

పరిష్కారించని స్థితిలో వర్శిటీ యాజమాన్యం – ప్రభుత్వాలు ఉన్నాయి. తాత్కాలికంగా ఏ సమస్యలనైనా విద్యార్థుల – ఉపాధ్యాయ యూనివర్శిటీ యాజమాన్య పారదర్శక సమన్వయ అవగాహనతో కూడిన సంక్షేమ కార్యకలాపాలు నిర్వహించటంతో ఒక మేరకు పరిష్కారం అభివృద్ధికి బాటలు వేయటం జరగవచ్చు. కానీ క్యాంపస్‌లో సంక్షోభిత స్థితిగతులను నిరంతరం పెంపొందించే పద్ధతిలో ఎటువంటి ఉద్యమాన్నైనా, చర్చలైనా అదుపుచేయగలమని వర్సిటీ యాజమాన్యం భావించడం సరైనది కాదు. ఇటువంటి స్థితి క్యాంపస్‌ను నిరంతర అగ్నిగుండంగా మార్చే పనిగా ఉంటుందని వర్శిటీ యాజమాన్యం, ప్రభుత్వం తెలుసుకోవాలి.

***

పద సూచిక

1. ఉత్పత్తి సాధనాలు / పరికరాలు : Instruments of Production
2. బౌద్ధిక ఉత్పత్తి : Intellectual Production
3. ఉత్పాదక శక్తులు : Productive Forces
4. ఉత్పత్తి సంబంధాలు : Production Relations
5. పక్షం : Thesis
6. వైరిపక్షం : Antithesis
7. సంశ్లేషణ : Synthesis
8. శ్రమశక్తి : Labour Power
9. విరోధాబాస : Paradox
10. భౌతికవాదం : Materialism
11. గతితార్కికం : Dialectics
12. అభావం : Negation
13. పరిమాణం : Quantity
14. గుణాత్మకం : Qualitative
15. వైరుధ్యం : Contradiction
16. ఆచరణ : Practice.